
ఆంధ్రసచిత్రవారపత్రిక



15-2-74

55


ఆమె సున్నితమైంది...ఆమె అర్థంకానిది...
ఆమె మృదువైంది, దృఢమైంది, సౌందర్యం
సంతరించుకున్నది...అందుకే ఆమె పరిపూర్ణ స్త్రీ...
పట్టువంటి టాల్క్...అనురాగ పూరితమైనది.
మిమ్మల్ని అలరించేది. సరికొత్త సువాసనతో
మిమ్మల్ని రంజింపచేసేది. అదే మీ వీయిల్
ఆఫ్ లౌ. హేలో వారు మాత్రమే సమర్పించ
గల్గేది. గాలిలో తేలియాడే సుఖానుభూతిని
మీకు కల్గించేది. హేలో కోసమే ప్రత్యేకించిన
సువాసనల శృంగారానుభూతిని అనుభవించండి.
ప్రతి క్షణం మరువలేని మధురానుభూతిని
కల్గించేందుకే. వీయిల్ ఆఫ్ లౌతో
అలంకరించుకోండి. హేలో
మాత్రమే వెదజల్లు సువాసన
గల పన్నీటిజల్లు.
హేలో వీయిల్ ఆఫ్ లౌ టాల్క్
హేలో మాత్రమే వెదజల్లు
సువాసనలు... అనురాగ
వల్లరులు.
ఆమెకోసమే
హేలో
వీయిల్ ఆఫ్ లౌ
టాల్క్
NEW
Halo
VEIL OF LOVE
TALC


UMA

ఉత్తరాలు

ఎక్కడోకాని ఏ లోటేదన్నా పనసప్పలోనైనా తల్లి దండ్రులు బాధపడతారు. తమ సంతానంలో ఒకరు ధనవంతులయితే యింకొకరు మధ్యతరగతి కుటుంబీకురాలవవచ్చు చివరికి మమతాను రాగాలకే విలువ ఉంటుంది. అయితే రచయిత్రి చెప్పిన అంతరాలు కొందరిండ్లలో ఉంటారులెండి.

కథలు

సంక్రాంతి ప్రత్యేక సంచిక చాల బాగుంది. డా సి.నా.రెగారి 'ఉభయపక్షాలు' దాశరథిగారి 'తుషార క్రీడ' చాల బాగున్నాయి. అంతరాలు కథలో తల్లి దండ్రులు తమ పిల్లలని వారివారి అంతస్థులనుబట్టి చూస్తారని, ఎక్కువగా అభిమానంకన్నా డబ్బు, హోదా చూసి ఆడపిల్లలకి ట్రీట్ చేస్తారని. కాని

వై. లక్ష్మి (శ్రీకాకుళం)

'మినీ'యింటర్వ్యూ

సంక్రాంతి సంచిక చదివాను వి.వి నరసమ్మగారి "అంతరాలు", శ్రీయుతులు దాశరథి, సి. నా. రె. గార్ల గేయాలు ఆహ్లాదకరంగా ఉన్నాయ్ గానీ "మినీ ఇంటర్వ్యూ"లో కుమారి సి పూర్ణిమ మాటలు "వోవర్ కల్చర్"గా ఉన్నాయ్ తెలుగుచిత్రాలామెకు బోర్ కొట్టేటప్పుడు తెలుగు నటి శారదగార్నెందుకు అభిమానిస్తున్నట్టు ?

ఎమ్. రాజారావు, (బరంపురం)

'మినీ ఇంటర్వ్యూ'లలో అందరూ (ముఖ్యంగా యువతులు) 'తెలుగుసినిమాలుబోర్ హిందీ సినిమాలు బాగుంటున్నాయ్' అంటున్నారు వాళ్ళు ఏ ఉద్దేశ్యంతో అలా అంటున్నారో అర్థమవడంలేదు. ఈ మధ్యహిందీ సినిమాలలోనూ, తెలుగు సినిమాలలోనూ కథనం ఒక్కలాగే ఉంటోంది. మళయాళం, బెంగాలీ సినిమాలే బాగా ఉంటున్నాయి.

యం. ఎస్. వి. గంగరాజు (కటక్)

కొత్తగా ప్రారంభించిన "చిన్నారి చిరుపిట్టకథలు" కథలుబాగున్నాయి. అందులో "పావతల్లి" గుడివాడ శ్రీ వాణిదేవిగారి కథ బాగుంది.

యాళ్లబండి మారియ్యనాయుడు, గంటాబంగారావు తాడేపల్లిగూడెం.

విమర్శ విషయం

ఆంధ్రవారపత్రికలో 'తెలుగోడి గోడు' అనే వ్యాసంపై విమర్శ 'వావిలాల గోపాలకృష్ణ' అనే పేరుతో పడింది. ఈ వ్యాసంతో నాకు సంబంధం లేదు. పలువురు నాకు వ్రాస్తున్నారు. నా పేరు వావిలాల గోపాలకృష్ణయ్య-ఆ వ్యాసం 'వావిలాలగోపాలకృష్ణ' అనివుంది. ఈవిషయం చదువరులకు తెలియజేయడం న్యాయం. దయచేసి ఈ లేఖ ప్రకటించ ప్రార్థన.

వావిలాల గోపాలకృష్ణయ్య. (సత్తెనపల్లి)

18—1—74 సంచికలో 'శిరిప్రసాద్'గారి ఉత్తరాన్ని చూశాక కొంత విచారిస్తున్నాను. కరణం — ఇంద్రగంటి జానకీబాలగారి ఉత్తరాన్ని వారు విమర్శించటమే. విమర్శని 'స్పోర్టింగ్'గా తీసుకోవాలనే విషయం మరిచిపోవటం ఎంత అవివేకం 'జిహ్వాకోరుచి ...' అన్నట్లు పాఠకుల అభిప్రాయాలు వేరువేరు విధాలుగా ఉంటాయ్ ! వీటితో పార్టీ రాజకీయాలని జతపరచటం భావ్యంగాదు. అప్పుడుకథల్లో నూతనత్వం కరువవుతుంది. నేటి అభిమాన సంఘాలలో కొన్నింటి వలాదిరి తయారవుతాయ్. (పోస్టర్ల మీద పేడముద్దలు కొట్టడం వంటి)…. ఆ కథలు. ..!

ఎం. వి సుమలాకరరావు (విజయవాడ)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)

శుక్రవారం : 15-2-1974
శ్రీ ప్రమాదీచనామ సం. మాఘబహుళ ౯. సంపుటి
సంపుటము : 67 సంచిక : 25
స్థాపితం : 1908
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-3
విడి ప్రతి వెల 55 పైసలు

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
తార జయలలిత

కథలు :

బ్రతకనేర్చినవాళ్ళు	...	6
నిద్ర	...	34
మనిషి	...	40

సీరియల్ కథలు :

ఏటిలోని కెరటాలు	...	10
గాలిపటాలు (నాటకం)	...	18
పేయింగ్ గెస్ట్	...	29

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు—2, మరో తెలుగోడి గోడు—3, ఉమెన్ కార్నర్—4, హైదరాబాద్ నోట్ బుక్—5, ప్రశ్నావళి—15, వారఫలం—16, సినిమా—22, పద్మభూషణ్ బి.ఎన్.రెడ్డి—33, ధర్మపథం—44, డాక్టర్ సలహాలు—45, ఈవారం విశేషం-46, చిన్నారిచిలిపిచేష్టలు—48.



మరో తెలుగోడి గోడు

'మరో తెలుగోడు'

"తెలుగోడి గోడు" చిన్న దుమారాలు చాలా రేపగలిగింది !

ఎన్నో వాగ్వివాదాలు బయలుదేరాయి.



కాని, అసలు రచయిత చెప్పదలుచుకున్నది ఆయన స్పష్టంగానే చెప్పినా ఎందరికో అర్థం కాలేదని నాకు అనిపిస్తోంది ...

హిందీ మాట్లాడవద్దనీ, ఇంగ్లీషుని బహిష్కరించాలనీ ఎవరంటారు ? వీటిని మాట్లాడితే గొప్ప, తెలుగు మాట్లాడితే గొప్పకాదు — అనే భావం మాత్రం కొందరికి బాధ కలిగిస్తూ ఉంటుంది !


ఇటువంటి వారికి హైదరాబాదు వెడితే మరీ బాధగా ఉంటుంది !


ఇక్కడ తెలుగు ఎందరికి వచ్చునో కాని హిందీలోనే ఎక్కువగా మాటలు వినిపిస్తూ ఉంటాయి ! రిక్షా, బస్సు, టాక్సీ, సినిమాహాళ్ళు, హోటలు, కిళ్లీకొట్టు (లేక పాన్‌షాపు), కూరల బజారు — ఎక్కడ దేనికోసం అడిగినా తెలుగు ఎప్పుడోకాని వినిపించదు. కొందరు నిర్మొహమాటంగా — "బాబూ, నాకు హిందీ రాదు ! చెబితే తెలుగులో చెప్పు లేదా ఇంగ్లీషులో చెప్పు !" అంటే తెలుగు పలుకుతూ ఉంటుంది. కొన్ని సంవత్సరాల క్రితం ఎవరయినా ఇలా గ మాట్లాడితే ప్రమాదాలకి గురి అయ్యేవారు కాని ఇప్పుడు అది తగ్గి పట్టింది ...

ఒకచోట 'ప్రకాశం పంతులు మార్గ్' చూసినట్లు ఈ రచయితకి గుర్తు ! ప్రకాశం పంతులు రోడ్డు, వీధి లేక మార్గం అంటే ఉన్నట్టుగా 'మార్గ్' అంటే ఉండదు !! అలాగే తెలుగు చదివే ఉన్నా, వాళ్ళా, ఫూల్ (?) వంటి మాటలు కొంత వింతగా కొంత అయోమయంగా ఉంటాయి . .

హిందీ దేశాన్ని కలపటానికి బదులు విడగొడ్తోందన్న సంగతిని ఇప్పటికి కొన్ని సంవత్సరాలుగా ఎందరో చెబుతూనే ఉన్నారు. హిందీవల్ల తమిళనాడు రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఒక్క ఆంధ్రులే తమ భాషని హిందీ అవమానించటం ఎక్కువగా చూస్తూ ఉంటే ఊరుకుంటున్నారు !

అందుకోసమేనేమో ఒక తెలుగోడి 'గోడు' ఇందరి తెలుగోళ్లకీ తమ గోడుని కూడా బయట పెట్టుకోవాలనిపించేట్లు చెయ్యగలిగింది.




ఇది నల్లబజారు వ్యాపారం కాక పోతే మరేమిటి?
భారత దేశానికి కిరోసిన్, ఎరువులు రష్యా యిస్తుంది. అయితే ఎక్కువ ధరకి మాత్రమే!!
ఆంధ్ర ప్రదేశ్‌లో ఎం.బి.బి.ఎస్. ప్రవేశ పరీక్షకి ఇక్కడే దరఖాస్తులు పెట్టుకోవాలి. ప్రవేశ పరీక్ష ఇంగ్లీషులో ఉంటుంది...
మేము తెలుగు బోధనా భాషగా గల అభ్యర్థులం! మేము ఇంగ్లీషులో ఎలా రాస్తామను కుంటున్నారు?
నేను బియ్యం కోసం రేషన్ షాపుకి వెళ్ళాను! బియ్యం దొరకలేదు! కానీ తుపాకి గుండు పొట్టలో దూసుకు పోయింది!
గుజరాత్
అటు కాదు...
భారత్‌తో మామూలు సంబంధాలకి

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

నూరేళ్ల తెలుగు వ్యాసం :

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో ప్రధానమైన వ్యాసం 1860 లో హితవాది పత్రికలో శ్రీ సామినేని ముద్దుకృష్ణమనాయుని వారిచే ప్రారంభమై శ్రీ పరవస్తు రంగాచార్యులయ్యవారు మొదలయిన వారి రచనలతో పరిపుష్టమై నూటపద్నాలుగేండ్లలో విరాడ్రూపం ధరించి, లాంఛనంగా జనవరి 20 తేదీన సాహిత్య అకాడెమీ యాజమాన్యాన నూరేళ్ల పండుగ చేసుకొన్నది. ఈ పండుగకు అకాడెమీ నూతన అధ్యక్షుడు డాక్టర్ గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు. 1862 నుండి 1900 వరకు వ్యాస పరిణామం గురించి శ్రీ తిరుమలరామచంద్ర, 1901 నుంచి 1947 వరకు జరిగిన మార్పును గురించి శ్రీమధునాపంతులసత్యనారాయణశాస్త్రి, స్వాతంత్ర్యానంతర పరిణామం గురించి శ్రీ కొలకలూరి ఇనాక్ పరిశోధన వ్యాసాలు చదివారు. శ్రీ సామినేనివారు, ఈ ప్రక్రియకోసం అహర్నిశం పాటుపడి కీర్తిశేషులయిన పెద్దలు, ఈ ఉత్సవాన్నిపూర్వలోకాలనుంచి తిలకించి ఆనందించినట్లు అనిపించింది.

19 వ తేదీన జరిగిన సాహిత్య అకాడెమీ వార్షికోత్సవంలో ఆధునిక వాఙ్మయానికి అకాడెమీ బహుమతులను ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు పంచారు. నాటకం— డాక్టర్ పి. వి. రాజమన్నారు. సాహిత్య విమర్శ— శ్రీపుట్టపర్తి నారాయణాచార్యులు నవల— శ్రీ పాలగుమ్మి పద్మరాజు. కథానిక— స్వర్గీయ బుచ్చిబాబు, కవిత— స్వర్గీయ వెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి ఉత్తమరచయితలుగా— శ్రీమతి పులపర్తి కమలాదేవి, ఉత్తమ వైయాకరణులుగా శ్రీ పేరివెంకటశాస్త్రి, విశిష్ట సభ్యులుగా శ్రీ నోరి నరసింహశాస్త్రి, శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం, శ్రీమతి పొట్టుకూరి లక్ష్మీకాంతమ్మ సన్మానింపబడ్డారు. అకాడెమీ ప్రచురణలు— తిక్కన పద ప్రయోగ కోశము— రెండవ భాగాన్ని స్వర్గీయ గాడేపల్లి (?) రఘుపతి (?) ... జిజ్జు రచించిన భర్తృహరి ఉరుదూ అనువాదాన్ని డాక్టర్ గోపాలరెడ్డి ఆవిష్కరించారు. ప్రారంభంలో శ్రీ రామానుజరావు వార్షిక నివేదిక చదివారు చివర డా. రామరాజు ధన్యవాదాలు సమర్పించారు.

పదహారు నెలల తర్వాత :

1972 సెప్టెంబర్ పూర్వపక్షంలో శాసన సభలు మువత్తర్ (సస్పెండ్) కావడంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్న బాగయాం రోడ్డు జనవరి 19న ఉభయ శాసనసభలసమావేశాలు ప్రారంభంకావడంతో కలకలలాడుతున్నది. కాని, శాసనసభలో నిరసనలకు, నిర్గమనాలకు తక్కువేమీ లేదు. 19 న ఉభయ శాసనసభల సమావేశాన్ని ప్రారంభిస్తుండగా రిపబ్లికన్ పార్టీ సభ్యురాలు శ్రీమతి ఈశ్వరీబాయ్ షట్ సూత్ర పథకం ప్రతిని కాల్చడం, సమైక్య అనుకూల, ప్రతికూల వర్గాలు తమ తమ నిష్టు వినాదాలు చేయడం యథావిధిగా జరిగాయి. ఏమైనా షట్ సూత్ర పథకం తెలుగువారిని ఆరు ప్రేమ సూత్రాలతో బంధించి ముందుకు తీసుకుపోతుంది.

సూర్యరాయాంధ్ర నిఘంటువు :

సూర్యరాయాంధ్ర నిఘంటువు తుది సంపుటాన్ని ఆవిష్కరిస్తూ ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు పూర్వపు ముక్కలు చాట్లాడి, పంచాంగమూ తను చేతల వాడినే కాదు, మాటలవాడిని కూడా అని నిరూపించుకొన్నారు "ఒక మహారాజు సంకల్పించింది నేటికి పూర్తయింది. అయిన రాతి సంకల్పం అలాంటిది." మీరు కోరినట్లు కొన్ని సంపుటాల పునర్ముద్రణకు ప్రభుత్వం ధన సహాయం చేస్తుంది అన్నారు ఆయన. మరుసటి దినమే దానికి ఉత్తర్వులు చేసినట్లు వినికిడి. ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ప్రసంగంలో తెలుగు సంస్థల తాబేటి నడకకు కారణమేమిటో అనే ఆవేదన లగుపించింది. "అదేమి అభిశాపమో! 1911 లో స్థాపించిన ఈ నిఘంటు కార్యాలయం కాకినాడ, పిఠాపురం, మద్రాసులు తిరిగి నేడు హైదరాబాదు చేరింది. సింహావలోకనం చేసుకొంటే, ఆశ్చర్యమవుతుంది. 1936 లో ఈ నిఘంటువు మొదటి సంపుటి వెలువడింది. కొన్ని 58 లో, చివరిది 74 లో అయినా, తన సర్వస్వం నిఘంటువుకు ధారపోసిన పిఠాపురం రాజా సూర్యారావుగారి స్వప్నం నేడు పండింది. వారి అల్లుడైన శ్రీ ఎం. ఆర్. అప్పారావు ఈ సంపుటిని స్వీకరించడం, ముఖ్యమంత్రి వెంగళరావు ఆవిష్కరించడం ఆనందకరం. పునర్ముద్రణ పొందవలసిన నాలుగు సంపుటాలకు 64 ఏళ్లు కారాదని కోరుతున్నాను" అన్నారు. ప్రభుత్వ అర్ష శాఖ డైరెక్టరు శ్రీ అబ్దుల్‌వహీద్‌ఖాన్ ఈ సంపుటి ప్రచురణ చరిత్రను వివరించారు.



ఛాంపియన్

కొత్తగూడెం జూనియర్ కళాశాల విద్యార్థిని అయిన కుమారి ఎ. పద్మజ రాష్ట్ర షటిల్ బాడ్మింటన్ ఛాంపియన్. జకార్తాలో జరిగే ఆశియన్ షటిల్ బాడ్మింటన్ పోటీలలో పాల్గొనటానికి ఎన్నికైంది.

రోడ్డు ప్రమాదాలలో అగ్రస్థానం:

ఆంధ్రప్రదేశ్‌కు దేనిలోనైనా అగ్రస్థానం రాకపోయినా, రోడ్డు ప్రమాదంలో వచ్చింది. ఈ సంగతిని పోలీస్ ఇన్‌స్పెక్టర్‌జనరల్ శ్రీ అబ్దుల్ వహాబ్ ఖాన్ తెలిపారు. ఏటా దాదాపు 800 మంది మన రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలకు గురి అయి మృతులవుతున్నారు. ఎందుకు కారు? మనకు రోడ్డు పరిజ్ఞానం లేదు. ఫుట్‌పాత్‌లో నడవడం నామర్దా రొమ్ము విరుచుకొని రోడ్డు మధ్య నడవాలి దీనికి తోడు చతుష్చక్రుల సంరంభం. ఇటీవల [illegible] కా సమీపంలో ఒక గోమాత ఒక సైకిలు అబ్బాయిని కుమ్మింది తనకు అడ్డు వచ్చాడని. ఆ పొగరుబోతు (ఎందుకు అడ్డం రావాలి?) బస్సు కింద పడ్డాడు పట్టుతప్పి పాపం! అకాలమరణం. ఇల్లు కదిలితే మరి ఇల్లు చేరుకొంటామనే భద్రత లేకపోతే ఎట్లా? ఎవరు పౌరులకు దిక్కు.

ఉపశ్రుతి :

సాహిత్య అకాడెమీ బహుమతి పొందిన శ్రీ రాజమన్నారు గారిని చూస్తుండగా 1932 లో మద్రాసులో జరిగిన ఒక సంగతి జ్ఞాపకం వచ్చింది. వాల్ టాక్స్ థియేటర్‌లో 'తప్పెవరిది' నాటకం ఆడుతున్నారు. ఒక పాత్ర తప్పెవరిది అని ప్రశ్నించింది. వెంటనే ఆ నాటకం రుచించని ప్రేక్షకులు లేచి "ఇలాంటి నాటకం మమ్ము [illegible]కి తెచ్చిన మాది అ[illegible]" [illegible]

బ్రతకనేర్చినవాళ్ళు



వై.వి. సీతారామమూర్తి

చిన్నముల్లు పదిమీదికి పెద్దముల్లు పన్నెండుమీదికి జరిగి పదిగంటలూ ఠంగు ఠంగున కొట్టేసర్కి రోజూఅయితే రాజారావు పనిలో నిమగ్నమై వుండేవాడు. కాబట్టి అతని కాగంటల శబ్దం వినిపించేదికాదు. కానీ యీ రోజుమాత్రం అలాకాదు. రోజూలాంటి రోజుకాదీరోజు.

రాజారావు గుండెలు గడియారపు గంటల కంటె ఎక్కువగా కొట్టుకున్నాయి.

పెళ్ళికెదిగిన యిద్దరి చెల్లెళ్ళనీ తమ్ముడినీ తనచేతిలోవుంచి, వారి బాధ్యతంతా తనకప్ప గించి తండ్రి శివసాయుజ్యం పొందినపుడూ— తండ్రి చేసిన అప్పులకూ, ఆయనపోయాక వచ్చిన డబ్బుకూ పొంతన కుదరక, కాబూలీ వడ్డీ తనను కాల్చుకుతిన్నప్పుడూ — అప్పు డెప్పుడూ రానంత భయం నరనరాల్లోకి ప్రాకి చిత్రవధ చేస్తూందీరోజు.

అందుకే ఎప్పటిలా ఆఫీసు టైంకంటె ఒకగంట ముందుగా వచ్చినా పనిమీద ధ్యాస నిలుపలేకపోతున్నాడు.

సరిగ్గా ఇరవైనాలుగు గంటలక్రితం — ఉదయం పదిగంటలూ అయి పదిమందీ చేరు కునేవేళలో జనరల్ మేనేజర్‌గారి ఎయిర్ కండిషండ్ గదిముందున్న 'బజ్జర్' మ్రోగింది.

ఇవతలరూంలో హెడ్‌గుమాస్తాగారి కాఫీ కోసం గ్లాసుకడిగే పనిలోనున్న బంట్రోతు వీరాసామికది విన్పించలేదు — రెండు నిముషాల వ్యవధిలో మళ్ళీ బజ్జర్ మోగేసర్కి హెడ్ గుమాస్తాగారేదో పనిమీద బయటకువెళ్తూ విని బంట్రోతు చేతిలోని గ్లాసుని లాక్కుని, వాడిని వున్నపాటున గది గుమ్మం దగ్గరకు తోశాడు—

ఆఫీసు దగ్గరకంటె యింటివద్దే ఎక్కువ పని చేయటంమూలాన అయ్యగారు తనను యేవిషయానికీ కేకలెయ్యరని వీరాసామి ధీమా—

అందుకే ఆలస్యమైనా ధైర్యంగా వెళ్ళాడు లోపలికి.

లోపలికెళ్ళిన వీరాసామి కళ్ళకి జనరల్ మానేజర్‌గారు పెద్దపులిలా కనిపించలేదు. పొగలు కక్కుతున్న వేడివేడి కాఫీలా కన్పిం చారు. వీరాసామి దృష్టంతా కాఫీమీదే వుంది. హెడ్‌గుమాస్తాగారి గ్లాసుకడిగితే రోజూ పొద్దున్నే తను తెచ్చుకున్న కాఫీలో కాస్తంత పోస్తాడు. ఆ అవకాశాన్ని సమయానికి పాడు చేశాడు జనరల్‌మేనేజరు—

'ఆనంద్‌గారిని నేను పిలుస్తున్నానని పిలు' తలెత్తకుండానే ఆజ్ఞాపించారు జనరల్ మేనేజరు. క్షణంలో ఆనంద్‌గారు ప్రత్యక్ష మయ్యారు.

'చూడండి మిస్టర్ ఆనంద్! మనం మన పర్సనల్ విషయాల్లో ఎంత సిన్‌సియర్‌గా వుంటామో అలాగే ఆఫీసులో వున్నప్పుడు ఆఫీసు విషయాలంత ఎటెంటివ్‌గా చెయ్యాలి. క్రింది వారి చేత అలా పని చేయించాలి. ఇందులో ఒకరు చెప్పేదీ మనం చేసేదీ వుండ కూడదు.'

జనరల్ మేనేజరు యే విషయమై మాట్లాడుతున్నాడో అంతు చిక్కలేదు ఆనంద్‌కి. వచ్చి రాగానే కూర్చోమనకపోవడమే కాక యిలా తన సిన్సియారిటీ మీద లెక్చ రివ్వటం అతనికేం నచ్చలేదు. అందుకే నొసలు చిట్లించాడు అసలు విషయం కోసం.

'ఈ ఫైల్‌లో క్రితంవారం పాస్ చేసిన యీ బిల్ చూడండి. ఇందులో తప్పేమిటో దీనికెవరు కారకులో ఐడెంటిఫై చేసి గంటలో పంపించండి.' అంటూ సమాధానానికైనా ఆశిం చకుండా పనిలో నిమగ్నమయ్యాడు జనరల్ మేనేజరు.

కాస్త కూస్త తనూ ఒక ఆఫీసరేనన్న విషయం తెల్సికూడ, అలా ప్రవర్తించడం ఆనంద్ అహాన్ని దెబ్బతీసింది...

తనకు కంట్రాక్టర్లకు మధ్య లావాదేవీ

లున్న సంగతి చూచాయిగా తెల్పాయన్నమాట— తన గ(ది)లోకి వెళ్ళి ఎంత ప్రయత్నించి వా అందులోని తప్పేమిటో అర్థం కాలేదు అసిస్టెంట్ మేనేజరు ఆనంద్‌కు. వెంటనే కాలింగ్‌బెల్ నొక్కి స్టాఫ్ సూపర్‌వైజర్ని పిలిపించాడు.

పొద్దున్నే రెండుసార్లు బజర్లు మోగడం, అసిస్టెంట్‌గారు జనరల్‌గారి రూంలోకి పోయి వల్లబడ్డ ముఖంతో తనగదిలో ప్రవేశించడం చూసిన, స్టాఫ్ సూపర్‌వైజర్ తనకేదోముప్పు వాటిల్లబోతోందని ముందుగానే వూహించి, సాధ్యమైనంత వినయంగాలోనికి అడుగుపెట్టి, సగం వంగి చేతులు కట్టుకుని 'సార్' అన్నాడు—

అసిస్టెంట్ ఆనంద్‌గారు తలెత్తలేదు. వినయంగా నించున్నది సూపర్‌వైజరుగారా, కాదా అన్నవిషయాన్నికూడ పట్టించుకోలేదు.

'చూడండి శేషగిరిరావుగారూ.. మనమొక పని చేశామూ అంటే ఒకరిచేత ఎత్తిచూపించుకోకుండా వుండాలి. అంతేగాని టిక్కులు టిక్కులే...తప్పులు తప్పులేఅయితే యింతింత జీతాలు తీసుకోడం అనవసరం'

సూపర్‌వైజర్ శేషగిరి వూఁ అనలేదు ఆఁ అనలేదు. మౌనాన్ని అడ్డుగోడగా పెట్టుకుని విలబడ్డాడు.

'ఈ బిల్లు చూడండి. ఈ కిందనున్న సంతకం మీదేనా'

'యస్సార్'

'అయితే ఇందులో తప్పేమిటోచెప్పగలరా?'

అసిస్టెంటుగారి చేతిలోని ఫైలు అందుకుని కళ్ళజోడు సవరించుకుని చూశాడు సూపర్‌వైజర్ శేషగిరిరావు...కళ్ళకు యే తప్పు అనలేదు. అసిస్టెంట్‌గారి వంక దీనంగా చూశాడు ... తప్పేమిటో చెప్పమన్నట్లు అంతవరకూ యేం చెప్తాడోనన్న ఆతృతతో చూస్తున్న అసిస్టెంటుగారు అతని చూపు సర్థంచేసుకుని బింకం చెడనీయకుండా.

"చెప్పలేరుకదూ — అరగంట క్రితమే మీకిస్తున్నాను.తప్పేమిటో. ... దానికెవరు కారకులో ఎలా జరిగిందో...నాకు పేపరుమీద కావాలి వెళ్ళండి."

అసిస్టెంట్ ఆనంద్‌గారు గర్వించితగినంత పని చేశారు ...

సరేనన్నట్లు తలాడించి కుక్క మొరుగుకు భయపడి పరుగెత్తిన పిల్లిలా ఒక్క వురుకు బైటకు వురికాడు సూపర్‌వైజర్ శేషగిరి.

శేషగిరి వెళ్ళాక ముఖానికి పట్టిన చెమటను తుడుచుకొని, తను లేచినవేళను తిట్టుకుని కాసిని మంచినీళ్ళు తాగి రిలాక్స్ అయ్యారు అసిస్టెంట్ ఆనంద్‌గారు.

గదినుంచి బయటకొచ్చిన సూపర్‌వైజర్ శేషగిరి బోనునుంచి బైటకొచ్చిన పులిలా గాండ్రించాడు.

ఇరవైయేళ్ళుగా పాతుకుపోయి ఆఫీసు శ్రేయస్సే దేశశ్రేయస్సుగా దేశశ్రేయస్సే తన శ్రేయస్సుగా భావిస్తున్న తన లాటి వాడికా యీ సవాలు ? అనుకున్నాడు ... యేమైనా సరే దెబ్బకు దొరక్కూడదు అని నిశ్చయించుకున్నాడు ... సీట్లోకూర్చుని బిల్లును మరోసారి చూశాడు . . బిల్లునిండా ఎర్రసిరా టిక్కులున్నాయి. బిల్లుకింద గుమాస్తా, హెడ్‌క్లర్కుల ఇనీషియల్స్ వున్నాయి ... అది చూసే సంతకం పెట్టాడు తను.

వెంటనే హెడ్‌క్లర్కు రామ్మూర్తిని పిలిచాడు హోదాలో—

జరిగిన వైనం చూసిన రామ్మూర్తిగారు పిలుపుకంటే వేగంగా వచ్చి వాలారు - కూతురి పెళ్ళి చెయ్యలేననే బెంగకంటె గొ(ఱ్ఱె)తోక లాంటి జీతంతో రోజెలా గడుస్తుందో, అందరికి పట్టెడు మెతుకులన్నా ఎలా పెట్టాలో తెలియని నిరాశతో కూరుకుపోయిన అతని కళ్ళు సూపర్‌వైజరుగారి చేతిలోని బిల్లు మీదికి చూపును పంపాయి ... కొంపతీసి కంట్రాక్టరుతో తను మంతనాలాడటం గమనించలేదుకద! అనుకుని భయపడ్డాడు ... అయినా తనేం బలవంతంచేసి అడగలేదే ...

అందరితోపాటు తన వంతును తాను మూడోకంటికి తెలియకుండా తీసుకున్నాడు... తను చేసింది తప్పు అయితే అందరూ తప్పు చేస్తున్నట్లే—.

రామ్మూర్తి వైఖరి చూసి పుంజుకున్నాడు సూపర్‌వైజరు శేషగిరి ...

'అలా అంత దూరం నుంచి చూస్తే కాదు ... ఈ యినీషియల్ మీది ఈ బిల్ చెక్ చేసింది మీరు అవునా ?'


అవునన్నట్లు తలూపాడు రామ్మూర్తి ...

"చెక్ చేయడమంటే ఎర్రటిక్కులు కొట్టడం మాత్రం కాదని గ్రహించండి ... ఇప్పటికైనా యిందులో చేసిన తప్పును సావకాశంగా పరికించి అయిదు నిముషాల్లో చెప్పండి ... మీరేదో వుద్ధరిస్తున్నారనుకొని, మీ మీదున్న నమ్మకం కొద్దీ సంతకం పెట్టినందుకు నాకు చివాట్లు — అయినా యినీషియల్ వర్కంతా నేను చూసుకుంటూ కూర్చుంటే మీరెందుకు ?"

సూపర్‌వైజర్‌గారి మాటలు రామ్మూర్తి మనసులో ములుకుల్లా గుచ్చుకోకపోలేదు... అయినా తన రోజులు బాగుండనందుకు తన దురదృష్టాన్ని తనే నిందించుకున్నాడు...

బిల్లు తీసుకుని తిన్నగా గుమస్తా రాజారావు దగ్గరకు తీసుకువెళ్ళాడు... అంతా వింటున్న రాజారావు లేచి నిల్చున్నాడు ... ఆ యినీషియల్ తనదేనని ఒప్పుకున్నాడు . ఒక్కసారి సరిగాచూస్తే అందులో తప్పేమి(టో) అర్థమైందతనికి...

తన కళ్లను తనే నమ్మ(లే)క యిూదు



రాజారావు ... తను సంతకంచేసిన బిల్లులో వెయ్యిరూపాయలు తప్పరావటంవల్ల కంట్రాక్టరుకు వెళ్ళవలసిన మొత్తంకన్న వెయ్యి రూపాయలు ఎక్కువ వెళ్లింది ... మళ్ళీ రాబట్టుకోడం మామూలావున్నా తప్పు తప్పే ..

బ్రతకనేర్చినవాళ్ళు

రాజారావువల్ల తప్పేమిటో తెల్సుకున్న హెడ్‌గుమాస్తా రామ్మూర్తి, సూపర్‌వైజరు శేషగిరిరావు గడగడలాడారు ... తమ చేతుల మీదుగా ఒక పెద్దతప్పు దొర్లింది... ఉద్యోగానికే ముప్పు వాటిల్లుతుందని మరింత భయపడ్డారు... అందుకే ఎవరిమట్టుకువారు తాము తప్పుకోడానికి ప్రయత్నించారు...

రామ్మూర్తిగారు పెట్టిన నోట్‌మీద, ఫలానాగుమస్తా రాజారావు మంచివాడుకాడనీ, అతనికి ఆఫీసు విషయాలందు శ్రద్ధ తక్కువనీ అటువంటివారు వుండటంవల్ల ఆఫీసు వాతావరణమే కలుషితమయ్యే ప్రమాదముందనీ వివరంగా రాసిపెట్టాడు సూపర్‌వైజరు శేషగిరి...

నిజానికి రాజారావు కంట్రాక్టర్లనుంచి పైసాకూడ ఆశించడనీ రూలుప్రకారం అన్నిటితోపాటు యీ బిల్లూ చేస్తాడేతప్ప దీనికో ప్రత్యేకత యివ్వడనీ శేషగిరికి కోపం.

మొదట్లో పని సాఫీగా అవ్వాలని నచ్చజెప్పాడు ... లోకంతీరెరుగని కుర్రకుంకవన్నాడు... బాధ్యతలు మోసినవాడివి పుచ్చుకోకపోతే ఎలాఅన్నాడు... రాజారావు వినలేదు... తన నియమం మార్చుకోనన్నాడు...

శేషగిరికి యిప్పుడదను దొరికింది... కసిదీరా రాశాడు... రాసి ఆ నోట్‌ను అసిస్టెంట్ ఆనంద్‌గారి రూంలోకి జేరవేశాడు.

అందరూ అనుకున్నట్లే ఆ రోజు రాజారావు చేతికి చార్జ్‌షీట్ వచ్చింది...

రాజారావు కంపించిపోయాడు...

కాళ్లక్రింద భూమి క్రుంగిపోతున్నట్లనిపించింది. శరీరమంతా చెమటలు పోశాయి...

సూపర్‌వైజరు శేషగిరి, హెడ్‌గుమాస్తా రామ్మూర్తి తప్పంతా రాజారావువంక జాలిగా చూశారు... అలా చూసినవాళ్ళలో టైపిస్టు రమాదేవి, జనరల్ మేనేజరుగారి బావమరిది నిరంజన్‌కూడా వున్నట్లు గ్రహించగానే రాజారావు మనస్సు భగ్గున మండింది...

నిజానికి ఆ తప్పుచేసింది తనుకాదు...బిల్లు తను సరిగానే వ్రాశాడు... వ్రాసి టైపింగ్ కిచ్చాడు.

నిరంజన్ చూపుల మైకంలో టైపిస్టు రమాదేవి చేసినతప్పు అది...నిజానికది కంపేర్ చేసుకోవలసిన డ్యూటీ తనది.

'మేం కంపేరు చేసేమండోయ్! మా మీద నమ్మకం లేకపోతే మరోసారి చూసుకోండి—' అంది రమాదేవి నవ్వుతూ...

అందుకే మళ్ళీ చూడలేదు.

చూడకుండానే తొలిసారిగా సంతకం చేశాడారోజు...

మేనేజరుగారితో విషయమంతా పూస గుచ్చినట్లు చెప్పేద్దామనుకున్నాడు రాజారావు. కానీ మనసు మాత్రం వెనక్కు తగ్గుతుంది... వాళ్లలో ఒకరు మేనేజరుగారి బంధువైతే, మరొకరు అతని ప్రియురాలు...

తప్పు ఎవరిపై నిలుస్తుంది?

చివరికి మళ్ళీ తనే. ఒకరిపై నింద వేశా నన్న ఆరోపణకూడ...

ఆ రాత్రి రాజారావుకు నిద్రలేదు...
ఇంట్లో ఆకలితో పిల్లల అరుపులు
మనసులో దహించివేసే అగ్నిసెగలు.

తప్పు అందరి చేతుల మీదుగా దొర్లినా దాన్ని సరిదిద్దవలసిన బాధ్యత అందరి పైనా వున్నా తనే ఎందుకు దానికి కారకుడయ్యాడో అర్థంకాలేదు ..

రాత్రంతా కూర్చుని ఒకరిపై నింద వెయ్యకుండా, తన తప్పునుతాను ఒప్పుకుంటూ మొదటి తప్పుగా క్షమించవలసిందని కోరు కుంటూ సంజాయిషీ వ్రాశాడు...

జనరల్ మేనేజరుగారు రాగానే ఫ్రెష్‌గా వుంటారనీ తనబాధ నర్థం చేసుకుంటారనీ కలలుగన్న రాజారావు మేనేజరుగారే తనను పిలుస్తున్నారనేసరికి భయపడ్డాడు...శరీరంలో ఎక్కడలేని వణుకూ వచ్చింది.

ఆఫీసులో అంతా సస్పెన్సు సినిమా చూస్తున్నట్లు రాజారావు వంకే చూడ్డం మొదలు పెట్టారు...

రాజారావు తలుపు తీసుకుని లోపలికి వెళ్లాడు...మూడేళ్లక్రితం ఉద్యోగానికి ఇంట ర్వ్యూకి వెళ్లిన్తర్వాత మళ్లీ ఇప్పుడే ఆగది లోకి వెళ్లటం...

వాతావరణంమారి చల్లగా చలిగా అన్పిం చింది...శరీరంలో వణుకు ఎక్కువైంది... భయంతో గొంతు పెగల్లేదు. ముఖం వివర్ణ మైంది.

జనరల్ మేనేజర్ తలెత్తలేదు...

'మిస్టర్ రాజారావ్— మీరు చేసినతప్పు చిన్నదికాదు... మిమ్మల్ని డిస్మిస్ చేస్తున్నట్లు హెడ్డాఫీసు నుండి కాగితం వచ్చింది...'అంటూ కాగితాన్ని అందించాడు జనరల్ మేనేజరు ...

నిర్జీవంగా నిలబడ్డ రాజారావు కళ్ళల్లో మునుపున్న భయం మాయమైంది. శరీరంలో వణుకులేదు... వచ్చేమాట రాలేదు.

జోడించిన చేతులు జోడించినట్టే వుంచి వెనుదిరిగాడు.

రాజారావు బైటకు రాగానే హైడ్రాలిక్ డోర్‌క్లోజర్స్ ఎయిర్‌టైట్ తలుపులు మూసుకుపోయాయి...

అంతా రాజారావు వైపు ఆత్రంగా, వింతగా చూశారు రాజారావు ఎవరివంకా చూడలేదు... తనసీట్లో ఒక్కసారి కూర్చుని కాగితంవంక చూశాడు సొరుగులోని పెన్ను జేబులో పెట్టు కుని లేచి వీధిలోకి వచ్చాడు...

వస్తూ చూశాడు... తనవైపు చూస్తూ నవ్వి లోపలికి అడుగువేడుతున్న వ్యక్తిని... తను చేసిన తప్పుకు వెయ్యిరూపాయలు అద నంగా పొందిన కాంట్రాక్టరు రెడ్డి...

రెడ్డి నవ్విన నవ్వుకు అర్థం వెతికే స్థితిలో లేడు రాజారావు. అతని దృష్టంతా చేసిన తప్పు మీదికంటె, తన సర్వనాశనానికి కారకులైన పెద్దమనుషుల మీదికంటె రేపెలా అన్న దానిపైనే ఉంది . తనమీద ఆధారపడినవారి గతేమిటో రాజారావు ఆలోచించలేక పోయాడు.

* * *

నెలరోజులు గడిచి పోయాయి...

''ఈ గుమస్తా... కొడుకు తనుతినడు... పనిచెయ్యడు'' అని ఎప్పటిలా విసుక్కునే అవసరం లేకపోయింది రెడ్డికి.

కారణం రాజారావు స్థానంలో తనమనిషి, తనచేతిలోని కీలుబొమ్మ అయిన తన బావ మరిదే వున్నాడిప్పుడు...

అది సాధించడానికే ''రెడ్డీ ! మీ లాంటి వాళ్లకెందుకోయ్ వుద్యోగాలు మాలాంటి వాళ్లని పదిమందిని పోషించగల్గిన వాడివి నువ్వు'' అంటూ మేనేజరు తోసేసినా నిల దొక్కుకుని అతనినుండి మాట తీసుకునే వరకూ వూరుకున్నాడు కాదు...అది సాధించ డానికే అదనంగా లాభించిన వెయ్యిరూపాయల మొత్తాన్ని తన నిజాయితీ నిరూపించుకుందికి వుపయోగించి, తనకడ్డుగా నిల్చిన రాజారావుని వలలో బిగించాడు.

పాము కరిస్తే ఆ కాటుతిన్నవ్యక్తి మరణి స్తాడు...కానీ రెడ్డివంటి విషపురుగులు నవ్వితే, ఆకలితో కొన్ని కుటుంబాలే రూపు మాసిపోతాయన్న విషయం అందరికీ తెల్సినా బాహాటంగా అనుకున్న వాళ్లు లేకపోయారా ఆఫీసులో...

కారణం వాళ్లు ప్రవాహానికి ఎదురీదలేని వాళ్లు !

బ్రతకనేర్చిన వాళ్లు !! ■ ●

సీరియల్

పట్టిలోని కెరటాలు

ఎం.వి.ఆర్.రాధాకృష్ణ

(గత సంచిక తరువాయి)

"అంటే, ఏది ఏమయినా, త్యాగానికి ఉన్న విలువ మరి దేనికీలేదనే అంటావ్!"

"ముమ్మాటికీ అంతే! కొందరు వారి జీవితాల్ని త్యాగంచేయగా ఏర్పడిన సమాజం ఇది! శాంతారాం అన్నట్లు... సమాజం మదించిన ఏనుగైతే త్యాగమూర్తుల ఆశయాలే... దానికి మొకులు!" దృఢంగా అంది, అరుణ!

"ఆరముగ్గిన పండుమీద ఈగిలు చేరాయి! వాటి నలావదిలేస్తే... ఆ పండు పురుగులుపట్టి నశించిపోతుంది. అందుకని. . పురుగుల్ని చేరనిచ్చే అవకాశాన్ని కలిగించకూడదు! సమాజంలో, కొన్ని ఆదర్శాల చాటున దుష్టశక్తులు చేరాయి! అటువంటివాటిని పారద్రోలి ... సమాజాన్ని రక్షించవలసిన బాధ్యత ప్రతి వ్యక్తిమీద ఉంది! అందుకని, కొందరైనా ధైర్యంచేసి ముందుకురికే అవసరం ఉందని అంగీకరిస్తారా?" శాంతారాం అడిగాడు!

"తప్పకుండా! అది అవసరం కూడా!"

"ఇంకేం...మీరూ మాదారికే వచ్చారు! అర్థంలేకుండా... ప్రతివిషయానికి, త్యాగం అనే రంగుపూసి, ప్రతిఘటించకుండా వదిలేస్తే — నేటి దురాచారాలే,- రేపు ఆచారాలై ఊరుకుంటాయి!

"ఈనాటి కొన్ని అర్థం,పర్థంలేని ఆచారాలన్నీ, ప్రతిఘటింపకుండా వదలివేయ బడినవే! బహుశ మీరు చెప్పిన 'త్యాగం' పేరుతో కావచ్చు. కాని దానివలన సమాజానికి ఎంత అపకారం జరిగిందో... గ్రహించండి ..." శాంతారాం, సూటిగా అన్నాడు!

అరుణ క్షణం మాట్లాడలేదు.

తరువాత నెమ్మదిగాఅంది ... "మీరు చెప్పింది కూడా నిజమే! కానీ...త్యాగానికి విలువలేదంటే...నేను అంగీకరించను!"

శాంతారాం నవ్వేశాడు.

"అది మొండివాదన! ఇలా అన్నానని అన్యధా భావించకండి! మీ త్యాగం వలన లాభం పొందేది చాలా కొద్దిమంది కాని, అది మీకు తెలియకుండానే, సమాజంలోనికి తొంగిచూసి, మెల్లగా దానిలోనికి ప్రవేశించి, ఆ తరువాత ఏకు, మేకై కూర్చుంటుంది! చెడును అడ్డగించటానికి ఏం చేసినా తప్పలేదు. త్యాగం చేయడమేకాదు! అవసరమయితే వ్యర్థ త్యాగాలను ఎదిరించవలసిన ఆవశ్యకత కూడా ఉంది!"

అరుణ చిన్నగా నవ్వింది... "ఎంతయినా, విప్లవ రచయితలు కదూ! మీతో వాదించి నెగ్గలేం!" — అంది!

"వాదన, వాదించడం కోసం కాదు! వాదోపవాదాలలో ఎవరు నెగ్గుతారనేది కూడా ముఖ్యం కాదు నిజం ఎక్కడఉన్నా అంగీకరించవలసిందే!" సుధాకర్ బింకంగా అన్నాడు.

"సత్యహరిశ్చంద్రులు కదూ...అన్నీనిజాలే చెప్తారు?" అరుణ నవ్వుతూ అంది!

"నిజం చెప్పడం హరిశ్చంద్రుని జన్మహక్కేం కాదు మేమూచెప్తాం... అంగీకరించే మనుషులుంటే!"

"అలా ఉపన్యాసాలు దంచకండి! చెప్పే తీరులోఉంది. నిజాన్ని ఎవరు మాత్రం అంగీకరించరు?" అంది, అరుణ శాంతారాం వైపు చూస్తూ!

"లేనిపోని వాదనలెందుకు. అయనగారు ఎలాగూ పెళ్లి చేసేసుకున్నారు. ముందు... అతనికి అభినందనలు అందచేయండి, చాలు!" అన్నాడు శాంతారాం!

ఇంతలో జ్యోతి ఏడుపు వినిపించింది!

"ఇంకేం అనుకున్నంతా అయింది. మీ కేకలకు అదిలేచి పోయింది..." అంది అరుణ సుధాకర్ వైపు చురచురాచూస్తూ!

"ఇదెక్కడి న్యాయం? ఎలక్షన్లో నిలబడిన రాజకీయవేత్తలా, ఇంతసేపూ గొంతు చించుకుని అరిచింది నువ్వు! నన్నంటావేం... పైగా!" అన్నాడు సుధాకర్!

ఇంతలో జ్యోతిని ఎత్తుకొని విజయ వచ్చింది!

జ్యోతిని ఆడిస్తూ, ఆ పిల్లచేసే అల్లరికి నవ్వుకుంటూ—ఉత్సాహంగా గడిపేశారు!

8

—"అరుణోదయమైంది...

అరుణ కాంతుల ముసుగులో నీలి ఆకాశం కొత్త రంగులు సంతరించుకునే సమయంలో అర్థంలేని పసివాడి బోసి నవ్వులా గడ్డిపువ్వు విరగబడి కులుకుతూంది..."—

—"డొక్కలువీపును చుంబిస్తున్న మంద భాగ్యుడొకడు అజంతా హోటలు పరిసరాలలో — శక్తిలేని చేతిని, ఉన్న శక్తినంతా కూడగట్టుకొని చాచేలోగా ...

సర్రున దూసుకు పోయిందొక కారు,

సేర్‌జీ బరువు మోయలేక కుతకుతలాడుతూ! మర్రి చెట్టు నీడన—సోషలిజం బరువు చాటున, బడుగు మొక్కలకూ—బడుగు

జరిగినకథ: రాజారావు జానికమ్మల సంతానం అరుణ. వారింటి ప్రక్కనున్న రామారావు,అతని భార్య సరస్వతి— ఈ ఇద్దరితో అరుణకి స్నేహం. రామారావు చిన్ననాటి స్నేహితుడు సుధాకర్. విశాఖపట్నం నుండి ఆఫీసు పనిమీద హైదరబాద్ వచ్చిన సుధాకర్ అరుణని చూసి ఆమెని రామారావు ప్రోత్సాహంతో వివాహం చేసుకోవాలనుకుంటాడు. సుధాకర్ తండ్రి శివరావు భార్య వద్దన్నా అరుణ సుధాకర్‌ల వివాహం జరిపిస్తాడు. అరుణ సుధాకర్‌లు విశాఖపట్నం వస్తారు. అరుణ చిన్ననాటి స్నేహితుడు శ్రీహరి అరుణ ఇంటికి విశాఖపట్నం వచ్చివెళతాడు. అరుణకు ఆడపిల్ల పుట్టింది. పాపకు జ్యోతి అని పేరుపెట్టాడు సుధాకర్. సుధాకర్ అరుణలతోపాటు విజయకూడా విశాఖపట్నం వచ్చింది. సుధాకర్ తన స్నేహితుడు శాంతారాంను, అరుణకు పరిచయం చేశాడు. శ్రీహరి తను హోటంజాలీ అమ్మాయిని ప్రేమించి తన తల్లిదండ్రులకు తెలియకుండా వివాహం చేసుకున్నానని అరుణకు ఉత్తరం వ్రాశాడు.

(బతుకులకూ-ఏనాడు లేదు—ఎదుగూ, బొదుగు !''—

ఒక్కొక్క కాగితమే తిరగవేస్తున్న అరుణ కైమెంతయిందో గమనించలేదు !

వైవిధ్యంతో కూడిన శాంతారాం భావాలకు విస్తుపోతూ, ఉత్సాహంగా చదువుకొని పోతున్నది !

గడియారం, హెచ్చరిస్తున్నట్లుగా మూడు సార్లు మ్రోగింది !

అరుణ ఉలికిపడి చూసింది...

మంచం మీద కూర్చుని తదేకంగా తన వైపే చూస్తున్న సుధాకర్ కనిపించాడు !

''అదేమిటి ? మీరు నిద్రపోలేదా ?'' ఆశ్చర్యంగా అడిగింది !

''ఇది నాలుగోసారి లేవటం ! దేవేరిని డిస్టర్బ్ చేయుటం యిష్టంలేక ఊరుకున్నాం ! ఇకనైన వాటిని కట్టిపెట్టి నిద్రపోతారేమోనని చూస్తున్నాను !''

అరుణ నవ్వింది...''సారీ సర్ ! ఇంత కైమయిందని అనుకోలేదు ! ఇదుగో ! క్షణంలో వచ్చేస్తున్నాను !'' అంటు లేచింది !

మంచంమీద వాలిన, అరుణకు నిద్రరాలేదు. నిండుగా పారే నదిలాంటి భావాలతో—ఒక చోట గంబీరంగా, వేరొకచోట ఉరుకులాంటి నడకలతో—ఒకే రీతిగాకాక వైవిధ్యంతో సాగిన శాంతారాం వ్రాతలు అరుణకు చాలా కుతూహలాన్ని కలిగించాయి.

''శాంతారాం చాలా విచిత్రమైన వ్యక్తి'' అనుకుంది!

9


విజయకు పరీక్షలు దగ్గర [illegible] ఇల్లు కదలకుండా చదువులో మునిగిపోయింది

శాంతారాం తరచు వస్తున్నాడు.

శాంతారాం వచ్చిన ప్రతిసారి ఏదో పుస్తకం తీసుకొని అరుణ అతనితో వాదానికి దిగేది.

సుధాకర్ వుంటే అతనుకూడా ఉత్సాహంగా పాల్గొనేవాడు !

తరుచూ ముగ్గురు కలసి సినిమాలకు, బీచ్‌కి, టౌను హాలులో అడపాదడపా జరిగే సంగీత కచ్చేరీలకు వెళ్ళేవారు !



జ్యోతి పెంపకం, విజయకు చదువులో సాయం చేయటం, శాంతారాంతో వాదించటం—అరుణకు రోజులు, కాలక్షేపానికి కొదువ లేకుండా సాగిపోతున్నాయి. ఒకసారి టౌను హాలులో సుబ్బలక్ష్మి గానకచేరి ఏర్పాటయింది. శాంతారాం ముగ్గురికి టికెట్లు రిజర్వు చేయించాడు. రేపు సంగీతకచేరి అనగా సుధాకర్ అర్జంటుగా కంపెనీ పనిమీద హైదరాబాదు కేంపు వెళ్ళేపని పడింది.

"ప్చ్! ప్రాప్తం లేదు. సుబ్బలక్ష్మి కచేరి వినాలని ఎన్నాళ్ళనుండో అనుకుంటున్నాను! పోనీలెండి...ఈ సారి ఎప్పుడైన వినొచ్చు!" అంది అరుణ!

"నేను లేకపోతేనేం? శాంతారాం ఉన్నాడుగా. విజయా, నువ్వు కలిసి వెళ్ళండి! టిక్కెట్లు కూడా వృథాపోదు!"

"నేను వెళ్ళలేను బాబు! పరీక్షలు పట్టుమని నెలరోజులు కూడా లేవు! అదీకాక, సంగీతానికి నాకు చుక్కెదురు! నేను వెళ్ళలేను!" కచ్చితంగా చెప్పేసింది విజయ!

"మీరు లేకుండా నేను వెళ్ళను!" అరుణ అంది!

సుధాకర్ నవ్వేశాడు... "నా కోసం నీ సరదా మానుకోవద్దు! అయినా శాంతారాం పరాయివాడేంకాదు. మనవాడే! ఇంత పెద్ద రచయిత్రివి ... ఇంతేనా నీ ఆదర్శం!" ఎగతాళిగా అన్నాడు!

"నా ఆదర్శాలకేం? అవి బాగానే ఉన్నాయి!" అరుణ పౌరుషంగా అంది!

"తెలుస్తూనే ఉంది!" సుధాకర్ నవ్వాడు!

"ఏమిటి మీకు తెలిసింది? శాంతారాంతో వెళ్ళటానికి నాకు అభ్యంతరమని మీరు అనుకోవద్దు. పాపం, మీకు ఆ అవకాశం తప్పిపోతున్నాదనే నా బాధ! దానికేం! మీరు చక్కగా కేంపు వెళ్ళండి! నేను కచేరికి వెళ్తాను. నాకేం భయంలేదు!" అరుణ కోపంగా అంది! సుధాకర్ గట్టిగా నవ్వాడు...

"అంతలోనే యింతకోపమైతే ఎలా! నువ్వేమీ చేయలేవని నేను అనలేదుగా!" మర్నాడు ఉదయాన్నే సుధాకర్ వెళ్ళిపోయాడు!

ఆ రోజు శాంతారాంతో కలసి కచేరికి వెళ్ళింది అరుణ, జ్యోతిని విజయకప్పగించి!

ఇంతకు ముందుకంటే శాంతారాంకు ఆ యింటితో చనువు, పరిచయం ఎక్కువయాయి!

రోజులు సాఫీగా గడచిపోతున్నాయి ఎవరి ప్రమేయం తనకులేనట్లు!

ఏటిలోని కెరటాలు

10

ఆ రోజు ఆఫీసులో పని ఎక్కువగా ఉండటంచేత, సుధాకర్ ఇంటికి వెళ్ళేసరికి ఆలస్యమైంది.

ఇంటిలో అడుగుపెడుతూనే ఎదురుగా సోఫాలో కూర్చుని శాంతారాం కనిపించాడు.

సుధాకర్‌ని చూస్తూనే తడబడి, సర్దుకు కూర్చొని, చిన్నగా నవ్వ్వేప్రయత్నం చేసాడు.

"అరే! నువ్వా!" ఆశ్చర్యంగా అడిగాడు సుధాకర్!

శాంతారాం అంతకుముందు ఏనాడు పొద్దుపోయేవరకూ ఉండలేదు.

"నాతో ఏమైనా పనుందా?"

శాంతారాం నవ్వేసి... "లేదు... లేదు... ఊరికినే!" అన్నాడు. శాంతారాం మాటల్లో వెలితి కొట్టవచ్చినట్లుంది!

"అలా ఉన్నావేం. వంట్లో బాగాలేదు కదా?" సుధాకర్ ఆతృతగా శాంతారాం వంటిమీద చేయివేశాడు. చల్లగా తగిలింది.

"ఏమీలేదు సుధాకర్! అంత కంగారు దేనికి..." సాధారణంగా అనాలనుకున్నా, పొడిపొడిగా ఉన్నాయి శాంతారాం మాటలు.

ఇంతలో అరుణ రెండు కాఫీకప్పులతో వచ్చింది!

"తీసుకోండి!" అంది శాంతారాంకు అందిస్తూ!

శాంతారాం ఎవరో తరుముకొని వస్తున్నట్లు గబగబ తాగేసి... "వస్తా" అంటు లేచాడు

"అప్పుడే! అయినా అంత తొందరేం..." ఆశ్చర్యంగా సుధాకర్ ఏదో అనబోయేలోగా, శాంతారాం అడ్డుపడ్డాడు

"లేదు... లేదు. వెళ్ళాలి!"— ఇంకొక మాటకు అవకాశం ఇవ్వకుండా వడివడిగా వెళ్ళిపోయాడు!

భర్తవైపు చూసి, చూపు మరల్చుకొని, తలవంచుకొని లోనికి వెళ్ళిపోయింది అరుణ!

శాంతారాం ప్రవర్తన అర్థంకాక స్థాణువులా నిలబడిపోయాడు సుధాకర్!

11

రెండు రోజులు గడిచాయి.

అనుకోకుండా సావిత్రి రైలు దిగింది.

"తీర్థయాత్రలు చేసివద్దామనుకుంటున్నానే పిల్లా! నాలుగు రోజులుండిపోతాను!" అంది అరుణతో! "నాల్గు రోజులేనా? నెల

కవిని నేను

వి. ఆర్. గణపతి

కవిని నేను ! కవిని నేను !!
  కలముచేత దాల్చినాను !
ఏమేమో చేతునంచు
  యెగిరి, యెగిరి దూకినాను !!
అరుణం, విరుణం, వరుణం !
  అన్నింటా నేనున్నా !!
దీనజనోద్ధరణయే నా
  దీక్షా కంకణమన్నా !!
కానీ,
గాంధీ ! గాంధీయమన్నోటనె,
  బ్రాందీ వాసన వింపుకు,
ప్రజల సేవకేతుమనుచు
  ప్రజల నె దోచుకు తింటూ
పిరాల్లున్నింటిని తమ
  టోపీల్లో దాచిపెట్టి,
వెలిమధ్య దల్లి గుద్ది,
  వెనకివెల్ దోచుకునే
రాజకీయ నాయకుల్ని
  రచ్చకెక్క చేయలేను!
గాలిలేని గనులలోన,
  జాలిలేని కనులలోన,
పడినలిగే, నలిగిపడే,
  బడుగు జీవి కళ్ళల్లో,
పేరుకుపోయిన దైన్యం
  పటాపంచలొనరించి,
ఎదరొరగిలే జ్వాలను
  ఎటులో ఆరగారచేసి,
దీనంగా, హీనంగా
  మనసంగా ప్రేలాడే
ముఖ్య వా వెలుగునింపే,
ము మాను యెదలో వొంపే
గతుకుల, అతుకుల, చింపిరి
  బ్రతుకుల దిద్దగలేను !!
కవిని నేను ! కవిని నేను !!
  కలముచేత దాల్చినాను !!

రోజులైనా ఉండాలి!" అంది అరుణ నవ్వుతూ!

"నెలలతరబడి ఉండిపోవటానికి నేనేవ ర్తినే? కావలసినవాళ్ళు ఎంతకాలం ఉన్నా ఫర్వాలేదు!" నిష్కర్షగా అంది సావిత్రి, అదోలాగనూస్తూ!

సావిత్రి మాటలు అరుణకు శూలంతో పొడిచినట్లయింది. అయినా తమాయించు కొని ఊరుకుంది! సావిత్రిరాకతో ఆ యింటి వాతావరణంలో కొద్దిగా మార్పు వచ్చినట్లయింది.

ప్రతి విషయాన్ని తనవైపు మరల్చుకొని, ఎవరూ అడక్కపోయినా తన అభిప్రాయాన్ని చెప్పటం సావిత్రికి అలవాటు!

ఉదయం లేచింది మొదలు, రాత్రి నిద్ర పోయేవరకూ ఏదోఒకటి పట్టుకొని సాగదీస్తూ కూర్చునేది.

"ఆ వంటిల్లేమిటి అలావుంది..." అనో "చక్కగా బొగ్గుల కుంపటి మీద వండుకోక ఈ గేసేమిటి! ఆరోగ్యానికి మంచిది కాదు కూడాననూ..." అనో—ఏదో విషయము మీద తన అసంతృప్తి వెల్లడించేది.

"ఇలా అంటున్నానని చిన్నబుచ్చుకోకేం ...ఏమాటైనా మొహంముందే అనేస్తా అల వాటునాది" అంటూ సమర్థించుకునేది.

"ని చెల్లెలేమిటే ... ఆ గది వదిలిరాదు. ఎంత చదివినా ఏంలాభం"! అంటూ సరోజా నవ్వరించేసింది.

"దానికి చదువంటే సర్దా...!" అరుణ ఏదో చెప్పబోయింది.

"ఏంచదువులో, ఏమిటో! మా రోజుల్లో ఆడపిల్లలు ఇలాగే పుస్తకాలు ముందేసు కూర్చున్నారా? ఎంత చదివినా ఆడదానికి ఏముంది! పెళ్ళి చేసుకొని మొగుడికి వండి పెట్టి పిల్లల్ని కనడమేగా!" అంది సావిత్రి నిర్లక్ష్యంగా!

ఆడపిల్ల చదువు మీద లెక్చరిచ్చి ఆవిడను ఒప్పించటం కంటే నోరుమూసుకొని, ఆవిడ సణుగుడు భరించటమే ఉత్తమమని అరుణకు తెలుసు!

అందుకే మాట్లాడకుండా ఊరుకుంది!

"ఇలా చదువుల్లో పెడితే, రేపు ఎవడినో చూసుకొని లేచి చక్కాపోతుంది. మొగాడు చదవక, ఆడది చదివి చెడ్డారని ..." సావిత్రమ్మ మాటలకు అరుణ అడ్డుపడింది. "ఎవరి వ్రాతలెలావుంటే అలానే జరుగు తాయి. చదువుకున్న వాళ్ళంతా చెడిపోవటం లేదు ... చదువురానివాళ్ళంతా తిన్నగానూ లేరు..." కోపంగా అంది.

సావిత్రి కొంచెం తగ్గింది. "అయినా నే నే మన్నా న నే అంత కోపం, కీడెంచి మే లెం చ మ న్నా రు. మ ళ్ళే మ యి నా అనుకోగాని ... ఆడదానికి చదువేమిటి? మువ్వ ఉఅను, మా వూళ్ళో మా పిన్ని కొడుకున్నాడు...శుభ్రంగా వ్యవసాయం చేసు కుంటున్నాడు. నీ చెల్లెలికి అంతకంటే మంచి మొగుడు దొరకడు. క్షణాల్లో కుదిర్చేస్తాను!"

"ఏమో...మా వాళ్ళిష్టం...దానిఇష్టం. నాకేం తెలీదు!" అరుణ పొడిపొడిగా అంది.

సావిత్రి మొహం కొద్దిగా విప్పారింది. "కట్నకానుకులకేం బెంగ పడొద్దు. మనకు దగ్గిరవాళ్ళే. నేను చెప్తే కొంచెం తగ్గిస్తారు కూడాను!"

అరుణ మాట్లాడలేదు. ముభావంగా ఊరుకుంది!

ఆ రోజు సాయంత్రం శాంతారాం వచ్చాడు.

"రండి... రండి... బహుకాల దర్శనం. ఈ మధ్య కనపడ్డం మానేశారు!" అరుణ నవ్వుతూ ఆహ్వానించింది.

"ఊర్లో లేను. ఉంటే రాకుండా ఉండ గలనా!" అన్నాడు కూర్చుంటూ!

"సుధాకర్ ఇంకా రాలేదా?" అడిగాడు.

"వచ్చే వేళయింది. మీరుండండి కాఫీ తెస్తాను!" శాంతారాం వద్దని వారిస్తున్నా వినకుండా అరుణలోపలికి వెళ్ళిపోయింది

"ఎవరే ఆ అబ్బాయి!" సావిత్రి అడిగింది!

"ఆయన స్నేహితులు..."

"నాడు వచ్చాక రమ్మనలేక పోయావా?"

"బాగా తెలిసిన వారే లెండి. ఎప్పుడూ వచ్చిపోతుండే వారు ... ఈమధ్య ఊర్లో లేకపోవటం వల్ల రాలేదు!"

కాఫీ కప్పుల్లో పోస్తూ చెప్పింది.

సావిత్రి ఏమీ మాట్లాడకుండా ఊరుకుంది.


అరుణ కాఫీ ట్రేలో పెట్టి వెళ్ళబోయింది.

"అన్నట్లు...ఆ అబ్బాయి మనవాళ్ళేనా!" ఉన్నట్లుండి అడిగింది సావిత్రి.

అరుణ నవ్వింది... "ఏమో... ఎప్పుడూ అడగలేదు"

"మన వాళ్ళే అయివుంటాడులే! చూస్తే తెలియటం లేదా!" అంది సావిత్రమ్మ.

అరుణ నవ్వుకుంటూ హాలులోనికి వెళ్ళి పోయింది. శాంతారాం కాఫీ తాగడం ముగించే



"ఒరే రామూ! నాకు రెండు బజాణీలు పెట్టవురా?"

"ఏం మాష్టారూ? మీకింకా జీతాలు ఇవ్వలేదా?"

సరికి, సుధాకర్ వచ్చాడు.

"హల్లో శాంతారాం. ఇంతకాలం ఏమై పోయావ్!" అంటూ పలకరించాడు!

"ఊళ్ళోలేరట..." అరుణ చెప్పింది.

"లేదా? ఎందుకని? ఎవరినడిగి వెళ్ళి నట్లు?" ప్రశ్నలవర్షం కురిపించాడు సుధాకర్.

"చెప్పి వెళ్దామనుకున్నాను. కాని..."

"వీలుపడలేదంటావ్! రావటానికి వీలు పడకపోతే... ఫోన్ చెయ్యడానికేమయింది."

"పొరపాటే..." శాంతారాం ఒప్పేసు కున్నాడు.

"చేసిన పొరపాటు అంగీకరించటావే కాదు... ఇకముందు చేయకుండా ఉండాలి!"

"నిజమేకావచ్చు. కానీ..." శాంతారాం ఏదో చెప్పబోయాడు.

"నో ఆర్గ్యుమెంట్స్! ఇంతకూ ఏ ఊరు వెళ్ళినట్లు... వెళ్ళనవసరమేమిటి... మొదలైనవి ముందు విన్నవించుకోవాలి మాకు!"

శాంతారాం నవ్వేశాడు... "అది చెప్దామనే వచ్చాను. అర్జంటుగా రమ్మని టెలిగ్రాం వచ్చింది ఇంటిదగ్గరనుండి. ఏం కొంప మునిగిందోనని పరిగెత్తాను. ఇంతాచేస్తే పెళ్ళిచూపులకోసం."

సుధాకర్ హుషారుగా ఈలవేశాడు ... "అదీసంగతి! అయితే మాకు త్వరలోనే శుభలేఖలు అందజేయబోతున్నావన్న మాట!"

శాంతారాం తల అడ్డంగా ఊపాడు ... "అదేంలేదు. నేనిప్పుడే పెళ్లిచేసుకోనని తెగేసి చెప్పేశాను!" అన్నాడు.

"ఓ మైగాడ్ ... ఏమయింది నీకు!" సుధాకర్ ఆశ్చర్యంగా అన్నాడు!

"ఏమికాలేదు కాబట్టి తొందరపడ దలచుకోలేదు." శాంతారాం నవ్వాడు.

అరుణ అన్యమనస్కంగా ఉండి సంభాషణలో పాల్గొలేదు.

"నువ్వేం మాట్లాడటంలేదు!" అన్నాడు సుధాకర్ అరుణనుద్దేశించి.

"ఏం మాట్లాడమంటారు?" పొడిపొడిగా అడిగింది.

"అదేమిటి? మీ విప్లవకవి వివాహవ్యవస్థలోనే విప్లవం తీసుకొచ్చేలాగున్నాడు. బెండకాయలా ముదిరిపోతున్నా, ఇంకా ఇప్పుడే పెళ్లి అక్కర్లేదట! అంటే దీని అర్థమేమిటో!"

"వేరే అర్థాలేముంటాయి. వివాహమనేది వ్యక్తిగత సమస్య! అతని కారణాలు అతనికి వుండే వుంటాయి!"

"వండర్‌ఫుల్...ఈరోజు ఏదో జరిగితీరుతుంది. ప్రతి చిన్న విషయంమీద గంటల తరబడి కొట్లాడుకొనే మీరు ... ఇంత సుభావంగా...!! నో...నో...నమ్మలేకుండా ఉన్నాను!"

"నువ్వు నమ్మలేకపోవటం మా పొరపాటు కాదు. అది నీ గ్రహపాటు. నా పెళ్ళి సమస్య, ఎలక్షన్ 'మానిఫెష్టో' అనుకున్నావేటి? ప్రజలంతా చర్చించడానికి!" శాంతారాం అన్నాడు!

సుధాకర్ ఆశ్చర్యంగా చూసాడు.

"భలేవాడివే! నీ ఫ్రెండునికదా ... ఆమాత్రం చర్చించ కూడదా!" శాంతారాం నవ్వేశాడు... "అవసరం వచ్చినపుడు తప్పకుండా నిన్నే అడుగుతాను. సరేనా!"

సుధాకర్ ఆ విషయం మరి తరచి అడగలేదు.


శాంతారాం వెళ్లిపోయినతర్వాత, అరుణను అడిగిన ప్రశ్నే మళ్లీ సావిత్రి సుధాకర్‌ను అడిగింది "ఆ అబ్బాయి మన వాడేనా?" అని!

"ఏం...?"

"మా చిన్న వదిన కూతురు పెళ్లి కెదిగింది కదా! అబ్బాయి నదురుగా ఉన్నాడు. అందుకని!" అంది సావిత్రి!

"నదురుగా ఉన్నాడని అంగీకరించావుగా! చాలు! కుల మేదైతేనేంలె! ప్రయత్నించు!" అన్నాడు సుధాకర్ నవ్వుతూ!

"అదేంమాటరా! నదురుగాఉన్నా ప్రతి



అడ్డమైన వాడికి అమ్మాయి నిచ్చేస్తామా?''

''ప్రతి అడ్డమైన వాడికీ ఎందు కిచ్చేస్తాము, అత్తమ్మా! క్కడికే ఇస్తాంగాని! దాపరికం దేనిగ్గాని. .కదపమంటా వేమిటి?''

''నిది మరీ చోద్యం! ఎవరికెక్కడ వ్రాసిపెట్టి వుందో! ఘటన ... తప్పించగల మేమిటి?'' అంది సావిత్రి!

''అందుకే అంటున్నాను. వ్రాసిపెట్టి వుంటే, మీ చిన్నవదిన కూతురి పెళ్లి, కాని వాడితోనే జరగొచ్చు! అందుకని, మనకు బాగా తెలిసినవాడే అందుబాటులో వున్నపుడు— ప్రయత్నిస్తే తప్పేమేమిటి!''

''తప్పేముందిలే! ఇంతకు అబ్బాయి మనవాడేనా?'' సావిత్రమ్మ మళ్ళీ అడిగింది!

''పూర్తిగా మనవాడు. మనమెంతచెప్తే అంత!''

''అంటే మనకులస్థుడేనన్న మాట!'' సావిత్రి సంభ్రమంగా అంది. సుధాకర్ గట్టిగా నవ్వేశాడు... ''అని నేననలేదే!''— అన్నాడు!

''చెప్పేదేదో తిన్నగా చెప్పు!'' సావిత్రి చిరాకుపడింది!

''అలా కోప్పడకు. నువ్వు తిన్నగా అడిగి ఉంటే, నేను తిన్నగాచెప్పేవాడిని. ఇక, నీకా అబ్బాయి కులంఏమిటో కావాలి. అంతే కదూ? చెప్తాను. కాని, విన్నతరువాత గాభరాపడవుకదా!''

''గాభరా దేనికిరా? అతనేమయినా రాక్షసుడా ఏమిటి?'' సావిత్రి ఆశ్చర్యంగా అడిగింది!

''రాక్షసుడయినా నువ్వు పట్టించుకోవులే! కాని ఆ అబ్బాయి కులంతెలిస్తే, అంతకంటే ఎక్కువే భయపడతావు! ఇదంతా దేనికిలే గాని, వాళ్లు హరిజనులు! చాలా?''

సావిత్రి తెల్లబోయింది... ''హరిజనులా! అలా లేడే?''

''ఆలా', అంటే ఎలా అత్తమ్మా! ఎవడేకులస్థుడయిందీ వాడి మొహం మీద వ్రాసిపెట్టి ఉంటుందా?''

''వ్రాసిపెట్టకపోతే నాకేం! చూస్తూ అమ్మాయిని తక్కువజాతివాడికిస్తామా...?'' సావిత్రి కోపంగా అంది!

[ఇంకా వుంది]

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

... (ఎద్దులయ్యగారి కొత్తపల్లి?)

పులిని చూస్తే పులి బెదరదు, మేక వస్తే మేక ఎన్నడుఅదరదు...మనిషికి మనిషికి కుదరదు.

ఇదేదో సినారె పాటలా వుందిగాని... మనిషికీ మనిషికీ ఎందుకు కుదరదు?! ఈ సాగుతున్న సంసారాలన్నీ ఏమిటి? శాశ్వతంగా నిలిచిపోతున్న యీ అనుబంధాలన్నీ ఏమిటి?

జగదీశ్ కర్నూలు.

నేటి యువతీ యువకుల పెళ్లి నిర్ణయాలు ఎలా వుంటాయి?

రసవత్తరంగా వుంటాయి. వినండి—

అబ్బాయి తండ్రి : మా వాడి కిప్పటి దాకా చదువుకే నలభై వేలైంది.

అమ్మాయి తండ్రి : చిత్తం, పొలిక ఇవ్వకలవు లాంచనాలన్నీ— సవ్యంగా జరిగేలా చూడగలను.

అబ్బాయి తండ్రి : లాభం లేదయ్యా, డాక్టరయితే మావాడు లక్ష పలుకుతాడు

అమ్మాయి తండ్రి : చిత్తం పోనీ వలభై ఇస్తాను— లాంచనాలు తగ్గించండి.

అబ్బాయితండ్రి : కట్నానికి తగ్గ లాంచనాలు లేకపోతే నవ్వుతారు బావగారూ, ఏదో కానిచ్చెయ్యండి.

అమ్మాయి తండ్రి : చిత్తం ఎలాగో కానిస్తాను లెండి

అమ్మాయి:(స్నేహితురాళ్లతో)మాది లౌ మేరేజి. మా నాన్న ఒప్పుకున్నారు.

అబ్బాయి : నన్ను ప్రేమించింది. నన్ను తప్ప ఎవరినీ చేసుకోనంది(సిగ్గుపడుతాడు)

జగదీశ్ బాబూ, పెళ్లి నిర్ణయాలు మన కుర్ర వాళ్లు తీసుకోరు— వారికిబాధ్యత తమ మీదే వుంటుందని భయం.

టి. కె. ఎమ్. పర్లాకిమిడి.

నాకు ఉద్యోగం దొరికే అవకాశంలేదు. అందుకని హిప్పీలలో చేరిపోతేనో?

ఉద్యోగాలు లేకా, రాకా, ఇంకేంచేతకాక హిప్పీలయ్యారని ఎవరు చెప్పారు మీకు? వారిలో కొందరిలో వున్న జిజ్ఞాస, మనదేశం గురించి, ప్రపంచమత వహించిన ఆధ్యాత్మికతత్వం గురించి— తెలుసుకోవాలని వారి కెంత కుతూహలమో మీలాంటివాళ్లు వింటే ఆశ్చర్యపోతారు. అంతెందుకు, మనలో చాలామందికి తెలియని ఎన్ని విషయాలు— మన దేశం గురించి, మన గురించి— వాళ్లకి తెలుసు... ఒక్క పూట భోజనం లేకపోతే, ఒక్క సదుపాయం కొరవడితే సతమతమైపోయే మన యువకులకి— ఎక్కడికక్కడ సంపాదించుకుంటూ, అది ఖర్చుపెట్టుకుంటూ— కష్టసుఖాలు నాకేలా చూడకల్గిన విదేశీ హిప్పీలకీ— పోలిక లేదు.

జి. ఆర్. కె. పేరూరు.

షట్సూత్ర పథకంపై మీ అభిప్రాయం?

ఇప్పుడింక అభిప్రాయాలకి వయి దాటిపోయింది. కాని నా కొకటే బెంగ ''ప్రవాసాంధ్రులకి' ఆంధ్రలో ఎటువంటి స్థానం ఇస్తారో-ఎందుకంటే స్థానికులం కాదు. పోనీ అవి పై రాష్ట్రాలవాళ్లం కాదుకదా?!

డి. బి హెచ్. పెమ్మారెడ్డిపాలెం.

నేను ఒక కథ రాసేను. దాన్ని పత్రికకు పంపాలనుకొంటున్నాను. పంపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుపండి.

ఏముంది భవానీ, మరీ సున్నితమైనవి పట్టుకొంటే పగిలేవి పాత్ర లుంటే జాగ్రత్తగాచుట్టూ ఏ గడ్డిగానీ, కాగితం ముక్కగానీ కుక్కి 'పేక్'చేయి. మరీనీళ్లకారేదుఃఖభాజనం ఆయిన పాత్రలున్నాయా జాగ్రత్తగా చుట్టూ ఆయిల్ పేపర్ చుట్టు. పైన 'సున్నితం, జాగ్రత్త' అనో. 'పగులును, జాగ్రత్త' అనో హెచ్చరిక రాయి. లేకుంటే సంపాదకులా దుఃఖసముద్రంలో మున్గుతారు. లేదాపగిలిన ప్రతిమల కాళ్ళు చేతులూ కలగాపులంఅయి— ఆ పజిల్ పరిచేసేసరికి కాలం వృధా అయిపోతుంది! అంచేత— యీ జాగ్రత్తలు. అర్థం అయిందా.

కె. ఎస్. ఎస్. రాయగడ

ఎదుటివారి నుంచి ఆప్యాయత, అనురాగం పొందాలంటే ప్రతిమానవునికి ఏం ఉండాలి.

ముఖ్యంగా ఆ పొందాలన్న ఆశ ఉండకూడదు. కొన్ని అడక్కుండా లభ్యం అవాలి. అలా రావాలంటే— అవి ముందు మనం ప్రదర్శించాలి. మనలో ఏదో చూసి ఎదుటి వారు ఇష్టపడాలనే కంటే మనం చూపిన 'ఇది'కి వారు ఇష్టపడడంలో కూడా అందం ఉంది. ●

మ న వి

ప్రశ్నావళికి సందేహాలు పంపించే పాఠకులు తమ ప్రశ్నలను వీలైనంత క్లుప్తంగా 'కార్డు'లపైన వ్రాసి పంపాలి. కార్డుపై రెండో వైపు తమ పూర్తి చిరునామా వ్రాయటం అవసరం. కవర్లు, ఇన్‌లాండు కవర్లు వ్రాయడం దండుగ అనుకుంటాము. —సం.

వారఫలం

—మహేష్—

15-2-1974 శుక్రవారం మొదలు

21-2-1974 గురువారం వరకు

మేషం :— వ్యాపారంలో యెవరినీ విశేషంగా నమ్మడగ తగదు. ఆందోళన కలుగు తుంది. వారం మధ్యలో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. అధి కారుల వలన జరగ వలసిన వ్యవహారాలు బాగుం టాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. బంధువులకు సహాయం చేస్తారు.

వృషభం :— మీ ఆలోచనలు ఫలిస్తాయి. పోటి వారిలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో చికాకులు యేర్పడతాయి. మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వారం ఆఖరులో అన్ని వ్యవ హారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుం డదు. వినోద కాలాక్షేపాల్లో పాల్గొంటారు.

మిథునం :— వృత్తిలో పోటివారి పోటీ పెరుగు తుంది. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. ఇతరుల నిమిత్తం ప్రయాసకు గురి కాగలరు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వ్యతిరేక మైన పరిస్థితి యేర్పడు తుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

కర్కాటకం :— వ్యాపారంలో ఆదాయం బాగుం టుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభి స్తాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగు తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. వారం ఆఖరులో ప్రయత్నించిన ప్రతిపనీ సులు వుగా నెరవేరగలదు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుం టుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

సింహం :— మీ కార్యక్రమాలు హడావుడిగా వుంటాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. ముస్ముందు లాభించగల వ్యవహారాల్లో అనుకూలత లభించగలదు. వారం ఆఖరులో మీరు అనుకునేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. స్త్రీలకు— దైవకార్యాలు నెరవేరతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కన్య :— వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వినోద కాలాక్షేపాల్లో పాల్గొంటారు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన సమా చారం అందుతుంది.

తుల :— వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. కోర్టు వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారంలో పోటివారి పోటీ తగ్గుతుంది. వారం ఆఖరులో సామాన్యమైన పనులకు కూడా మీరు ఎంతో కృషి చేయవలసి వస్తుంది. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధు మిత్రులను కల్సుకొంటారు.

వృశ్చికం :— అన్ని వ్యవహారాలు బాగుంటాయి. పోటివారిలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. అధికారుల వలన జరగ వలసిన వ్యవ హారాలు సులువుగా నెరవేరతాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెలుసుకొంటారు.

ధనుస్సు :— మీ కార్యక్రమాల్లో చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో శ్రమ కలుగు తుంది. వారం మధ్యలో ప్రయాణాలు ఫలిస్తాయి. వ్యాపా రంలో ఆదాయం బాగుంటుంది. విద్యా వైజ్ఞా నిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. మీ ఆలో చనలు లాభించగలవు. స్త్రీలకు— కుటుంబ వ్యవ హారాలు బాగుంటాయి. మీ తాలూకు వస్తువులు పోవచ్చును.

మకరం :— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో అధిక వ్యయం జరుగు తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషికి ఆటం కాలు వస్తాయి. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కుంభం :— అధికారుల వలన జరుగ వలసిన వ్యవ హారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారి పోయే ప్రమాదం వుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగు తుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

మీనం :— వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. ప్రయోజనం గల పరి చయాలు యేర్పడతాయి. మీరు ఇదివరకు చేసిన ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన విష యాలను తెలుసుకొంటారు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు కలిగి స్తాయి.



మీ గోళ్లు ప్రకాశవంతగా
మెరియునట్లు చేయండి
బాగుగా మిళితం చేయబడిన
స్టెప్ నెయిల్ పాలిష్‌తో
మునివ్రేళ్లకు
తేజోవంతం
Step®
నెయిల్ పాలిష్
Step
Pearl
దివ్యమైన రంగులలో ఒకటిగాని ఎక్కువగాని ఎంచుకోండి

గాలిపటాలు

సూరత్తు వేణుగోపాలరావు

(గత సంచిక తరువాయి)

భాస్కర్. అంత తొందరేమిటి, వాణీ? కాసేపు కూర్చోగూడదా? ఇంకా టైముందిలే. ఈమధ్య చాలా హడావిడిగా వుంటున్నావు. ప్రతి సంఘంలోనూ నువ్వే! ప్రతి పత్రికలోనూ నీ ఫొటోయే! నువ్వు లేకుండా ఈ వూళ్లో ఏ కార్యక్రమమైనా జరుగుతుందా అని నా సంశయం.

వాణి. (కూర్చుని) ఏదో వుండబట్టలేక నెత్తిమీద అన్నీ వేసుకుని చాకిరీ చేస్తున్నానుకాని ఈ దేశంలో నమ్మకంగా పనిచేసేవాళ్లకి ఏమైనా మెప్పు వుందా? చెప్పు మొన్నటికి మొన్న, అంత ర్జాతీయ సాంఘిక సంక్షేమ సభ న్యూయార్క్‌లో జరిగింది. నన్ను డెలిగేట్‌గా పంపిస్తానని నాతో నలభై పేజీల పేపరు రాయించింది మా ప్రెసిడెంటు రాత్రింబగళ్లు కష్టపడి బ్రహ్మాండమైన పేపరు తయారు చేశాను తగుదునమ్మా అని అది పట్టుకెళ్లి ఆ మహాతల్లి గుక్కతిప్పుకోకుండా చదివేసింది. పని ఒకరిది, ఫలితం ఇంకొకరిది.

భాస్కర్ ఇది ప్రతిచోటా వుండేదే. మన దేశంలో చెప్పనక్కరలేదు.

వాణి ఉండొచ్చు నీతులు చెప్పడమెందుకు! సంఘ సంస్కారులం, ప్రజాసేవకులం అని డబ్బా కొట్టుకోవడ మెందుకు? మనస్సులో సంస్కారం లేనివాళ్లు సంఘాన్ని మరమ్మత్తు చేస్తారా? (సుమతి కేసి చూసి) మళ్లీ దిగాలుగా ఉన్నావేమిటి? ఇందాక చాల హుషారుగావుంటే మా సుమతి మళ్లీ మనలోకి వచ్చిందనుకున్నాను...

రామయ్య (హడావిడిగా వచ్చి) లేడండీ. అంతా చూశాను గోపీ ఎక్కడా కనబడలేదు.

వాణి. అవునవును .. గోపీ ఎక్కడ?

సుమతి (దుఃఖంతో) గోపీ లేడు, వెళ్లిపోయాడు

వాణి వెళ్లిపోయాడా? కొంచెం వీలు చూసుకుని, వాణ్ణి ఇక్కడేపెట్టి చదువు చెప్పిస్తానన్నావుగా! ఆ లింగయ్య వచ్చి తీసుకుపోయాడేమిటి?

సుమతి· అలా తీసుకుపోయినా బాగుండేది గోపీ ఎంత ఛండాలపు పని చేశాడో తెలుసా? రాజా లాకెట్టు లేదూ — ఆ ఫొటోమీద వుండేది — అది తీసుకుని పారిపోయాడు. పాపిష్టి వెధవ!

వాణి· ఆ! అంతపని చేశాడా? నాకు మొదటి నుంచీ సందేహంగానే వుంది. పుట్టుకతో వచ్చిన బుద్ధులు ఎలా పోతాయి? ఒక కన్నువేసి చూస్తుండమని చెపుదామనుకున్నాను నీ ఉత్సాహం చూసి సంశయించాను. భీంపేట వాతావరణంలో పెరిగే పిల్లలు ఎంతకైనా, తెగిస్తారు మనం జాలితలచి వూరుకుంటే లాభంలేదు.

సుమతి: (కొంచెం ధీమాగా) భాస్కర్, పోలీస్ రిపోర్టు ఇచ్చార్లే.

వాణి: మంచిపని చేశావ్, భాస్కర్... ఇవ్వాళ ఇది చేశాడు. పిల్లవాడని ఊరుకుంటే, రేపెవరి గొంతో కోస్తాడు బాల నేరస్తుల మనస్తత్వం అర్థం చేసుకోవడం చాలా కష్టం. వాళ్లకి కావల్సింది సరైన చికిత్స. కాని వాడు మనకి దొరకాలిగా! వాడి తండ్రి లింగయ్య ఎక్కడో దాచేసివుంటాడు. ఇందులో లింగయ్య మద్దతు కూడా వుంటుంది.

[లింగయ్య తలుపు తోసుకుని గబగబా వస్తాడు.]

లింగయ్య. (ఆవేశంగా) డాక్టరుసాబ్, గోపీ గాడు ఇక్కడ చోరీ చేసిపోయిండంట. నిజమా బాబూ? ఏదో బంగారు గొలుసు ఎత్తుకుపోయాడంటగా?

భాస్కర్. నిజమే లింగయ్యా?

లింగయ్య: (కోపోద్రేకంతో) వెధవసన్నాసి! ఎంత దగుల్బాజిపని చేసిండు! నా కళ్ళబడితే ఒళ్ళు చీరేస్తాను. అళ్ళమ్మ కడుపున చెడబుట్టాడు. ఎధవ... (కోపం భరించరాని దుఃఖంగా మారుతుంది) ఈ చేతుల్తో పొద్దుగాల ఒక కొడుకుని మట్టికేశా! చోరీచేసి పరారుగాకుండా, ఈడుకూడా, వాడితోపాటే పోతే సంతోషించేవాడిని (మళ్లీ ఆపరాని కోపంలో) ఎక్కడికి పోతాడో చూస్తాను సున్నంలో ఎముక లేకుండా వాణ్ణి చితకకొట్టకపోతే, నాపేరు లింగయ్య కాదు. నీ కెక్కడనుంచి వచ్చిందిరా పాడుబుద్ధి?

వాణి: చేతులు కాలింతర్వాత ఆకులకి పరిగెత్తితే ఏం లాభం? తప్పంతా నీలో పెట్టుకుని గోపీని తిడతావెందుకు?

లింగయ్య: (గబుక్కున వాణికేసి తిరిగి) ఓహో! వాణమ్మగోరా? తమరిక్కడున్నారా? (వెటకారంగా) ఇంతకీ తప్పంతా నాదేనంటావు. బలే బాగుంది! నేను గోపీకి చోరీలు చెయ్యమని చెప్పినా? నేర్పించానా? లింగయ్యంటే ఏమనుకుంటుండ్రో! నేను పేదోడిని కావచ్చు. కడుపు కక్కుర్తికి గుడుంబా వ్యాపారం సెయ్యొచ్చు. కాని నాకూ పరువు ప్రతిష్ఠ వున్నాయి.

వాణి చాల్లే, నీ శ్రీరంగనీతులు. నువ్వు చేసే గుడుంబా వ్యాపారంలో పిల్లలతో రవాణా చేయించడం కూడా కడుపు కక్కుర్తికేనా? నీ భార్యపోయిన తర్వాత వాళ్ల సంగతి ఏమైనా ఆలోచించావా? చివరికి ఆ ముత్యాలుని సరాసరి ఇంటికే తెచ్చుకున్నావు. ఎప్పుడూ తాగుడు, తందనాలు. తండ్రి అదుపులేక తల్లిలేని పిల్లలు తప్పుదారి త్రొక్కారంటే దానికి ఎవరు బాధ్యులు?

లింగయ్య: (కోపంతో) ఒక కొడుకు చచ్చాడనీ ఇంకొకడికోసం పోలీసోళ్లు వేటంతా గాలిస్తున్నారనీ కుమిలిపోతున్న నన్ను అనవలసిన మాటలేనా?

సుమతి. ఆ సంగతులన్నీ ఇప్పుడెందుకులే వాణీ? నాకిదంతా ఒక పీడకలగా వుంది

భాస్కర్· లింగయ్యా నీకెంత బాధగావుందో నాకు తెలుసు అసలే పెద్ద విచారంలో ఉన్నావు పులిమీద పుట్రలా గోపీ చేసిన దొంగతనం! పోలీసులకి రిపోర్టు ఇవ్వటం నాకుమాత్రం ఇష్టమేనా? కాని చెయ్యక తప్పలేదు.

లింగయ్య: చెయ్యాల్సిందే బాబూ, నేను చెయ్యొద్దన్నానా? వాడి పాపాన వాడు పోవల్సిందే. కాని ఖర్మం అంతా నాది ఒక్కరోజులో యిద్దరు పిల్లలూ దూరమైపోయారు. దేవుడా, నాకెంత కష్టం తెచ్చిపెట్టావు?

వాణి: (ఆవేశం పెరిగిపోయి) ప్రతి విషయానికీ భగవంతుణ్ణే తేవడం మనకి ఆచారం. పిల్లల్ని గుడుంబా వ్యాపారంలోకి దింపావు. చిల్లర దొంగతనాలు చేస్తూ సినిమాలకీ గాలిపటాల పందేలకీ పోతూవుంటే నీకేమీ ఎట్టనట్లు వదిలేశావు. రాత్రిళ్లుకూడా ఇంటికి రాకుండా ఏ బస్సుస్టాపు దగ్గరో, సినిమాహాలు వద్దనో జేబులు కొడుతుంటే అదమాయించకుండా ముత్యాలుతోటిదే లోకమనుకుని తండ్రివన్న బాధ్యత మరిచిపోయావు ఇప్పుడు ఏడ్చి ప్రయోజన మేమిటి? పిల్లలు సంఘానికే ప్రతికూలురై ఇష్టంవచ్చినట్లు తిరుగుతున్నారంటే తప్పంతా తల్లిదండ్రులదే నంటాను ..

లింగయ్య. (కోపంగా) ఏమమ్మా, పెద్ద మాట లిడుస్తుండవ్? ఇది డాక్టరుగారి ఇల్లు కాబట్టి సరిపోయింది.

వాణి. (వినిపించుకోకుండా) ఏం? భయపెడుతున్నావా? నిజం చెపితే నిష్ఠూరం. ఆనాడు నీకు చిలక్కి చెప్పినట్లు చెప్పాను జ్ఞాపకంవుందా? చాలా చెడు వాతావరణంలో నీ పిల్లలు పెరుగుతున్నారు వాళ్లని మా పతిత బాల జనోద్ధరణ సంఘానికి ఒప్పగిస్తే అంతా మేము చూచుకుంటామంటే విరుచుకుపడ్డావు. భీంపేటలో కాలుపెడితే చూసుకోండి అని బెదిరించడమేకాకుండా మీ రౌడీ మూకని మామీదకి పంపించావు సమయానికి పోలీసులు రాబట్టిగాని లేకపోతే, ఏం అఘాయిత్యం జరిగేదో!

భాస్కర్ లింగయ్యా! ఎంత మంచి అవకాశం పోగొట్టుకున్నావు? స్వార్థచింత లేకుండా, సంఘానికి వాణమ్మ ఎంత సేవ చేస్తుందో నాకు తెలుసు. ఆమె నడిపే గృహానికి గోపీని అప్పగించి వుంటే ఈనాడు ఇలాంటిపని చేసేవాడుకాడు కదా!

లింగయ్య: ఏంటో బాబూ, బతికిచెడ్డోళ్లం, మా యిల్లు గుడిసే కావచ్చు మేము గంజినీళ్లు తాగి బ్రతికేవాళ్లమే కావచ్చు కాని చూస్తూ చూస్తూ నా పిల్లల్ని వీళ్లదగ్గిర పెడతానా? మీరేమన్నా అనండి— ఈ అమ్మ నడిపే సంగం కంటే, నా యిల్లు ఎంతో నయం —

వాణి : బాగుంది. చాలా బాగుంది ! నరకమే నయమన్నావుగాదు !

లింగయ్య . (కోపంతో) ఇందాకా వచ్చింది కాబట్టే అంతా చెప్పేస్తా డాక్టరుసాబ్, మీరేమీ అనుకోకండి ... మా గోపీగాడు దొంగతనంచేసింది నిజమేకాని సంగం, సంగం అంటూ గవర్నమెంటునీ ప్రజల్నీ, మాయచేసే గొప్పోళ్ల సంగతేంటంట ? తెరవెనుక వాళ్లాడే భాగోతాలు —

వాణి : ఆగు ! నిజం చెప్పానుకదా అని, నీ ఇష్టంవచ్చినట్లు మాట్లాడుతున్నావు

లింగయ్య నేను ప్రత్యేకంగా మిమ్మల్నంటం లేదమ్మా ! ఇప్పుడు జరుగుతున్న సంగతులు చెప్పాను. నేను దొంగసారాయి అమ్ముతుండేది సత్తెమే. కాని ఈ యాపారంలో మొత్తానికి లాభం కొట్టేది ఎవరో తెలుసా ? మా నాయకుడు రాధా కిట్టయ్య ... మేము సీసాలు తాగితే ఆయన పీపాలే మింగుతాడు నెలమొదట్లో ఆయన వాటా ఆయనకి నిక్కచ్చిగా అందాల్సిందే. (వికృతంగా నవ్వుతూ) అయితే ఆయనాపాడుడబ్బు ముట్టుకోడులెండి కుర్చీకాడ పడేసి పొమ్మంటాడు

భాస్కర్ .రాధాకృష్ణమూర్తిగారా? ఛ, ఛ! నేను నమ్మను ? ఆయన చాలా పెద్దమనిషి.

లింగయ్య . మీకేం తెలుస్తాయి బాబూ ? ఈ లోతుపాతులు. పెద్దమనిషే ! పెద్దమనిషి కానోడెవ్వడు ? .... ఆయన్ని ఎన్నుకొన్నాం. సంగం, దేశం అంటూనే మింగేస్తున్నాడు. ఆయనొక్కడే కాదు. ఆయన భార్య, బావమరిది కూడా రెండుచేతులా లాగేస్తున్నా రు ఏమన్నా అంటే, మాలాంటి బీదోళ్లకి, చాంతాడంత ఉపన్యాసాలు దంచుతారు

వాణి మా సంఘం వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణమూర్తిగారిని అనవలసిన మాటలేనా ? ఛీ, ఈ దేశంలో వున్న కుళ్లు ఎక్కడా వుండదు ఒకళ్లు పనిచెయ్యరు, చేసేవాళ్లమీద నానా అభాండాలు వేస్తారు ఇక దేశం బాగుపడటం అంటే ఎలా !

లింగయ్య . అదే తల్లీ ! నేనూ అడుగుతుంట ! దేశం బాగుపడాలని, ఎవరికుంది, అంతా పచ్చి అబద్ధం. ఎవడికి దొరికింది ఆడు జేబులో నింపుకుంటుండు పెద్ద పెద్ద ఆఫీసర్లు, కంట్రాక్టర్లు, నాయకులు, అందరికీ పట్టిందీ దబ్బులాపే ! అది ఘరానా దొంగతనం కాబట్టి ఏమీ పరవాలేదు.. కాని మా గోపీలాటోడు కక్కుర్తిపడితే బందిఖానాలోకి తోసేస్తారు

భాస్కర్. నువ్వు చెప్పేదాన్లో కొంత నిజం లేకపోలేదు కాని, పిల్లవాడు చెడిపోతున్నాడుగదా అని గోపీని సంఘంలో చేర్పించమన్నప్పుడు నువ్వు ఒప్పుకోకపోవడం, ఏమీ బాగాలేదు వాణి మాట వినివుంటే, గోపీ ఇంత నీచానికి దిగజారివుండేవాడు కాదుగదా !

లింగయ్య మీరేమీ అనుకోనంటే, ఒక సంగతి చెప్తా. వాణమ్మ నడిపే సంఘంలో ఎంత కుళ్ళ—

వాణి : (అడ్డంవచ్చి) నీతీ జాతీ లేని లింగయ్యలాంటివాళ్లు చెప్పేదంతా వింటూ కూర్చుంటే అయినట్లే ! సాంఘిక సంక్షేమ కలాపాల్లో వున్న తంటా అంతా ఇదే చేసినదానికి మెప్పులేదుకదా అపవాదులూ చెప్పుదెబ్బలూ...

సుమతి · [మొదటిసారిగా ఇంటరెస్టు చూపిస్తూ] పోనీలే వాణీ, లింగయ్య చెప్పేదికూడా విననీ ఏ లోపమూ లేకుండా సంఘాలు నడుస్తాయా ! అంతమాత్రానికే మనం భయపడటం ఎందుకూ ? [లింగయ్యతో] ఏమీ పరవాలేదు, చెప్పు

లింగయ్య . పదిమంది పిల్లలుంటే, యాభై పిల్లల పేర్లు చూపించి గవర్నమెంటు గ్రాంటు తీసుకుంటున్నారు అందరికీ వాటాలే ! చివరికి, ఆళ్ళు, ఈళ్ళు, వూరికే ఇచ్చే పాలపొడికూడా, బ్లాకులో అమ్ముకుంటారు దీనికంతా రాధాకిట్టయ్య మద్దతు. ఈ వాణమ్మ కేంతెలుసు ? వారానికోమాటు సీతాకోక చిలుకలా వచ్చి నాలుగు నీతులు చెప్తే సరిపోద్దా ! తోటోళ్ళూ కిందోళ్ళూ, ఏం దగుల్బాజీ పని చేస్తున్నారో చూసుకోవద్దా ? అంతా మోసం ! ఈళ్ళంతా దేశాన్ని మరామత్తు చేస్తారట! చెయ్యండి ! నా గోపీని గూడ మరమ్మత్తు చెయ్యండి! నేనెలాగూ నాశనమైపోయాను వాడన్నా బాగుపడ్తాడేమో

(బయట కొంచెం హడావుడి. తలుపుకొట్టి, 'డాక్టర్ భాస్కర్ వున్నారా', అంటూ ఇన్‌స్పెక్టర్ వస్తాడు అతని వెనకాల గాలిపటాలు పట్టుకొని గోపి గోపీ ముఖంలో భయం, నిస్సహాయత గోచరిస్తాయి)

భాస్కర్ ఇన్స్‌పెక్టరుగారా ? రండి కూర్చోండి (గోపీని చూపిస్తూ) దొంగ దొరికాడే ?

లింగయ్య : (గోపీతో కోపంగా) నా కడుపున చెడబుట్టావుకదరా ? నిన్నేంచేసినా పాపంలేదు ! ఆ నరిసిమ్ములుగాడితోపాటు నువ్వుకూడా చావక పోయావా ?

గోపీ : ఆ ! ఏమంటున్నావు నాయనా ? నరిసిమ్ములు సచ్చిపోయిండా ? (తటాలున్న గాలిపటాలు క్రిందపడేసి ఏడుస్తూ) సచ్చిపోయిండా ? అమ్మలాగే



దేవుడి దగ్గరకి పోయిందా ? అన్నా ! అన్నా ! (తండ్రి దగ్గరకి వెళ్ళబోతాడు.)

లింగయ్య : (కోపంగా) ఛ – ఎదవనాయాలా! సిగ్గులేదూ ? వళ్ళు పూనంజేత్తాను. . ఇన్సపెక్టరు గారూ, ఇంకా చూస్తారేంటి ? వాడిని తీసుకుపోయి కాకులకి గద్దలకి పడేయండి... పీడా వదిలిపోద్ది.

గోపీ (హృదయ విదారకంగా ఏడుస్తూ) ఎర్రిములన్నా, నువ్వుకూడా అమ్మదగ్గిర కెళ్లి పోయావా ? నన్నొక్కణ్ణిచేసి ఎళ్లిపోయావా ?... నీకు మళ్ళీ అమ్మ దొరికిందికదూ నా కెవరున్నారు? అయ్య నన్ను సంపేత్తాడంట

లింగయ్య : చేసిన దొంగపని చాలక ఏడుస్తుం డావా నోర్ముయ్.

ఇన్స్పెక్టర్ : ఉండవయ్యా . . ఉండు నీ గోలేమిటి మధ్య ! (భాస్కర్‌కేసి తిరిగి, జేబులోంచి లాకెట్టుతీసి చూపిస్తూ) ఇదేనా మీ లాకెట్టు ?

భాస్కర్ : అవునండీ, ఇదే ! . (విజయ పూర్వకంగా సుమతితో) మన రాజా లాకెట్టు మనకి మళ్లీ తప్పకుండా దొరుకుతుందని నేను చెప్ప లేదూ ? నీ హృదయంలో బరువు తగ్గిందిగదా! (సుమతి మాట్లాడదు. ఏదో అనబోతుందికాని ఉద్వేగ భారంతో తలవంచుకుంటుంది.) చాలా థ్యాంక్సు, ఇన్స్పెక్టరుగారూ, మా ఆవిడకీ లాకె ట్టంటే పంచప్రాణాలు. అందుకనే మిమ్మల్ని తొందరచేశాను ఏమీ అనుకోకండి —

ఇన్స్పెక్టరు దానికేమిటిలెండి. మా విధి ఎలాగయినా నిర్వర్తించాల్సిందేగదా !

(రంగనాయకులు హడావుడిగా ప్రవేశిస్తాడు)

రంగ (ఒగురుస్తూ, గా బ రా గా) ఇన్స్ పెక్టరుగారూ, ఇన్స్పెక్టరుగారూ, మీరిక్కడికి వచ్చారని విని పరాసరి పరిగెత్తుకువచ్చా. చాలా ముఖ్యమైన విషయం సార్.

ఇన్స్పెక్టర్ : ఎవరయ్యా నువ్వు ?

రంగ : నేనా !

రామయ్య : (శ్రీరామచంద్రా ! ఈ చెవిటోడు మళ్లీ దాపరించాడు ఇన్స్పెక్టరుగారూ, పేరడిగితే ఒకపట్టాన్న తెమలదులెండి ! మీకెందుకా బాధ ! ఈయన పేరు చింతముక్కల వేంకట సత్యనారాయణ శాయి ఉరఫ్ ఏదో నాయకుడు.

రంగ : బొంద నాయకులంటావేమిటి ? రంగనాయకులయ్యా రంగనాయకులు.

గాలిపటాలు

ఇన్స్పెక్టర్ : (చిరాగ్గా) నీ బొంద ! ఇంతకీ కొంపలంటుకున్నట్లు వచ్చావేం ? మీ యింట్లో ఏమైనా చోరీ అయిందా ఏమిటి ?

రంగ : (నీళ్ల నములుతూ) భీంపేటనుంచి మా బావమరిదిని పట్టుకొచ్చారటగదండీ ? వాడి కేమీ తెలియదండి. ఈ జులాయివెధవ గోపీగాడు వచ్చి గాలిపటాలు కావాలని గొంతుమీద కూర్చుంటే గొలుసు తాకట్టుపెట్టుకుని ఇచ్చాడంట !

ఇన్స్పెక్టర్ : (రౌద్రంగా) ఓరి ! దొంగ గాడిదా ! నువ్వేనట్రా ! నీ బావమరిదిని వెనకాల పెట్టుకుని పిల్లలతో దొంగతనాలు చేయించి సంపా దిస్తున్నావు కదూ ? —

రంగ : అయ్యబాబోయ్ ! నా కేమీ తెలీ దండీ ఏదో కృష్ణా రామా అనుకుంటూ చేత నైనంతవరకూ పిల్లలకోసరం పాటుపడుతున్నా నండి కావాలంటే వాణమ్మ నడగండి. ఆమె స్థాపించిన పిల్లల సంఘానికి కోశాధికారిగా పూరికే పని చేస్తున్నానండీ ఒక్క పైసాకూడా ముట్టి ఎరగను మానవసేవే మాధవసేవ...

ఇన్స్పెక్టర్ : నోర్ముయ్ ... పిల్లల్ని నేరాలు చేయడానికి ప్రేరేపించి వాళ్లని దోచుకుతింటూ ఏమీ తెలియనట్లు నటిస్తున్నావా ? రాస్కెల్ !... పద ... స్టేషన్‌కి పద ఇక్కడగాదు, నీ భరతం అక్కడే పట్టాలి.

రంగ : ఇన్స్పెక్టరుగారూ, తొందరపడు తున్నారు అల్లాటప్పావాళ్ల మనుకుంటున్నారేమో ! రాధాకృష్ణయ్యగారికి కబురుచేసే బయలుదేరా నండీ . అవసరమైతే మంత్రిగారితో గూడ ఒక మాట...

ఇన్స్పెక్టర్ : ఏం నాయనా ? బెదిరిస్తు న్నావా ? నీలాంటివాళ్లని చాలామందిని చూశాను.. ఏయ్ త్రీనాట్‌ఫోర్ ! వీణ్ణి తీసికెళ్ళి స్టేషన్ లాకప్‌లో పెట్టు (కానిస్టేబులు రంగనాయకుల్ని నెట్టు కుంటూ వెళ్లిపోతాడు)

రామయ్య : (శ్రీరామచంద్రా ! రామాయణంలో పిడకల వేటలాగుంది

ఇన్స్పెక్టర్ . డాక్టర్ భాస్కర్, అసలు సంగతి వింటే మీరు చాలా ఆశ్చర్యపోతారు. ఈ గోపీ లాకెట్టు ఎందుకు దొంగతనం చేశాడో ఊహిం

గాలిపటాల బెడద

జంటనగరాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసినప్పుడు ఆరెండు రోజుల్లో జరిగిన సంఘటనల్లో 9 సంవత్సరాల బాలుడు మరణించాడు 181 మందికి గాయాలు తగిలాయి.

ఉస్మానియా ఆసుపత్రి అధికారులు చెప్పిన దాని ప్రకారం సంక్రాంతి నాడు ఎక్కువ ప్రమాదాలు జరిగాయి. 105 మంది గాయపడ్డారు. వారిలో నల్గురికి తీవ్రమయిన గాయాలు తగిలాయి. వారిని ఆసుపత్రిలో చేర్చారు. మిగతావారికి చికిత్సచేసి పంపేశారు నారాయణ గూడాకు చెందిన మహ్మద్ యూసఫ్ పటాలు ఎగరవేస్తుండగా తీవ్రమయిన గాయాలకు లోనయి మరణించాడు. పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ ఇండ్ల కప్పులమీద నుంచి పడిపోవడమో లేక గాలి పటాల వెంట రోడ్డు మీద పరుగెత్తడమో జరిగి ప్రమాదాలకు లోనవుతున్నారు. ★

చారా ?... (క్రిందపడిపోయిన గాలిపటాలకేసి చూపిస్తూ) వాటికోసం —

భాస్కర్ : నే ననుకున్నది నిజమేనన్నమాట గోపీ, ఈ దౌర్భాగ్యపు గాలిపటాలకోసం దొంగతనం చేశావా ? అడిగితే ఇవ్వకపోయానా ! ఒకటికాదు, వంద కొనిపెడుదునుగదా !

గోపీ : నేను దొంగతనం చెయ్యలేదయ్యాగారూ, ఒక్క గాలిపటం కొనియ్యమని అమ్మని అడిగానండి. కొట్టింది ముసలాయన్ని అడిగితే ఆయన కేక లేశాడు. అప్పుడు రాజా నడిగానండీ నా గొలుసు తీసుకుని కొనుక్కోరా, అన్నట్లు అనిపించిందండీ !

ఇన్స్పెక్టర్ : ఆ లాకెట్టు ఇలా ఇచ్చెయ్యం డమ్మా !


సుమతి : అదేమిటి ! మాకు ఇవ్వరా ?

ఇన్స్పెక్టర్ . అప్పుడేకాదమ్మా, పిల్లలకోసం ప్రత్యేకంగా కోర్టు వుంది. అందులో మేము కేసు పెట్టాలి. విచారణ పూర్తికాగానే మీ లాకెట్టు మీకు యిచ్చివేస్తారు. డాక్టరుగారూ, మీరు మాత్రం లిఖితపూర్వకంగా ఒక రిపోర్టు ఇవ్వాలండీ.

భాస్కర్ : అలాగే. రామయ్యా లోపలికి పోయి ఒక కాగితం తీసుకురా.

సుమతి . (ఏదో నిద్రలోనుంచి లేచిన వ్యక్తిలా) కొంచెం ఉండండి మరి గోపీ సంగతేమిటి ?

వాణి : గోపీ సంగతా ? అది చాలా స్వల్ప విషయం. కోర్టులో విచారణ అయిపోగానే వాణ్ణి జైలుకు పంపరులే. మా సంఘానికి పంపిస్తారు. (ఇన్స్పెక్టరుతో) గోపీని మెజిస్ట్రేట్ దగ్గర హాజరు పరిచి ఆర్డరు తీసుకుంటారుగా ! మా రిసెప్షన్



హోమ్ ప్రొద్దుటే ఎనిమిది గంటలకు తెరుస్తాం. సరాసరి అక్కడికే పంపించండి.

ఇన్‌స్పెక్టర్ : సరేనమ్మా (గోపీతో) పదరా, వెధవా...

గోపీ : (ఏడుస్తూ లింగయ్య దగ్గిరకి వెళ్లి చెయ్యి పట్టుకుని) నన్ను తీసుకుపోతరంట, వద్దని సెప్పయ్యా.

లింగయ్య : (కటువుగా) పోరా, దొంగవెధవ!—

గోపీ . (ఇంకా ఏడుస్తూ) నేను దొంగను కాను... నమ్మయ్యా, నా మాట నమ్మవూ...

[లింగయ్య ఒక్క క్షణం కొడుకుకేసి చూస్తాడు. కళ్ళు చెమ్మగిల్లుతాయి. కొంచెం సంకోచిస్తాడు. కాని మరుక్షణంలోనే మనసు రాయి చేసుకుని చెయ్యి విదిలించేస్తాడు.]

ఇన్‌స్పెక్టర్ : (గోపీ చెయ్యి పట్టుకుని) ఇక వాళ్లే, పద.

గోపీ : (హఠాత్తుగా చెయ్యి విదిలించుకుని భాస్కర్ దగ్గిరకి పరుగెత్తుకుపోతాడు) అయ్యా అయ్యా, ఇంకెప్పుడూ గాలిపటాల జోలికి పోనండి. మీరు సెప్పినట్లే ఇంటానండీ. నా అన్నగూడ సచ్చిపోయిండు. నాకింకెవ్వరూ లేరయ్యా — అమ్మ సెప్పినట్లే యింటాను.

భాస్కర్ · వద్దు గోపీ, వద్దు ! ఈ ఇంట్లో నీలాంటివాళ్లకి స్థానంలేదు. దీనికన్నా ఆ బైటే నయం వెళ్లు. అక్కడికే వెళ్లు. ఇన్‌స్పెక్టరు గారూ, వీడిని తీసికెళ్లండి, నా మనస్సు బాగాలేదు రిపోర్టు వ్రాసి తర్వాత పంపిస్తాను.

వాణి గోపీ నీకేం ఫరవాలేదు. ఇన్‌స్పెక్టరు గారితో వెళ్లు. నేను నీకన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేయిస్తానులే.

గోపీ . (వెక్కి వెక్కి ఏడుస్తూ సుమతి దగ్గిరకి పరిగెత్తుకుంటూ వెళ్లి) అమ్మా ! అమ్మా ! (సుమతి ఒకటి రెండు క్షణాలు శూన్యంగా చూస్తుంది. ఏదో దివ్యమైన అనుభూతి పొంది నట్లు కళ్లు మెరుస్తాయి)

సుమతి . (దృఢంగా) ఆగండి ! గోపీని తీసుకు వెళ్లడానికి వీల్లేదు.

వాణి : అదేమిటి సుమతీ? వాడు దొంగ. వాడి కెటువంటి శిక్షపడాలో కోర్టు నిర్ణయించాలి.

సుమతి : (కోపంగా) వీల్లేదు ! మా రాజా— మా బంగారు రాజాకి దొంగతనం చెయ్యవలసిన గతి ఏం పట్టింది ? ఆ లాకెట్టు నేనే వాడికి ఇచ్చాను. వాడి వస్తువు వాడు ఏమైనా చేసుకుంటాడు. మధ్యలో మీరంతా ఎవరు ?

భాస్కర్ : కొంచెం నిదానించు, సుమతీ.

సుమతి . మీరు ఊరుకుందురూ, నేను చెప్తున్నానుగా ! ఆ లాకెట్టు వాడిదే ! ఈ వస్తువు లన్నీ నీవేరా అని నేను వాడికి చెప్పాను.

ఇన్‌స్పెక్టర్ : ఏమిటో, అంతా అయోమయంగా వుంది. డాక్టరుగారూ, గోపీ దొంగతనం చేశాడని మీరేగా రిపోర్టు చేశారు ? మరిప్పుడు కథ ఇలా అడ్డం తిరిగిందేం ? ముందా పిల్లవాడిని మా కప్పగించండి.

రామయ్య : ఇన్‌స్పెక్టరుగారూ —

ఇన్‌స్పెక్టర్ : ఏమిటయ్యా ? పానకంలో పుడకలాగా నీవొకడివి ?

రామయ్య : కాస్త అటు చూస్తారా ?

ఇన్‌స్పెక్టర్ : అటంటే ...

రామయ్య : అదేనండీ, ఆ ఫొటోకేసి చూడండి ... బాగా చూశారా ! మరి గోపీని చూడండి. ఇద్దరూ ఒకటికదూ.

ఇన్‌స్పెక్టర్ : (ఆశ్చర్యంగా) అరే ! ఒకటిగానే వున్నారే ! డాక్టరుగారూ, ఈ ఫొటోలో అబ్బాయి—

భాస్కర్ . మా అబ్బాయండీ.

ఇన్‌స్పెక్టర్ : మరి ఈ అబ్బాయి.

సుమతి · (తొందరగా అందుకుని) మా అబ్బాయేనండీ ! మా రాజా !

ఇన్‌స్పెక్టర్ : అంతా గందరగోళంగా వుంది. ఇంతకీ ఈ అబ్బాయి మీవాడని రాసిస్తారా ?

సుమతి : (భాస్కర్‌తో) ఏమండీ ..

భాస్కర్ ఇన్‌స్పెక్టరుగారు అడిగేది ముందు తేల్చి చెప్పు. పోలీసులతో వ్యవహారం. లేనిపోని చిక్కులు వస్తాయి.

సుమతి : (అపూర్వమైన ఆనందంతో) ఇన్‌స్పెక్టరుగారూ, ఈ అబ్బాయి మా అబ్బాయే నండీ. కావాలంటే కాగితంమీద వ్రాసియిస్తాం అది చాలుకదా? (గోపీని దగ్గిరకి తీసుకుని) రా, బాబూ నీకేం భయం లేదులే నే నున్నానుగా ! . నిన్నెవ్వరూ తీసికెళ్లరులే ..

భాస్కర్ : క్షమించండి, ఇన్‌స్పెక్టరుగారూ. మీకు చాలా శ్రమ యిచ్చాం మీ ఉపకారం ఎన్నడూ మరువలేం. (సుమతికేసి ఆనందంగా చూస్తూ) మీకు తెలియకపోవచ్చు — ఇకెన్నటికీ దొరకదనుకొనినది మా కివాళ మళ్ళీ దొరికింది అదే చాలు...

ఇన్‌స్పెక్టర్ : ఏమి పోయింది ? ఏమి దొరికింది ? లాకెట్టేగా... (భాస్కర్ కాదన్నట్లు తల వూపుతాడు.). ఏమో. నాకేమీ తెలియడంలేదు మరి వెళ్తాను. (పరధ్యాన్నంగా వంటింటి వైపు పోబోతాడు.) బోలెడు పనులున్నాయి.

రామయ్య : (కొంచెం చిలిపిగా) ఇన్‌స్పెక్టరు గారూ ఇటుకాదండీ... అటు.

ఇన్‌స్పెక్టర్ : అరే ! అంతా అయోమయంగా వుంది !... (బయటికి వెళ్లిపోతాడు.)

లింగయ్య : (సుమతితో) అమ్మగారూ...నాకు బాగా బుద్ధి చెప్పారు. ఇన్నాళ్ళకి నా కళ్ళు తెరిపించారు. పిల్లల్ని కన్నానేగాని వాళ్లకి తండ్రిని కాలేక పోయాను... గోపీ మీ బిడ్డే... (కళ్ళు తుడుచుకుంటూ, గిరుక్కున తిరిగి వెళ్లిపోతాడు.)

వాణి : నేనూ వెళ్తాను భాస్కర్.

సుమతి : ఈ పూట ఇక్కడే భోంచేసి వెళ్ల కూడదూ...

వాణి · ఈ గొడవలోపడి మరిచిపోయాను మా కల్చరల్ ప్రోగ్రామ్ సగం అయిపోయుంటుంది అసలే కనబడకపోతే గొడవచేస్తారు... ఇప్పుడు బయలుదేరితే జన గణ మణ కన్నా చేరుకోవచ్చు. వస్తా... (వెళ్లిపోతుంది.)

సుమతి . (గోపీని దగ్గిరకి తీసుకుని) గోపీ— ఇన్ని గాలిపటాలు కొన్నావుగా. . మనం అందరమూ కలిసి ఎగరేద్దామా ఇంకాపూర్తిగాచీకటిపడలేదు

గోపీ · (ఎగిరి గంతేసి) ఓ ! అంతకంటేనా ! కాని, నేను పతంగు వేస్తే చక్రీ ఎవరు పట్టుకుంటారు ? (భాస్కర్ రామయ్యా నవ్వుతారు)


సుమతి : వాళ్లూ వస్తారులే ... లేకపోతే, నేను పట్టుకొంటాను సరేనా ! . పద (భాస్కర్‌తో) రండీ . పిల్లవాడు సరదాపడుతున్నాడు (గోపీ, భాస్కర్, సుమతి నెమ్మదిగా బయటికి వెళ్తారు. టెలిఫోను మోగుతుంది.)

రామయ్య : (టెలిఫోను తీసుకుని) డాక్టరుగారాండీ ! ఇప్పుడే బయటకి వెళ్లారండీ. అమ్మగారు కూడా ... (నవ్వుతూ) గాలిపటాలెగరేయటానికండీ. (టెలిఫోను పెట్టేసి) శ్రీరామచంద్రా ! మా ఇంట్లో మళ్లీ దీపం వెలిగించావు తండ్రీ ! ...

(నెమ్మదిగా తెర పడుతుంటే నేపథ్యంలో సంగీతం)

గాలిపటం గాలిపటం
జీవితమే ఒక గాలిపటం !
గాలీ దారం వున్నవాడు అది
గగనసీమనే ఏలునురా
లేనివాడు ఒక గమ్యంలేక
ముళ్లపొదలలో కూలునురా
గాలిపటం గాలిపటం !
నేటి బాలురే రేపటి పౌరులు
చూపండి వారికి సరైన త్రోవలు
ప్రతి పాపడిలో పరంధాముని
చూచిననాడే పర్వదినం
గాలిపటం గాలిపటం
జీవితమే ఒక గాలిపటం !

[పూర్తిగా తెర] (అయిపోయింది)



...ని కొమ్మూరి వేణుగోపాలరావు ... సినిమాకు పనికివచ్చే అన్ని అంశాలు ... ఈ నవలను దేవీ ప్రియదర్శిని పిక్చర్స్ ...గా నిర్మిస్తున్నారు.

...భారతి'గా శారద నటిస్తున్న యీ చిత్రానికి గోపీ మాటలను, చక్రవర్తి సంగీతాన్ని, బి. ఎస్. కృష్ణ కళను, శేఖర్–సింగ్ ఛాయను, పి. వి. నారాయణ కూర్పును చేపట్టారు. ఈ చిత్రానికి సినిమా అనుకరణ వ్రాసి, దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు, లక్ష్మీదీపక్. ఈ చిత్రంలో కృష్ణంరాజు, భారతి, నాగభూషణం, రాజబాబు, పద్మనాభం, అల్లు రామలింగయ్య, రమాప్రభ, నిర్మల, బేబిరోహిణి ప్రధాన తారాగణం.

సినిమా

తులాభారం

రమణచిత్ర నిర్మిస్తున్న "తులాభారం" షూటింగు దాదాపు పూర్తయినట్టు, చలం ద్వారా తెలుసుకొన్నాను. గతమాసం ఊటీలో పక్షంరోజులు మకాంపెట్టి, నాలుగు పాటలను చిత్రీకరించినట్టు ఆయన చెప్పారు. ఆయన పబ్లిక్ ప్రాసిక్యూటరు పాత్రను పోషిస్తున్నట్టు తెలుసుకొన్నాను. 'ఊర్వశి' ఆయన ప్రేయసిగా నటిస్తున్నది. ముఖ్య పాత్రలను కాంతారావు, పద్మనాభం, నిర్మల, రమాప్రభ, శాంతకుమారి, సాక్షిరంగారావు పోషిస్తున్నారు. రాజశ్రీ రచనా రమణీయత, సత్యం సంగీత స్వారస్యత గొన్న "తులాభారం" చిత్రానికి మధు ఛాయను, అంకిరెడ్డి కూర్పును, సోమనాథ్ కళను చేపట్టారు. 'బుల్లెమ్మ–బుల్లోడు' తరువాత, నాగాంజనేయులు దర్శకత్వం నెరపుతున్న చిత్రం యిది.

"తులాభారం అనేసరికి సత్యాకృష్ణుల కథ అనుకునేరు. ఇదొక బరువైన, బలీయమైన చిక్కటి కథ. రెండు నిండుజీవులకు సంబంధించిన ప్రేమ కథ. ఒక చక్కటి సందేశాన్ని అందించే కథ" అని రచయిత రాజశ్రీ ద్వారా తెలుసుకొన్నాను.



రాజశ్రీ రచన !

"అభిమానవంతులు, కన్నవారికలలు, జీవితరంగము" చిత్రాలకు రాజశ్రీ రచయితగా ఎంత కృషిచేశారో, పాఠకులకు తెలియదా ? ఆయన ప్రస్తుతం ఎన్ని చిత్రాలకు పనిచేస్తున్నారో తెలుసుకొన్నాను.

"శ్రీ రమణచిత్ర వారి తులాభారం, శోభన్ ప్రొడక్షన్స్‌వారి కొత్తచిత్రం, జెమినీ వారి తరువాతి చిత్రం, నవచిత్రవారి ద్వితీయ చిత్రం, కన్నడ నిర్మాత వాదిరాజా తెలుగులో నిర్మిస్తున్న 'సీత' చిత్రం, రమణ చిత్రవారి మరొక సంచలన చిత్రం."

మధు పిక్చర్స్‌లో శోభన్ !

కొన్నేండ్ల తరువాత, మధు పిక్చర్స్‌లో శోభన్‌బాబు కథానాయకుడిగా నటించబోతున్నారు. లోగడ ఒక చిత్రంలో ఆయన నటించారు. ఆ చిత్రం పేరు "మంచిమిత్రులు."

మధు పిక్చర్స్ నిర్మించిన ఆరు చిత్రాలు ఆంధ్రుల అభిమానాన్ని చూరగొన్నాయి. ఇప్పుడు ఏడవ చిత్రం నిర్మితమవుతూవుంది. కృష్ణంరాజు, రంగారావు, గుమ్మడి, ప్రమీల, రోజారమణి, చంద్రమోహన్, ఆర్. వరలక్ష్మి ప్రధాన పాత్రధారులు. లక్ష్మీదీపక్ దర్శకుడు. మధు పిక్చర్స్‌కి పి. మల్లికార్జునరావు అధినేత.

మంచి మనుష్యులు

జగపతి పిక్చర్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో

"పండంటి సంసారం"లో శ్రీధర్, భారతి

సినిమా

నిర్మిస్తున్న చిత్రం. ఈ చిత్రానికి ఆత్రేయ మాటలు, పాటలు వ్రాస్తున్నారు. కథ, సినిమా అనుకరణ, దర్శకత్వంను వి. బి. రాజేంద్రప్రసాద్ చేపట్టారు. ఛాయను వెంకటరత్నం, కళను కృష్ణారావు, కూర్పును సంజీవి నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి ఇరవైన షూటింగు ఆరంభం.

శోభన్—మంజుల

"మంచిమనుషులు" చిత్రంలో శోభన్ బాబు, మంజుల ప్రధాన జంటగా నటిస్తున్నారు. ఈ జంట కలిసి నటిస్తున్న మొదటి చిత్రం కూడా యిదే. ఈ చిత్రంలో స్కేటింగు దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా వుండడంకోసం నాయికా నాయకులు ప్రతి రోజూరెండుగంటలసేపు ప్రాక్టీసుచేస్తున్నారు.

జగపతి సంస్థ నిర్మించిన అన్ని చిత్రాలలో నాగేశ్వరరావు కథానాయకుడు ("అన్నపూర్ణ"లో జగ్గయ్య). ఈ సంస్థలో శోభన్ అడుగు పెట్టడం ఈ చిత్రంతోనే. అన్నపూర్ణా రిలీజ్.

జగపతి సంస్థ ద్వారా నిర్మితమయ్యే నాలుగు చిత్రాలు అన్నపూర్ణా ఫిలింస్ ద్వారా విడుదలవు తాయి అన్న విషయాన్ని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. సంవత్సరానికి రెండు చిత్రాలు జగపతి ద్వారా వస్తాయి అనికూడా ఆయనచెప్పారు.

మనసున్న మనిషి

"మంచి మనుషులు" చిత్రానికి ఉపక్రమించిన వి.బి. రాజేంద్రప్రసాద్‌ను మనసున్న మనిషి అనడానికి ఆనందిస్తున్నాను.

జగపతి సంస్థలో పనిచేసే వాళ్లందరికీ మంచి జరగాలి అన్న తలంపు రాజేంద్ర ప్రసాద్‌కు వచ్చింది. వాళ్ళకోసం ఒక చిత్రాన్ని నిర్మించి, తద్వారా వచ్చే లాభాలను వాళ్లకే యివ్వడానికి ఆయన నిశ్చయించారు. తన్ను నమ్ముకున్న పనివారల సంక్షేమం కోసం, యింత వుదారతను ప్రదర్శిస్తున్న యజమానిని మనసున్న మనిషి అనడం అతిశయోక్తా?

పెరుగుతున్న చిట్టిబాబు


"మరపురాని మనిషి" చిత్రంలో రాజబాబు కుమారుడిగా ఆయన తమ్ముడు చిట్టిబాబు నటించాడు. చిన్న వేషం వేసినా, మిన్నగానే చేశాడు చిరంజీవి చిట్టిబాబు. అతగాడికి డిమాండు పెరిగింది. "సౌభాగ్యవతి, బంగారు కలలు, రాధమ్మ పెళ్లి, ముగ్గురు అమ్మాయిలు, ఆడపిల్లల తండ్రి" చిత్రాలలో హాస్య భూమికలను ధరిస్తున్నట్టు అతడే చెప్పాడు.

రాజబాబు రష్యా ప్రయాణం !

సంవత్సరానికి మూడు పదుల చిత్రాలలో నటించే ఏకైక నటుడు రాజబాబు. అతడు తెరపై కనిపిస్తే చాలు, ప్రేక్షకులు నవ్వుల వర్షం కురిపిస్తున్నారు. హీరోలకు వున్న ప్రాబల్యం, ప్రాముఖ్యత రాజబాబుకు వుంది.

గత ఏడు అమెరికా వెళ్ళివచ్చాడు. ఈ ఏడు రష్యా వెళ్ళడానికి నిర్ణయించాడు. మేలో యీ ట్రిప్పు వుండగలదట. అందుకే ఆ నెలంతా డైరీలో ఏ కంపెనీకి చోటుయివ్వలేదట.







''జజ్బాత్''లో జయసుధ

''కహానీ కిస్మత్‌కీ''లో రేఖా



నాలుగు వేషాలలో రామకృష్ణ

''ప్రేమలు — పెళ్లిళ్లు'' చిత్రంలో అక్కినేని ప్రక్కన చిన్న వేషం వేసి, భేషుగ్గా చేశాడు అనిపించుకొన్నాడు రామకృష్ణ. అతడికి అన్నీ వున్నాయి, అదృష్టం తప్ప.

వీనస్ — మహీజా పిక్చర్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న ''యశోదా కృష్ణ'' చిత్రంలో రాముడిగా, కృష్ణుడిగా, శ్రీనివాసుడిగా, మహా విష్ణువుగా నాలుగు పాత్రలను పోషిస్తున్నట్టు యిటీవల కలిసినప్పుడు చెప్పాడు. మహీజా ప్రకాశరావు తయారు చేస్తున్న యీ చిత్రానికి సి. ఎస్. రావు దర్శకుడు. యశోదగా జమున తప్ప మరొకరు పనికిరారు అన్న నిజాన్ని ఎవరూ కాదనలేరు.

డజను చిత్రాల నాయిక

చలన చిత్ర జగత్తుకు వచ్చి, యిరవై రెండు ఏండ్లు అయినా, డిమాండు వున్న నటిగా విరాజిల్లుతున్న ఏకైక నటి జమున అంటే ఒప్పుకొంటారా ? ఇప్పటికీ ఆమెలో గ్లామరు తగ్గకపోవడంపట్ల కొందరికి అసూయ కలగవచ్చు. వయసు పెరిగినా, వర్చస్సు పెరగడానికి కారణం ఆమె నిర్మలమైన మనసన్నది నా అభిప్రాయం. ఆమెకు యిప్పుడు డజను చిత్రాలున్నాయి.

శారద ప్రతిభ


తెలుగు నటి శారదకు రెండుసార్లు 'ఊర్వశి' బిరుదు వచ్చింది. ''రాధమ్మ పెళ్లి'' చిత్రం రషస్ చూచిన తరువాత నాకు అనిపించింది. రెండుసార్లేమిటి ? ఎన్నిసార్లయినా ఆ బిరుదానికి శారద అర్హురాలవి. ఆమెలో ఎంత మహత్యం వున్నదో రాధమ్మ పెళ్లిలోని శారద పాత్ర చూస్తే తెలుస్తుంది.

తన జీవితం బజారుపాలు చేసిన మనుష్యలను అసహ్యించుకుంటూ, తను కన్నబిడ్డ జీవితమైనా సుఖసంతోషాలతో శోభిల్లాలి అని దేవుణ్ని కోరింది. తన కూతురికి అందమైనవాడు, ఆర్థికంగా పెరిగినవాడు భర్త అయ్యాడు. ఆమె మురిసిపోయింది.

తన కుమార్తె జీవితాన్ని కళ్లారా చూసింది. నెత్తీనోరూ కొట్టుకుంది. పిచ్చిగా కేకలుపెట్టింది. అమ్మవారి గుడికి వచ్చింది. ఆమెను ప్రశ్నలవర్షంతో తికమక పెట్టింది. ''నేను నిన్ను ఏ వరం కోరలేదే. నా కూతురికి మంచి జీవితాన్ని ప్రసాదించు అని మొరపెట్టుకొన్నానే. అదీ లేకుండా చేశావే. ఈ మనుష్యులమధ్య మంచివాళ్లు బ్రతకలేరా ? నీవే వచ్చి చూడమ్మా, నా కూతురు అనుభవిస్తున్న ఆనందాన్ని.'' అన్న ఘట్టంలో శారద నటన రాతిగుండెలను



''బంట్రోతు భార్య''లో చలం



కూడా కరిగించి, కన్నీరుకార్పించే విధంగా వుంది.

మన శారదలో యింత నటనా ప్రతిభ వుండబట్టే, మళయాళరంగం గుర్తించింది.

"రాధమ్మపెళ్లి" కథను తాతా—మనవడు కథకుడు వ్రాశారు. మాటలను సంసారం—సాగరం రచయిత రచించారు. సినిమా అను కరణము బంట్రోతుభార్య దర్శకుడు సమకూర్చారు. దర్శకత్వాన్ని దాసరి చేపట్టారు. ఈ చిత్రంలో కృష్ణ, రాజబాబు, సత్యనారాయణ, అల్లురామలింగయ్య, కొమ్మినేని, నిర్మల, పండరీబాయి, రమాప్రభ ప్రధాన పాత్రధారులు.

విఠలాచార్య జానపదం

జానపద చిత్రాలను అసమానంగా సృష్టించిన వ్యక్తి విఠలాచార్య. ఆయన త్వరలో ఒక జానపదాన్ని ప్రారంభిస్తారట. 'నటరత్న' రామారావు కాల్‌షీట్లు యిచ్చేలోగా కొత్త వాళ్లతో ఈ చిత్రాన్ని తీస్తారట.

"ముగ్గురు అమ్మాయిలు"లో
రేలంగి, జయసుధ, ప్రమీల

ఆయన కుమారుడు బి. వి. శ్రీనివాస్‌కి, తమిళరంగంలో మంచి పేరు వచ్చింది. 'పెన్నై నంబుంగల్' తరువాత మరొక చక్కటి కథను తమిళంలో నిర్మిస్తున్నారు, ప్రముఖ తారాగణంతో.

చలం సిద్ధాంతం !

"బుల్లెమ్మ—బుల్లోడు" తరువాత చలం చుట్టూ ఎంతమంది తిరిగారో కళ్లారా చూచిన నాకు తెలుసు. అప్పుడే అనుకుంటే, గతవారం జరిగిన ఒక సంఘటన నన్ను ఆశ్చర్యచకితుడ్ని చేసింది.

ఒక పెద్ద నిర్మాత వచ్చి, కథను వివరించి, అడ్వాన్సు యివ్వబోయారు. "వద్దు సార్. నాకు పాత్ర నచ్చలేదు. మరొకరిని పెట్టుకోండి" అని తిరిగి పంపాడు.

"తక్కువకాలంలో, ఎక్కువ చిత్రాలు అంగీకరించి త్వరగా దూరం గావడంకన్నా, తక్కువ చిత్రాలు చేసి, ఎక్కువరోజులు ప్రజలకు దగ్గరగా వుండాలన్న సిద్ధాంతాన్ని



ఢిల్లీలో అఖిలభారతస్థాయిలో జరిగిన నాటక పరిషత్ పోటీలలో సెంట్రల్ హైవవర్ కమిటీ వారు ప్రదర్శించిన రాచకొండ విశ్వనాథశాస్త్రి రచన "నిజం" నాటకంలో నటించి అఖిలభారత స్థాయి ఉత్తమ నటిగా బహుమతి పొందిన శ్రీమతి సరస్వతి (విశాఖపట్నం) - ఈపోటీలలో తొమ్మిది భాషలలో ఇరవై అయిదు నాటకాలు ప్రదర్శించబడ్డాయని తెలుస్తోంది.

సినిమా

ఆమలుపరచడానికి నిర్ణయించాను.

చిత్రం యితివృత్తమో లేక నా పాత్ర ఔచిత్యమో ఒక ఆదర్శంగాని, సందేశంగాని యివ్వగలిగితేనే నటుడిగా నాకు తృప్తి, ఆనందం.

అవార్డు కోసం ఎవరైనా చిత్రం నిర్మించడానికి పూనుకొంటే, డబ్బు తీసుకోకుండా నటిస్తాను. మానవ జీవితాన్ని యధాతధంగా చిత్రించే కధకోసం నేను అన్వేషిస్తున్నాను. అలాంటిది ఎవరైనా యిస్తే, రమణచిత్ర ఆ కథకు సినిమారూపం యివ్వడానికి సిద్దంగా వుంది.'' అన్నారు చలం.

అత్తగా జయంతి కోడలుగా విజయలలిత

నళినిశ్రీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ''నిత్య సుమంగళి'' చిత్రం సగంపైగా పూర్తయింది. ఈ చిత్రానికి బి. ఎన్. ఆర్. దర్శకుడు. ఈ చిత్రంలో అత్తా కోడళ్లుగా జయంతి, విజయలలిత నటిస్తున్నారు. ఒకే వయస్సులో వున్న వీళ్లిద్దరూ అత్తగా, కోడలుగా రావడానికి కారణం ఏమిటి అని దర్శకుడిని అడిగాను. అది చెపితే కథలోని థ్రిల్ పోతుంది అన్నారాయన. జయంతి భర్తగా నాగభూషణం, కృష్ణంరాజు భార్యగా విజయలలిత నటిస్తున్నారు. నాగభూషణం, కృష్ణంరాజు తండ్రీ, కొడుకులుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కధను ఆర్. కె. ధర్మరాజు యివ్వ, విజయరత్నం మాటలను సమకూర్చారు. ఎస్. రాజేశ్వరరావు సంగీత సారధి.

తులసి

రామవిజేతా ఫిలింస్ నిర్మిస్తున్న ''తులసి'' చిత్రం షూటింగు యిటీవల పక్షం రోజుల పాటు ఆంధ్రదేశంలో అవుట్‌డోర్ జరిగింది. దీంతో చాలావరకు పూర్తయింది అన్నారు, నిర్మాత కె. ఏ. ప్రభాకర్. కన్నడ కల్పన, తెలుగు భారతి నటిస్తున్న యీ చిత్రంలో జగ్గయ్య, కృష్ణంరాజు, గుమ్మడి, సావిత్రి, జి. వరలక్ష్మి, రావు గోపాలరావు ముఖ్య పాత్ర ధారులు. ఈ చిత్రానికి కె. బాబురావు దర్శకుడు.



''చైర్మన్ చలమయ్య''లో పద్మనాభం

''చక్రవాకం'' ప్రారంభం


సురేష్ మూవీస్ నిర్మిస్తున్న మరొక నవలా (ఈస్ట్‌మన్ కలర్) చిత్రం ''చక్రవాకం'' షూటింగు ప్రారంభమైంది. ఈ నవలను పాఠకలోకం బాగా ఆదరించింది. 'ప్రేమనగర్' కన్నా మిన్నగా యీ చిత్రాన్ని రూపొందించడానికి, రామానాయుడు పూనుకొన్నారు. ఈ చిత్రానికి ఆచార్య ఆత్రేయ, మహదేవన్, మార్కస్ బారట్లే, కృష్ణారావు, మార్తాండ్ లాంటి వుద్దండులు తమ శక్తిని ధారపోస్తున్నారు. దర్శకత్వాన్ని విక్టరీ. మధుసూదనరావు చేపట్టారు.

''వాణిశ్రీ, చంద్రకళ''

శోభన్‌బాబు నాయకుడిగా నటిస్తున్న యీ చిత్రంలో వాణిశ్రీ, చంద్రకళ, నాగభూషణం, అల్లు రామలింగయ్య, రాజసులోచన, కృష్ణకుమారి ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు.

''శాంతినికేతన్''

సురేష్ బ్యానర్‌లో ప్రారంభమయ్యే మరొక నవలా చిత్రం ''శాంతినికేతన్'' కి మాటలను సమకూర్చే బాధ్యతను మోదుకూరి జాన్సన్‌కి అప్పగించారు, నిర్మాత రామానాయుడు. దర్శకత్వం కె. బాపయ్య.



''గాలిపటాలు''లో కృష్ణ, శ్రీవిద్య

సినిమా

''గౌరి''గా జమున !

శ్రీ వాణి ఆర్ట్స్ కంబైన్స్ నిర్మించిన ''గౌరి'' చిత్రం మూగ మనసులు బాణీలో వున్నట్లు వార్తలొస్తున్నాయి ఈ చిత్రంలో కథానాయిక గెటప్ చూసినప్పుడు, నాకు మూగ మనసులు గౌరి గుర్తుకొచ్చింది అనాటి చురుకుదనం, చలాకీతనం ఆమెలో యిప్పటికీ హుషారుగా వుండడమే సుబ్బరాజు వ్రాసిన గౌరి పాత్రకు ప్రాణం పోసింది ఆమె మనసును దోచుకొన్న ప్రేమికుడిగా కృష్ణ నటించారు చెడును చేసే దుష్టత్రయంగా సత్యనారాయణ, రావు గోపాలరావు, అల్లు రామలింగయ్య నటించారు సహాయ పాత్రలను రాజబాబు, రమాప్రభ, శుభ పోషించారు

''గౌరి'' కథను నిర్మాత సృష్టించ, ఆ కథకు మహారథి మాటలను సమకూర్చ, సినిమా అనుకరణను పి సి. రెడ్డి చెయ్య, సంగీతాన్ని సత్యం, కూర్పును మహేష్, కళను చలం, ఛాయను రామచవుదరి చేపట్ట, పి. చంద్రశేఖరరెడ్డి గౌరిని ఒక బాక్సాఫీస్ చిత్రంగా రూపొందించారు అని విశ్వసనీయంగా తెలిసింది ఇది సుబ్బరాజు నిర్మిస్తున్న మూడవ చిత్రం తను తలపెట్టిన తరువాతి చిత్రానికి 'పుట్టింటి గౌరవం' అని పేరు పెట్టారు

విజయలక్ష్మి మూవీస్ !

'ఆడజన్మ, అమ్మమాట'-చిత్రాలను నిర్మించి, కొన్ని పాత చిత్రాలను కొని పంపిణీ సంస్థను స్థాపించి, మళ్లీ చిత్ర నిర్మాణానికి పూనుకొన్న జి. వి. ఎస్ రాజుకు, నేటి మేటి దర్శకుడిగా కీర్తింపబడుతున్న విశ్వనాథ్‌తో సినిమా తీయాలన్న తలంపు అమ్మమాట నిర్మాణపు రోజులనుండి వుండేది ఆయన అనుకొన్న ప్లాను యిప్పటికి ఈడేరింది

చలం నాయకత్వం !

కథను కూడా, కాశీనాథుని విశ్వనాథ్ వ్రాశారు ఈ కథకు నాయకుడిగా చలం ఎన్నుకోబడ్డారు ఆయనకు జంటగా భారతి నటిస్తున్నది. ఈ చిత్రానికి డి. వి నరస రాజు మాటలను, కె. వి. మహదేవన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రధాన పాత్రలను జయంతి, శుభ, కె విజయ, మమత, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య పోషిస్తున్నారు ఈ చిత్రానికి కె విశ్వనాథ్ దర్శకుడు

ఎందరో వస్తున్నారు !

కాశీనాథుని విశ్వనాథ్ 'ఫూ' అంటే చాలు, ఆయనకు అడ్వాన్సులు యివ్వడానికి ఎందరో నిర్మాతలు సిద్ధంగా వున్నారు. కానీ, ఆయన అందరికీ అలా 'ఎస్, ప్రొసీడ్' అని చెప్పే మనిషికారే నిర్మాతల పెదవులపై నవ్వు నాట్యమాడాలి అని భావించే మనిషి

లత ధరిస్తున్న మంచిపాత్ర

మనోరంజనీ పిక్చర్స్‌వారి ''భారతి'' చిత్రం షూటింగు శరవేగాన సాగిపోతూవుంది ఎవర్‌గ్రీన్ హీరోయిన్ జమున సాత్వికమైన పాత్రను ఈ చిత్రంలో పోషిస్తున్నది అడుగడుగునా కష్టాలను ఎదుర్కొనే భారతిగా ఆమె నటిస్తున్నది ఈ చిత్రంలో మరొక నాయికగా లత నటిస్తున్నది ఇంతవరకు ఆమె ధరించిన పాత్ర లన్నిటికన్నా మంచిదట 'భారతి'లో ఆమె పాత్ర

జీవితంలో సరదాగా, కులాసాగా వుండడమే ఆమె అభిమతం. ఆమెను ఒక వంచకుడు నమ్మించి, ప్రేమ మాటలు వల్లించి, శీలాన్ని అపహరించి అనాధగా వదిలివెళ్లాడు అతడికోసం గాలించింది వేచిచూచింది అతడి నామస్మరణంతో పిచ్చిపట్టింది ఎవరెన్ని ఆశలు చూపినా, నమ్ముకొన్నవాడినే నాథుడిగా ఎంచి, అతడికోసమే ప్రాణత్యాగం చేసిన పవిత్రురాలిగా లత నటిస్తున్నది ఆమెను మోసగించిన మనోనాథుడిగా సత్యనారాయణ నటిస్తున్నారు. 'భారతి' కథను వీటూరి, మాటలను వీటూరి, దర్శకత్వాన్ని వీటూరి చేపట్టారు. ముఖ్యపాత్రలను ఎస్వీరంగారావు, పద్మనాభం, రమాప్రభ, చంద్రమోహన్ పోషిస్తున్నారు. కథానాయకుడిగా కృష్ణంరాజు నటిస్తున్న ఈ చిత్రాన్నికె వెంకటమునిరెడ్డి నిర్మిస్తున్నారు విజయా విడుదల

భూమికోసం

అనుపమ చిత్ర నిర్మిస్తున్న కొత్తతరహా చిత్రం ఇది మామూలు కథ కాదు. సంచలనాన్ని సృష్టించగల అంశాలు వున్న అసాధారణమైన కథ. అనుపమ పూర్వ వైభవాన్ని యినుమడింపచేసే అసమానమైన కథ ఈ చిత్రానికి దర్శకుడు కె బి తిలక్ ఆయనే కథకుడు చాలా ఏండ్ల తరువాత తిలక్ తెలుగు చిత్రాన్ని చేపట్టడం జరిగింది అనేక వ్యయప్రయాసల కోర్చి, ఆంధ్ర దేశంలోని మారుమూల గ్రామాలకు వెళ్లి, సహజత్వం కోసం మూడు వంతుల చిత్రాన్ని అక్కడే పూర్తి చేస్తున్నారు, తిలక్.

''భూమికోసం'' చిత్రానికి శంకర మాటలను, పెండ్యాల సంగీతాన్ని, రామకృష్ణ ఛాయాగ్రహణాన్ని, మూరన్న కళను, దేవేంద్ర కూర్పును నిర్వహిస్తున్నారు ప్రధాన పాత్రలను చలం, కొత్త నటి ప్రభ, జగ్గయ్య, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, రమణారెడ్డి, త్యాగరాజు, కె విజయ, మమత, తారాకృష్ణ, కె కె శర్మ, రాళ్లబండి, ఆచంట వెంకటరత్నం మరియు పెండ్యాల పోషిస్తున్నారు కథానాయికగా జమున నటిస్తున్నది ఈ చిత్రంలో ప్రకృతి రామణీయకతకు ఎక్కువ ప్రాధాన్యత యివ్వబడింది

అనుపమ సంస్థ అందించే అపురూపమైన చిత్రమే ''భూమికోసం''



''ఆడపిల్లల తండ్రి''లో కృష్ణంరాజు, భారతి

దొరబాబును వలచిన వన్నెలాడి

అందమైనవాడు, వుంగిరాల జుట్టువాడు, కళ్ళతో కామించగలవాడు, డబ్బును వెదజల్లేవాడు ''దొరబాబు'' అతగాడిని తన వలపు చూపులతో వశపరచుకోవడానికి విశ్వప్రయత్నం చేసింది, ఒక వన్నెల విసనకర్ర కన్నుగీటింది, పడకటింటికి దారి చూపింది తనకు స్వర్గాన్ని చూపించమని ప్రాధేయపడింది ఎలాగో తెలుసా ?

''రారా పడకింటికీ, నిదుర
రాదు నా కంటికీ
తగిన మందివ్వరా, రగిలే నా వొంటికీ''

అంటూ దొరబాబును కవ్వించింది. అతడు వూరుకొన్నాడా ? లేదే మరేంచేశాడు

''ఎందుకు పడకింటికీ
పోదాములే పొదరింటికీ
తగిన మందుందిలే, రగిలే నీ వొంటికీ''

అంటూ ఆమెను వోదార్చాడు ''కట్'' అన్నారు దర్శకుడు తాతినేని రామారావు ఈ వలపు పాట+ఆటను ఆడినది నాగేశ్వరరావు, విజయశ్రీ ఈ దృశ్యం ఫణి మాధవీ కంబైన్స్‌వారి ''దొరబాబు'' ఈస్ట్మన్ కలర్ చిత్రంలో కనిపిస్తుంది ఈ చిత్రాన్ని రాజేంద్రప్రసాద్, సుబ్బారావు నిర్మిస్తున్నారు మంజుల కథానాయకుని వలపురాణిగా, చంద్రకళ కథానాయకుని అనుంగు చెల్లెలుగా నటిస్తున్నారు

వాసు చేసినమార్పు

ప్రముఖ దర్శకుడు ప్రత్యగాత్మ కుమారుడు చిరంజీవి వాసు ''ఆడపిల్లల తండ్రి'' పేరిట నిర్మిస్తున్న చిత్రంలో ఒక తమాషా జరిగింది నాగభూషణానికి అసిస్టెంటుగా అల్లు రామలింగయ్యను చూడడం మనకు పరిపాటి. వాసు తన చిత్రంలో అల్లుచేత బాస్ వేషం వేయించి, అతని దగ్గర గుమాస్తాగా నాగభూషణంచేత చేయిస్తున్నారు



''ఇంతే జార్''లో రింకూ జైస్వాల్, రాకేష్ పాండే

గుడ్డివాని పాత్రలో రంగారావు

అనిల్ ఆర్ట్స్ నిర్మించిన ''గాలిపటాలు'' చిత్రంలో ఎస్వీరంగారావు ద్విపాత్రాభినయం చేశారు అందులో ఒకటి గుడ్డివాని పాత్ర జీవిత వేదాంతాన్ని పూసగ్రుచ్చినట్లు వివరించే మంచివాడి పాత్ర అది ఈ చిత్రానికి తాతినేని ప్రకాశరావు కథకుడు+దర్శకుడు

—శ్రీనివాస్ ●

పేయింగ్ గెస్ట్

పెద్ద కథ

(గత వంచిక తరువాయి)

"అబ్బాయ్!" సుభద్రమ్మ పిలుపుకు లేచాడు సత్యం.

"భోజనానికి రాకూడదూ!" అందామె లోప లికి వస్తూ.

"అలాగే నండి!" అంటూ లేచి నిలబడ్డ సత్యం మొహంలోకి చూస్తూ, "నేను పిలిచేవరకు భోజనంచేయాలని, ఆకలివేస్తోందని తెలియదేమిటి బాబూ?" అంది.

జవాబుగా నవ్వాడు సత్యం.

ప్రతిరోజు సుభద్రమ్మ భోజనానికి పిలిచేవరకు వెళ్లడు సత్యం ఈ విషయంలో సుభద్రమ్మ చాలా సార్లు హెచ్చరించింది. "నేనేదో పనోల్లో వుంటాను ఆకలివేసినపుడు అడగక కడుపు మాడ్చుకుంటావా బాబూ" అంటూ. అన్ని ప్రశ్నలకు చిరునవ్వే సమా ధానం కావడంతో సత్యం తత్వం అర్థంకాలేదు సుభద్రమ్మకు చలపతి వచ్చినపుడుమాత్రం ఎంతో హుషారుగా మాట్లాడే సత్యం అంటే వకుళకు బోల్డంత కోపం వస్తుంది

ఆరాత్రి వకుళకు త్వరగా నిద్రరాలేదు చాలా సేపు ఆలోచిస్తూ గడిపింది.

మర్నాడు కాలేజీకి బయలుదేరుతుండగా సుభ ద్రమ్మ అడిగింది.

"అక్కయ్యకు ఉత్తరం సాయంత్రం నువ్వు రాస్తావా? లేక నేనే రాయించనా?" అని

"నేనే రాస్తాను." అంటూ కాలేజికి వెళ్లి పోయింది వకుళ

ఆరోజు కెమిస్ట్రి ప్రాక్టికల్స్. ఆలోచనలతో సతమతమైపోతున్న వకుళ, చీరమీద ఆసిడ్ పడడం గమనించలేదు ప్రక్కనే నిలబడ్డ సుజాత చెప్పే వరకు కూడా తన చీర కాలిపోయిందన్న విషయం గుర్తించలేదు ఎప్పుడూ ఎంతో హుషారుగా వుండే వకుళ అలా వుండటం అర్థంకాలేదు సుజాతకు

మధ్యాహ్నం యిక కాలేజిలో వుండలేక ఇంటికి బయలుదేరింది వకుళ

"మా యింటికి రాకూడదూ?" అంది తనూ బయలుదేరుతూ సుజాత

"పద" అంది వకుళ.

"మా యింటిమీదుగా వెడదాం సుజ్జీ! చీర మార్చుకొంటాను" అంది.

గబగబా చీర మార్చుకొని తల్లి పిలుస్తున్నా వినకుండా సుజాతతో బయలుదేరింది వకుళ.

"మీ గెస్ట్‌గారేరి?" అంది సుజాత అప్పు డప్పుడు వకుళ సత్యం గురించి చెప్పడం గుర్తుకు తెచ్చుకుంటూ.

"తాళం వుందిగా. .అయినా ఆ గదికి తాళం వున్నా, లేకున్నా, ఒకటే పద" అంది వకుళ కసిగా. సుజాత క్షణంసేపు వకుళ మొహంలోకి చూసి తల పంకించింది.

సుజాతా వాళ్లింట్లో తీరిగ్గా కూర్చున్నాక, "ఊఁ. ఇప్పుడు చెప్పు" అంది సుజాత ఏదో ఆలో చిస్తున్న వకుళతో.

"ఏమిటి?"

"ఏదో చెబుతానన్నావుగా!" అంది.

"ఏం చెబుతానన్నానూ?" అంది వకుళ.

"అనలేదులే ... కాని చెప్పాలని వుంది. స్నేహితురాలివని ఓ ప్రక్క చెప్పాలనున్నా, మరో ప్రక్క సంశయిస్తున్నావ్!"

"ఏమిటి?"

"అదే...కాలేజీలో నీ ధోరణి . చిరాకు . ఈ ఆలోచన ... సీరియస్ మొహం." అంటూ వకుళ మొహంలోకి చూస్తూ, "దీని భావమేమి వకుళా దేవీ?" అంది.

"గురువు ఎక్కువైంది."

"ఓ...చందస్సు మీ గెస్ట్‌గారు నేర్పారా" అంది నవ్వుతూ సత్యం అస్తమానం కావ్యాలు చదు వుతూ కూర్చుంటాడని వకుళ చెప్పడం గుర్తుకు తెచ్చుకుంటూ.

"ప్చ్ . నేర్పినా బావుండిపోను అంత అదృష్టమా?"

"ఏం? మూగి అన్నావేకాని ... మొద్దు కూడానా?"

"ఆ రెండు కాదు. వొర్త్ . ప్రవరాఖ్యుడు. ప్రబంధాలు చదివి..."

"నువ్వు వరూధినివి కావుకదా!" అంది వకుళ మాటలను మధ్యలో ఆపేస్తూ సుజాత నవ్వుతూ

"ఛ.. ఊరుకో సుజా! నీకంతా వేళాకోళంగా వుంటుంది."

"లేదే వకుళా! సీరియస్‌గా అడుగుతున్నా!"

"ఏమిటి? నేను వరూధిననా? నేను వరూధినినైనా . అతను ప్రవరాఖ్యుడి పెద్దన్నయ్య ఆ ప్రవరాఖ్యుడు వరూధినిని చూస్తూనే పలక రించాడు. ఇతను నేను పలకరించినా పలకడు" అంది.

"అయితే తమరి బాధ అంతా అందుకేనా?" అంది సుజాత చిలిపిగా చూస్తూ.

"సుజా! అసలు విషయం తెలుసుకోకుండా నువ్విలా ఆటపట్టిస్తూ..."

"ఓహ్ . . లేదులేవే. ఇక చెప్పు బుద్ధిగా వింటాను." అంది సుజాత

"నాకు బావ వున్నాడని. అత్తయ్య, నాన్నగారు నా చిన్నప్పుడెప్పుడో మా పెళ్లి గురించి అనుకున్నా రని నీతో చెప్పాను."

"ఊఁ.. సారి వకుళా! మీ బావ విషయం మర్చిపోయి మీ గెస్టుగారి గురించి ఏమిటో అన్నాను." అంది సుజాత నొచ్చుకుంటూ

"ఊఁ.." అంటూ మూల్గింది వకుళ సుజాత తన బాధ అసలు అర్థం చేసుకోవటంలేదని.

"అవునూ, గత సంవత్సరం వచ్చి పెళ్లి చేయ మంటూ మీ అత్తయ్య గోల పెట్టిందని చెప్పావు మళ్ళీ"

"ఊఁ ఇప్పుడు గొడవంతా అక్కడే నేను బి యస్‌సి. లో చేరేముందు అత్తయ్య ససేమిరా యిక చదువక్కర్లేదంది. నేను మొండికేసి ఏడ్వ డంతో, బావ యింకా నిరుద్యోగిగా వుండటంవల్ల పెళ్లి వాయిదాపడి, నా చదువు యింతవరకు సాగింది ఆ మధ్య దీపావళి సెలవుల్లో చేసెయ్య మంటూ, మళ్ళీ గోలపెట్టింది అత్తయ్య అక్కయ్య, బావ కలిసి పరీక్షలు అయిపోయేవరకు ఆగమంటూ, ఆవిడ్ని ఒప్పించారు"

"ఇంతకీ యిప్పుడేం జరిగిందని?"

"అత్తయ్యకు వొంట్లో బావులేదని, తనకు భోజనానికి ఇబ్బందిగా వుంటోందని పరీక్షలు కాగానే ముహూర్తాలు పెట్టించమని అత్తయ్య చెప్పగా బావ, అక్కయ్యకు ఉత్తరం రాశాడు"

"ఊఁ. మరింకేమిటి ఎలాగు పరీక్షలు మరో నెల రోజుల తరువాత ఎలాగు మొదలవుతాయి పరీ క్షలు అయిపోయాకా చేస్తే నీకేమిటి నష్టం?"

"కాని కాని... నేను బావను పెళ్లి చేసు కోను సుజా! అక్కయ్యకు, అమ్మకు ఇష్టమే కాని" వకుళ చటుక్కున తల వాల్చేసుకుంది కళ్ళలోనుండి నీళ్ళు టపటప రాలిపడటంతో సుజాత గాబరా పడిపోతూ,--

"నీకు యింతలో ఏమైంది వకుళా! ఇంతకు క్రితం నీకు ఇష్టమేగా! నువ్వు బి ఎస్‌సి లో చేరేముందు.."

"ఆఁ.. అప్పుడు నా కిష్టమే కాని" అంటూ చాలాసేపు మౌనంగా వుండి చివరికి అసలు విషయం చెప్పింది వకుళ విషయం వింటూనే నిర్ఘాంతపోయింది సుజాత

"వకుళా! ఎప్పుడు నీతో అంతగా మాట్లా డని, మూగిగా వుండే మీ పేయింగ్ గెస్ట్‌ని నువ్వు ప్రేమించడం ఏమిటే?" అంది ఆశ్చర్యపోతూ

సుజాత అనుమానానికి, వకుళ చెప్పిన జవాబు విని మరింత నిర్ఘాంతపోయింది సుజాత.

"అతను చాలా మంచివాడు. అందంగా వుంటాడు. అన్నిటికి మించి ఆ మూగితనంలో ఏదో ఆకర్షణ వుందిట."

ఆలేటి నాగమణి



పేయింగ్ గెస్ట్

"వకుళా! అమ్మతో నీ నిర్ణయం చెప్పే ముందు నువ్వు ప్రేమిస్తున్నానంటున్న ఆ పేయింగ్ గెస్టుకు నువ్వంటే ఇష్టమో కాదో తెలుసుకో! అతను నిన్ను ప్రేమిస్తున్నాడో లేదో, కనీసం యికముందైనా ప్రేమించగలడో లేదో తెలుసుకో. లేకపోతే రెంటికి చెడిన రేవడిలా అవుతావ్! అంతే కాదు — బావను కాదని, మీ గెస్ట్ కూడా నిన్ను కాదంటే, ఎంతో కష్టపడితేకాని, ఆడపిల్లలకు పెళ్లి చేయలేని ఈ రోజుల్లో మీ అక్కయ్య వేల కట్నం పోసి నీకు మరో సంబంధం తెచ్చి పెళ్లి చేయడం ఎంత కష్టమో ఆలోచించు. ఒక ఆడ పిల్లలా కాక, మగాడిలా మీకు అన్నయ్యలా మీ యింటికోసం పాటుపడే మీ అక్కయ్య పరిస్థితి నాకంటె నీకే బాగాతెలుసు. బాగా ఆలోచించు వకుళ."

"అతనెప్పుడు మాట్లాడడని, నీతో అసలు మాట్లాడడని, నాతో చెప్పావ్. అలాటప్పుడు, అతని మనసు తెలుసుకునే అవకాశం నీకు కలగలేదేమొ! అందుకే అమ్మతో నీ నిర్ణయం చెప్పేముందు, అతని మనసులోని మాటను తెలుసుకోవడం చాలా అవసరం. స్నేహితురాలిగా నీకీ సలహా యిస్తున్నాను. వకుళా! అతను మంచివాడు, అందగాడే కావచ్చు. కాని . మీ బావలా మేనరికం కాదు గాబట్టి కట్నం ఎంత అడుగుతాడో ఆలోచించుకో! మీ అక్కయ్య యివ్వగలదో లేదో యోచించు."

సుజాత మాటలకు అయోమయంగా చూసింది వకుళ.

"నిజంగా తాను సత్యాన్ని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలనే అనుకుంది. కాని. . సత్యం మనసేమిటో, అతని అభిప్రాయం ఏమిటో తెలియకుండానే, తెలుసుకోకుండానే ఆవేదనతో ఆరాటపడిపోయింది."

"వకుళా! ఏ స్థితిలోను, అతను కాదంటే — నువ్వు మీ బావని పెళ్లి చేసుకోవడమే, ఉత్తమం. చిన్నప్పుడెప్పుడో అనుకున్న మాటకోసం, అనుబంధాల బంధాలకు కట్టుబడి, మీ అత్తయ్యా, బావ యిన్నాళ్ళు వేచివున్నారంటే. . చూడు వాళ్ళను బాధపెట్టడం బావుండదు మీ గెస్ట్ కానప్పుడు ఎవరినైనా పెళ్లి చేసుకుంటావుకదూ! మీ బావె ఎందుకు కాకూడదూ?"

సుజాతవంక చూస్తూ వుండిపోయింది వకుళ.

"వకుళా! ఇది జీవిత సమస్య అతిగా ఆలోచించడం మంచిదే — కాని ఆ ఆలోచనలు నిన్ను భయపెట్టేలా, భయం పెంచేలా, వుండకుంటే మంచిది" అంది సుజాత, భుజం తడుతూ.

చీకటిపడుతూవుండగా యిల్లు చేరింది వకుళ. వరండా మెట్లెక్కుతుండగానే ఆమె కళ్ళు, అలవాటు ప్రకారం సత్యం గదివైపు తిరిగాయి. తలుపుకు తాళం వేలాడుతోంది

"నీ చదువేమిటోకాని చీరలన్నీ తగులబెడుతున్నావే!" అంది సుభద్రమ్మ.

''ఆసిడ్ పడిపోయిందమ్మా!''

''పడ్డది నీ చీరమీదకాదే వకుళా! వసుధ జీవితంమీద.'' మెల్లిగా గొణుక్కుంటూ కూర్చుండి పోయింది సుభద్రమ్మ. ఆవిడకు ఒక్కసారిగా పెద్ద కూతురు గుర్తుకు రావడంతో కళ్లు నీళ్లతో నిండాయి.

ఆ యింటి యజమాని, సుందర్రామయ్య స్కూల్ మేష్టారుగా పనిచేసేవాడు ఆయనకు వున్న ఆస్తి అంతా ఆ యిల్లుతోపాటు, ముచ్చటగా ముగ్గురమ్మాయిలు. ముగ్గురూ ఆడపిల్లలే పుట్టా రన్న బాధ ఆయనకంటె సుభద్రమ్మ నెక్కువగా బాధించింది. వకుళ పుట్టాక యిక పిల్లలు పుట్టలేదావిడకు.

పెద్ద అమ్మాయి వసుధ స్కూల్‌ఫైనల్ ప్యాసయ్యేసరికి, సుందర్రామయ్య ఆర్థిక పరిస్థితి అంతగా బాగాలేకపోవడంవల్ల, వసుధను చదివించలేక పోయాడాయన. ఎంతో తెలివిగల వసుధ ఓ ప్రక్క టీచర్ ట్రయినింగ్, మరోప్రక్క పి. యు. సి. ప్రయివేటుగా చదివి పూర్తిచేసింది.

కాలం కౌగిలిలో కరిగిపోతూ, సుందర్రామయ్య యింటి భారాన్నంతా వసుధకు అప్పగించాడు. ఓ ప్రక్క బి ఎ. చదువుతూనే మరోప్రక్క ఉద్యోగం చేస్తూ, వనజను స్కూల్‌ఫైనల్ వరకు చదివించి, పెళ్లిచేసేసింది వసుధ

నేనిహ చదవనంటూ ఖచ్చితంగా చెప్పిన వనజ పెళ్లిచేసుకొని వెళ్లిపోయిందేతప్ప, ''మరి నువ్వు'' అంటూ అడగలేదు. ఆ ప్రశ్నే తల్లి అడిగితే, చిరునవ్వే సమాధానంగా చెప్పింది వసుధ.

తండ్రిలేని లోటు తీరుస్తూ, మగదిక్కులేని ఆ యింటికి మగదిక్కుగా వుండి, వనజ పురిటి కొచ్చినప్పుడు, ఏ లోటు జరగకుండా అన్నీ సవ్యంగా చేసింది వసుధ. కాని వనజకు తృప్తివుండదు. ప్రతి రెండు నెలలకోసారి పాతికా, యాభై పంపమని రాస్తూ ''దాన్ని చదివిస్తున్నావ్ ... నాకు నెలకో పాతిక పంపితేనేం? నాన్న వుంటే .'' అంటూ నిష్ఠూరంగా రాసే వనజకు వసుధ తన ఖర్చులు, అవసరాలు మానుకొని డబ్బు పంపిస్తుంది సుభద్రమ్మ వసుధను వద్దనలేదు. వనజను అదిలించ లేదు. రెంటికి నడుమ నలిగి వీలైనప్పుడల్లా ఏడుస్తూ కూర్చుంటుంది.

ఇప్పుడు వకుళ పెళ్లి విషయం రాసింది. పాతికేళ్ళు దాటుతున్నా, తన విషయం ఆలోచించుకోకుండా వకుళ గురించి రాయడం, కనీసం ఒక్కసారైనా ఏ ఒక్క ఉత్తరంలోనైనా తనగురించి ఒక్క వాక్యంకూడా రాయని, కూతురుపట్ల ఆమె హృదయం జాలితో, గౌరవంతో నిండిపోతుంది.

వసుధతోపాటు, ఉత్తరం విషయం గుర్తుకు రావడంతో, కళ్ళు తుడుచుకొని వకుళకు ఉత్తరం రాయమని చెప్పాలని వెళ్ళింది సుభద్రమ్మ దీపావళి సెలవుల్లో పెళ్లి చేయమంటూ, ఆడపడుచు గోల పెడితే, ''పరీక్షలు అయిపోనీ అమ్మా! అంతలోకె ఏం మునిగిపోతుంది! పరీక్షలు కాగానే మర్నాడే చేసెయ్యండి'' అంటూ చెప్పిన వకుళ మాటలు గుర్తుపెట్టుకున్న సుభద్రమ్మకు. ప్రత్యేకించి వకుళ అభిప్రాయం అడగాలన్పించలేదు.

సుభద్రమ్మ వెళ్ళేసరికి, వకుళ మంచానికి అడ్డంగా పడుకొని కళ్ళు మూసుకొనివుంది.

''వకుళా! ఉత్తరం రాస్తావా!'' అంది. వకుళ, తల్లిగొంతు వింటూనే కళ్ళను మరింత గట్టిగా మూసుకుంది. వకుళ నిద్రపోయిందను కుంటూ, ''భోజనం చేయకుండా అప్పుడే ఏమిటో నిద్రపోతోంది. పరీక్షలు వస్తున్నాయా, చదువు మానేసి రోజూ యిలా నిద్రపోతే ఎలాగే వకుళా!'' అని విసుక్కుంటూ, వకుళలో చలనం కనిపించక పోవడంతో బయటికి వెళ్ళిపోయింది సుభద్రమ్మ.

ఆలోచిస్తూ మగతలోకి జారుకుంటున్న వకుళ, తల్లి, ఎవరితోనో మాట్లాడ్డం వినిపించి లేచి కూర్చుంది గుమ్మంలోకి వెళ్లి నిలబడి చూసింది సుభద్రమ్మ సత్యంతో మాట్లాడుతోంది.

''చలపతికి యిల్లు అద్దెకు కావాలంటేను వెళ్ళానండి!'' అన్నాడు సత్యం.

''ఊఁ... అమ్మాయి వచ్చేస్తుందా?'' అంది సుభద్రమ్మ. సత్యం లోపలికి వెళ్ళిపోతూ జవాబుగా తలూపాడు.

''భోజనానికి వస్తావాబాబూ!'' అంది సుభద్రమ్మ.

సత్యం ఎంతో మెల్లిగా సమాధానం చెప్పాడు. వకుళకు ఏమీ విన్పించలేదు. సత్యం భోజనానికి వస్తాడనుకొని వంటింట్లోకి వెళ్ళింది వకుళ. కాసేపటికి సుభద్రమ్మ వంటింట్లోకి వచ్చింది.

''లేచావుటే?'' భోజనం చేయకుండా ఏమిటి నిద్ర? పరీక్షలు వస్తున్నాయని నీ కేమైనా.''

విసుగ్గా తల్లి మొహంలోకి చూస్తూ, ''ఆయన ముందుకూడా తిట్టడం మానవుకదూ అమ్మా!'' అంది.

''అబ్బాయి ఆకలిగా లేదన్నాడు. పళ్ళెంలో పెట్టి యిచ్చేస్తే ఆకలిగా వున్నప్పుడు తింటా నన్నాడు'' అంటూ పళ్ళెంలో అన్నీ సర్ది తీసికెళ్ళ బోయింది సుభద్రమ్మ.

''నేను తీసికెళ్ళి యిచ్చివస్తాను. అంతలోగా నాకు వడ్డించేయ్'' అంటూ తల్లి చేతిలోని పళ్ళెం తానందుకొని సత్యం గదివైపు వెళ్ళింది వకుళ.


గదిలో సత్యం లేడు. మొహం కడుక్కోవడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్ళినట్టున్నాడు. వరండా మెట్లు దిగి, యింటిచుట్టూ తిరిగి వెనకవైపు వున్న బాత్‌రూమ్‌కు. అలా చుట్టూ తిరిగి వెళ్ళేకన్నా యింటి లోపలినుండి వెళ్ళమని సుభద్రమ్మ ఎన్నో సార్లు చెప్పిచూసింది. కాని సత్యం అలా చుట్టు తిరిగే వెడతాడు.

సత్యం వచ్చేవరకు ఆగాలని, ఏదో మాట్లాడాలని, పళ్ళెం టేబుల్‌మీద పెట్టి నిలబడిపోయింది వకుళ. కాని సుభద్రమ్మ ఒకటికి రెండుసార్లు పిలవడంతో లోపలికి వెళ్ళిపోయింది వకుళ.

భోజనం అయిపోయాకా వెళ్ళి మాట్లాడాలనుకుంది వకుళ. కాని తీరా వకుళ వెళ్ళేసరికి సత్యం గదితలుపులు మూసుకున్నాడు. లోపలినుండి ఎలాంటి అలికిడి రావడంలేదు అతణ్ణి ఎలా పిలవాలో, పిలిచి ఏం మాట్లాడాలో అర్థంకాక, గాఢంగా నిట్టూర్చుతూ, తన గదిలోకి వచ్చేసింది వకుళ. ఆ రాత్రి చాలాసేపటి వరకు నిద్రపోలేదు వకుళ.

మర్నాడు వకుళ నిద్ర లేచేసరికి ఏడు దాటింది. బాత్‌రూమ్ వైపు పోతున్న వకుళకు సత్యం గుర్తుకు వచ్చి వరండామీది కొచ్చింది సత్యం గదికి తాళం కన్పించటంతో అంత ప్రొద్దున్నే అతనెక్కడికి వెళ్ళాడో తెలీక, అర్థంకాని ఆవేదనతోపాటు బోల్డు కోపం వచ్చేసి, తల్లి నడిగింది

''చలపతి వచ్చాడు. అతగాడికేదో యిల్లు కావాలంటేను. . నిన్న సాయంత్రం వెళ్ళి చూసొచ్చారట. ఇవాళ అడ్వాన్సు యిచ్చిరావడానికి వెళ్ళాడు—



యింతకీ..." సుభద్రమ్మ అడిగేలోగానే బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది వకుళ.

చలపతి వచ్చి తీసికెళ్ళాడనేసరికి, వకుళకు సత్యంమీద, అంతకు ముందు వచ్చిన కోపం అంతా చలపతి మీదికి మళ్ళింది. అంతలోనే. . ఎప్పుడూ సత్యంతో మాట్లాడాలన్నా . ఏదో అవాంతరం... అపశకునంలా కన్పించి, ఏడుపు వచ్చింది వకుళకు కళ్ళు గట్టిగా తుడిచేసుకుంటూ వంటింట్లోకి వచ్చిన వకుళను చూసి, "ఇలా ఏడువరకు నిద్రపోతే ఎలాగే వకుళా? చూడు కళ్ళు ఎలా ఎర్రబడ్డాయో!" అంటున్న తల్లి మాటలకు తల వాల్చుకొని, కాఫీ గ్లాసందుకొని వెళ్ళిపోయింది వకుళ.

"వకుళా! ఇది నీ జీవిత సమస్య! అతను నోట్లో మూగి అన్నావ్! అలాంటప్పుడు నువ్వే అడగాలి మరి మీ అమ్మ ఉత్తరం రాయించేలోగానే ఈ విషయం అతణ్ణి అడుగు చేతులు కాలాకా ఆకులు పట్టుకొని లాభంవుండదు సుమా!" అంది సుజాత.

"అతణ్ణి అడగాలి తానే అడగాలి అతనోట్లో మూగి పలకడు ఉలకడు. తానే అడగాలి. కాని ... ఎలా? ఏమని అడుగుతుంది తానే వెళ్ళి అడిగితే అతనేం అనుకుంటాడు తానంతగా గదిలో వున్నప్పుడు మామూలుగా పలకరించినా, భోజనం చేసేప్పుడు పలకరించినా జవాబు చెప్పని అతణ్ణి తాను ఏమని అడుగుతుంది? తనలా సూటిగా సిగ్గువిడిచి అడిగితే అతనేమనుకుంటాడు? అసలు అతనికి తనమీద అలాంటి అభిప్రాయం లేకుంటే తానలా వెళ్ళి అడగడం ఎంత అసహ్యంగా వుంటుంది అలా అనుకొని అడగడం మానుకుంటే . ఉహుఁ. . అని తల అడ్డంగా ఆడించి, ధృడనిశ్చయానికి వచ్చి "వకుళా ఉత్తరం రాయవే" అని తల్లి బలవంతంగా తనచేత రాయించకముందే సత్యంతో మాట్లాడాలి" అనుకుంది వకుళ

కాని మరో రెండురోజుల వరకు సత్యంతో మాట్లాడే అవకాశం దొరకలేదు మూడోరోజు సాయంత్రం వకుళ యింటికి వచ్చేసరికి, సత్యం గదిలో వుండడంతో హుషారుగా లోపలికి వెళ్ళింది వకుళ కాఫీత్రాగి వెళ్ళేసరికి, సత్యం గదికి తాళంవేసి వరండా మెట్లు దిగుతున్నాడు, అతని చేతిలోని పుస్తకాలు చూస్తూనే బహుశా లైబ్రరీకి వెడుతున్నాడేమొ! అలా అయితే మరో అరగంటకల్లా ఇంటికి వస్తాడనుకుంటూ తన గదిలోకి వెళ్ళి అతను వచ్చాక సంభాషణ ఎలా మొదలుపెట్టాలా అని ఆలోచిస్తూ కూర్చుంది వకుళ.

కాని ... వకుళ ఆలోచనలు, అంచనాలు అన్నీ తారు మారైపోయాయి.

"వసూకు ఉత్తరం రాయించానే వకుళా!" అంది సుభద్రమ్మ.

"ఏమని రాయించావ్" అని వకుళ అడగక ముందే సుభద్రమ్మ చెప్పింది.

"నా అభిప్రాయం మాత్రం మరోలా ఎలా అవుతుందే వకుళా! ఎలాగూ నీ చదువు అయిపోతుంది. ఇక మనంమాత్రం వాళ్ల మాటను ఎలా

పేయింగ్ గెస్ట్

కాదంటాం. ముహూర్తాలు పెట్టించమంటూ అత్తయ్యకు రాయమని, వసుకు రాయించాను" అంది సుభద్రమ్మ స్టౌమీద ఉడుకుతున్న అన్నం వంక నిర్లిప్తంగా చూస్తూ.

వకుళ బొమ్మలా నిలబడిపోయింది క్షణం సేపు కళ్లముందు చీకటి కదలాడింది.

"నన్ను అడగకుండానే ఎందుకు రాయించావ్ అమ్మా" అంది వకుళ మెల్లిగా. వకుళ ప్రశ్నకు జవాబుగా కూతురువంక ఓసారి అర్థంకానట్టు చూసి, సెగలుకక్కుతూ పొంగిపోతున్న అన్నం గిన్నె మీద మూతవేసి, గంజి వార్చేసింది సుభద్రమ్మ

వకుళను అడగాల్సిందేమిటో తెలీక, వకుళ ప్రశ్నను మరోలా అర్థంచేసుకుంటూ, "మూడు సార్లు జ్ఞాపకం చేసాను ఉత్తరం రాయవే అని రాస్తాను అని అన్నావేకాని రాయలేదు అయినా



నువ్వు రాసేదే ఆ అబ్బాయిచేత రాయించాను తప్పేమిటి? ఆ అబ్బాయి రాస్తే వచ్చే నష్టమేమిటీ?" అంది సుభద్రమ్మ వకుళ ప్రశ్నకది సరైన సమాధానం కాదు కాని ఆ క్షణంలో తల్లి తన ప్రశ్నను సరిగ్గా అర్థంచేసుకోలేదన్న ఆలోచనకంటె సత్యంతో రాయించానన్న విషయం వకుళమీద బాగా పనిచేసి, మండిపడుతూ, "ఆయనతో ఎందుకు రాయించావ్? నేను రాసేదాన్నిగా?" అంది

"ఆఁ. . ఆఁ రాసేదానివి మరో నెలరోజులయాకా! ఉన్నవిషయం రాయడానికి ఎవరైతేనేం? నువ్వు రాసేదే ఆ అబ్బాయిచేత రాయించాను" అంది

"మన యింటివిషయం ఆ అబ్బాయి ఎందుకు రాయాలి? అసలు ఆయనకు మన ఇంటి విషయాలెందుకు తెలియాలి? ఆయనతో ఉత్తరం రాయించాల్సిన అవసరం ఏమిటీ?" అంది వకుళ కోపంగా.

"ఇప్పుడేం జరిగిందని..." తల్లి మాట పూర్తికాకముందే వకుళ కళ్లు నీళ్లతో నిండిపోయాయి. చటుక్కున అక్కడినుండి వెళ్లిపోయింది.

"జరగకూడనిదే జరిగిపోయిందమ్మా!" అంటూ దిండులో మొహం దాచుకొని ఏడుస్తున్న వకుళకు హఠాత్తుగా సత్యం ఉత్తరం రాసాడన్న విషయం గుర్తుకువచ్చింది.

"సత్యం ఉత్తరం రాసాడట. అమ్మ రాయిస్తే...తన పెళ్లి విషయం రాసాడట. అంటే ఏమిటీ? తనకు బావతో పెళ్లి నిర్ణయం జరిగిపోయిందని తెలిసిందికదూ! తెలిసికూడా ఉత్తరం రాసాడంటే ... తనపై అతనికున్న అభిప్రాయం ఏమిటీ? ఏం లేదా? లేక.. వున్నా. . ఈ ఉత్తరం రాసాక ఏం మిగలకుండాపోవచ్చు కాని ... అసలు తనమీద తానాశించే అభిప్రాయం వుంటే . . ఉత్తరం రాసేవాడా? ఉహుఁ ... అంటె... అంటే లేదన్నట్టేగా ... ఎందుకని? తాను అందంగా లేదూ? తను అతనికి భార్యగా తగదూ! ... ఛీ... ఎంత గర్వం ... ఎంత నిర్దయత్వం .. ఎంత నిర్లక్ష్యం..." వకుళ ఓప్రక్క కోపంతో మరోప్రక్క బాధతో వెక్కివెక్కి ఏడ్చింది అమాయకంగా

సుభద్రమ్మ వంట పూర్తిచేసుకొని వచ్చేసరికి వకుళ ఏడుస్తూనేవుంది దిండులో మొహం దాచుకోడంవల్ల, వకుళ నిద్రపోయిందనుకొని . "ఏం నిద్రో ఏమిటో? పరీక్షలు దగ్గిరపడుతుంటే చదువుకోకుండా ఆరుగంటలకే నిద్రపోతోంది ఏం ప్యాసవుతుందో .. అయినా ప్యాసయిమాత్రం ఎవర్ని ఉద్ధరించాలి కనుక" అంటూ మెల్లిగా గొణుక్కుంటూ బయటికి వచ్చేసింది సుభద్రమ్మ

"సుజా! అతనలా ఉత్తరం రాసాడంటే — అతని అభిప్రాయం యిలా అంచనా వేయడంలో తొందరపాటేం లేదుకదా!" అంటూ అమాయకంగా అడిగింది వకుళ

"మొహమ్మీదే అన్పించుకోవాలంటే అడుగు కాదంటే ఇంతటితో అన్నీ మర్చిపోవడం ఉత్తమం కాని వకుళా! ఇందులో అతని తప్పుకంటే నీ అవివేకం ఎక్కువ కన్పిస్తోంది. నువ్వు ప్రేమించావే తప్ప, అతనికి నీమీద ఎలాంటి అభిప్రాయం వుందో తెలుసుకోకుండా, నువ్వే, ఏవేవో ఊహించుకోవడం, బొత్తిగా తెలివిలేని పని కాదూ? అతను నోర్మూగి అని, నీతో సరిగ్గా మాట్లాడేవాడు కాదని, తెలిసికూడా అతనిగురించి నువ్వు ఏదో అనుకొని, మరేదో ఊహించుకొని ఆశలు పెంచుకోవడం, ఈనాటి ఈ బాధకు కారణం. ఆలోచిస్తుంటే — అతను నీ గురించి ఒక్కసారి కూడా ఆలోచించలేదేమో . అసలు నీ గురించి ఎలాంటి అభిప్రాయం లేదేమో అన్పిస్తోంది. కాని వకుళా! అతను వుత్తరం రాయడంవల్ల, రెండు పన్లు జరిగాయి. ఒకటి అతనికి నీమీద ఎలాంటి అభిప్రాయం లేదని తెలియడంతోపాటు, మరోటి మీ బావతో, నిర్ణయం కావడం" అంది సుజాత

సుజాత మాటలు నిశ్శబ్దంగా వింది వకుళ ఓ విధంగా చంద్రంతో పెళ్ళికి మనసు అంగీకరిస్తున్నా, అంతరాంతరాల్లో ఏమూలో, సత్యం తన గురించి ఒక్కసారి ఆలోచించలేదు అన్న ప్రశ్న వెనుకే "అవును ఆలోచించలేదు" అనే జవాబు వచ్చింది. [ఇంకా ఉంది]

పద్మ భూషణ్ అవార్డు గ్రహీత బి. ఎన్. రెడ్డి

—వి. వెంకట్రావ్

తెలుగువాళ్ళు ''మల్లీశ్వరి''ని మరచిపోరు. ''బంగారుపాప''ను విస్మరించలేరు. మల్లీశ్వరిని, బంగారుపాపను మరచిపోనంత కాలం బి. ఎన్. రెడ్డినికూడా మరచిపోలేరు.

బి.ఎన్. గా బి. ఎన్. రెడ్డిగా తెలుగు ప్రేక్షకుల హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొన్న బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి వాహినీ సంస్థను స్థాపించి తెలుగు చలనచిత్ర చరిత్రలో నవశకానికి నాంది పలికారు. భారతీయుడయిన ప్రతివ్యక్తి శరీరంలో జాతీయభావం అనే రక్తం ప్రవహించిన ఆ రోజుల్లో బి.ఎన్. జాతీయతత్వాన్ని ప్రబోధిస్తూ తీసిన వందేమాతరం చిత్రం గొప్ప సంచలనాన్ని లేవదీసింది.

ఫొటోగ్రాఫర్ రామ్‌నాథ్, కళాదర్శకుడు శేఖర్ గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు నాగయ్య, రచయిత సముద్రాలగార్లను కలుపుకొని ఆయన వాహినీ సంస్థను నిర్వహించారు. ఈ సంస్థ సుమంగళి, దేవత, స్వర్గసీమ, మల్లీశ్వరి, బంగారుపాప వంటి నాటికీ నేటికీ మేటిఅయిన చిత్రాలను నిర్మించింది. బి. ఎన్. కు సంగీతంఅన్నా కళఅన్నా వల్లమాలిన అభిమానం. అందుకే ఆయన తన చిత్రాలలో కళకు, సంగీతానికి అత్యధికమయిన ప్రాధాన్యాన్ని యిచ్చేవారు. ఇందుకు మల్లీశ్వరి చక్కటి ఉదాహరణ. ఈ చిత్రంతోనే బి ఎన్ కు కళాఖండాల దర్శకుడు అనే ముద్దుపేరు లభించింది ''చిత్రాలను కళాత్మకంగా తీయాలి, వ్యాపార దృష్టితోకాదు'' అనేది బి ఎన్. అభిప్రాయం. ఆయన చిత్రాలలో చౌకబారుతనం కన్పించదు. ప్రజల అభిరుచులు మారిన ఈ రోజు లోకూడా ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకోకుండా కళకు, వాస్తవికతకు ప్రాధాన్యం యివ్వారనడానికి ఆయన ఇటీవలి చిత్రం ''బంగారు పంజరం'' సుష్పుతునక.

ఆయనలో మరో విశిష్టలక్షణం ఏమిటంటే ఎంత గొప్ప నటుడికయినా సన్నివేశాన్ని విడమరచి చెప్పి, తనకు కావలసిన విధంగా ఆ నటునిచేత నటింప జేయుస్తారు. 16-11-1908 లో కడప జిల్లాలో జన్మించిన బి. ఎన్ ఆడిటర్ అవుదామను కొన్నారు. కాని సినీనిర్మాత, దర్శకుడు అయ్యారు పొన్నలూరి బ్రదర్స్‌వారి భాగ్యరేఖ, శంభూ ఫిలిమ్స్ వారి పూజాఫలం బి. ఎన్. డైరెక్టు చేసి పెట్టిన ఉత్తమ చిత్రాలలో కొన్ని. ఆయన కొంతకాలం ఎం ఎల్ సి. గా పనిచేశారు. ప్రభుత్వం ఆయన గొప్పతనాన్ని ఆలస్యంగా గుర్తించినా ప్రజలు ఏనాడో బి ఎన్. కు తమ హృదయాలలో శాశ్వతమయిన స్థానాన్ని యిచ్చారు. ఏమయినా బి ఎన్ కు పద్మభూషణ బిరుదు లభించడం ఆయన అభిమానులకే కాదు, తెలుగు జాతికే గర్వకారణం.

"అరేయ్ అన్నాయ్,

నీవు పోరిపోరి నాచేత అప్లయి చేయించిన ఆ ఉద్యోగానికి రేపు సోమవారమే ఇంటర్వ్యూ. ఆదివారం శుభ్రంగా భోజనంచేసి బస్సెక్కుతాను. నీవు రోడ్ల మ్మట బలాదూరు తిరక్కుండా బుద్ధిగా బస్సుస్టాండుకు వచ్చినాసరే—లేదంటావా కొంపలోపడి ఏడ్చినాసరే. ఆటోలో సరాసరి వచ్చివాలతాను. సోమవారం ఉద్యోగానికి శెలవుపెట్టేయ్.

— శశిరేఖ."

'వద్దు, వద్దు' అనుకుంటూనే నాకు కాని ఆ కార్డుముక్కను చదివాను. అది వచ్చింది మూడురోజుల క్రితంవరకూ ఆ ఇంట్లోవున్న భాస్కరంకి. అతగాడు టెలిగ్రాఫిక్ ఆర్డర్సుమీద కలకత్తాకు బదిలీ అయి వెళితే, నేను ఆ ప్లేస్‌లో మద్రాసు నుంచి వచ్చాను. అంతా రెండు మూడు రోజుల్లో జరిగిపోయింది. కంపెనీయే అద్దె పే చేసే ఆ కొంపలో నేను మొన్న జేరటం జరిగింది!

ఇవాళ శనివారం. ఆ శశిరేఖ మహారాణీ గారు రేపు రాత్రికి విచ్చేస్తారు కాబోలు. 'భాస్కరంలేడూ' అని ఓ టెలిగ్రాం పారేద్దామన్నా ఆవిడగారు తన అడ్రసు ఇచ్చిఏడ్వలేదు.



ఖర్మ! రానీయ్ చూద్దాం...

* * *

ఆదివారం రాత్రి హోటల్లో భోజనంచేసి ఆ రాబోయే శశిరేఖనే క్షణంక్షణం తలుచుకుంటూ ముందుగదిలో పెర్రీమేసన్ చదువుకుంటూ కూర్చున్నాను.

ఆ ఉత్తరంలో భాషచూస్తే ఆవిడగారు ఓ పెద్ద గడుగ్గాయలాగానే వున్నది.

బస్సుస్టాండుకే వెళ్ళి 'ఈ శుభవార్త'కాస్తా జేరవేస్తే మరేచుట్టాల కొంపనన్నా వెతుక్కుంటుందేమోనన్న ఆశవున్నా ఆవిడగారి రూపురేఖలే తెలియవాయె...విజయవాడనుంచి వచ్చే ఎన్ని బస్సులను శశిరేఖ ఎవ్వరంటూ వెతగ్గలను?

పదిగంటలప్పుడు ఓ ఆటో ఇంటిముందు ఆగటం, అందులోనుంచి శశిరేఖ అనబడే ఆ పిల్ల ఒక్క ఎగురు ఎగిరి బయటకు దూకటం, ఆపైన సూట్కేసును, బెడ్డింగ్‌నూ బయటకు లాగటం—ఆటో బాబు డబ్బులుచ్చుకొని వెళ్ళిపోవడం... అంతా నేను రోడ్డు మీద వెలుగుతున్న కార్పొరేషన్‌వారి దీపాల కాంతిలో ఆమె అందాన్నిచూచి ఉబ్బి తబ్బిబ్బు అవ్వడంలోనే జరిగిపోయింది

ఆమె రెండింటినీ రెండుచేతుల్తో పట్టుకొని తలుపెదురుగ్గా నోరు తెరుచుకు చూస్తున్న నన్ను చూస్తూనే నేలమీదకు జారవిడిచింది.

"భాస్కరం లేడాలండీ ?"

ఆమె ప్రశ్న ఆమె నాకు గురిపెట్టి వదిలిన తుపాకీ గుండే అవ్వగా నోరుమూసుకొని ఖహ లోకంలో పడ్డాను.

"భాస్కరమా అండీ ... ఉన్నాడండీ, కలకత్తాలో !"

"అదేమిటి? అక్కడకు ఎందుకు వెళ్ళాడు ?"

"మూడురోజుల క్రితం ట్రాన్స్ఫరయి వెళ్ళిపోయాడు ... వారి ప్లేస్‌లోనే నేను వచ్చాను !"

"అఘోరించలేకపోయారూ !" అన్నట్లే వున్నది ఆమె మొఖంలో మార్పు ఆ క్షణాన.

తప్పు చేసినవాడిలా తలవంచుకు నిలబడక తప్పలేదు.

"భాస్కరం మా అన్నయ్యండీ! రేపు ఓ ఇంటర్వ్యూ వుంటే బెజవాడనుండి వచ్చాను... నేను వస్తున్నట్లుగా ఒక కార్డు కూడా రాశాను... బస్సు దగ్గరకు రాకపోతే

బద్ధకించాడేమోలే అనుకున్నాను!..." అన్నది చిన్నగా, దిగులుగా.

ఒక్కక్షణమాగి నేను నసుగుతున్నట్లుగా అన్నాను. "ఇంకా మీ చుట్టాలెవ్వరూ లేరా అండీ ఇక్కడ?" అని.

"మా పిన్నీవాళ్ళు ఉండాలండీ... కానీ, ఈమధ్యనే వాళ్ళు ఇల్లు మారినట్లుగా రాశాడు వాడు... అందునా ఇప్పుడు పదిగంటలయ్యే... ఎక్కడని వెతికేది?" అన్నది దిగులుగా ఆ అమ్మాయి.

అంత అందమైన అమ్మాయి అలా దిగులుతో నీరు కారిపోతుంటే నన్ను జాలి నిశ్శబ్దంగా నిలబడనీయలేదు.

"పెళ్ళిగ్రాంమీద ట్రాన్స్‌ఫర్ జరిగింది!" అన్నాను ఒక్కక్షణం తరువాత జాలిగా ఆమె మొఖంలోకి చూస్తూ.

బంగారుతీగెలా వున్న ఆ అమ్మాయి తల వంచుకొని కలవరపాటుతో ఏం చేయాలో తోచనట్లుగా నిలబడివున్నది. బస్సు ప్రయాణంలో జుట్టంతా రేగిపోయి మొఖానికి అదో అందాన్ని చేకూరుస్తూ చిందరవందరగా పడుతుంది. అసలే ఎర్రటి మనిషి. దానికి తోడు ఎర్రటి చీరె... గాజులంత రింగులు అటూ ఇటూ అందంగా ఊగుతున్నాయి చెవులకు.

"ఒక పనిచేయండి... మీ కభ్యంతరం లేకపోతే ఈ రాత్రికి ఇక్కడే వుండండి!" అన్నాను నయం భయంగా ఆ అమ్మాయి వైపుకు చూస్తూ.

"థాంక్యూ వెరీమచ్... నేనూ అదేరిక్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను మిమ్మల్ని!" అన్నది ప్రాణం లేచివచ్చిన దానిలా తలెత్తి చిన్నగా నవ్వుతూ.

నాకునోటమ్మటమాటసరిగ్గా పెగలటంలేదు. "మా యింట్లో...మా యింట్లో ఇంకా ఆడవాళ్లెవ్వరూ లేరండీ...నేను... నేను... ఇవాళ రాత్రికి ఆఫీసుకు వెళ్లి పడుకుంటాను!" అన్నాను చిన్నగా.

"...నో...ఫరవాలేదండీ...నాకోసరం మీరు ఇబ్బంది పడనక్కరలేదు...!"

నేను మాట్లాడకుండా పక్కకు తప్పుకున్నాను ఆమెకు దారి ఇస్తూ.

ఆమె పెట్టె, బెడ్డింగ్ లోపలకు జేరవేసింది—అలా జేరవేసింతరువాత నేను కించత్ బాధపడ్డాను గూడా—ఆ లేత వేళ్లచేత అంత బరువైన వాటిని మోయించినందుకు.

"నా పేరు శశిరేఖ!"

"నా పేరు సత్యం!..."

చీరె చెంగుతో మెడనూ మొఖాన్నీ తుడుచుకుంటూ, "ఒక్కోసారి అనుకోకుండా ఇలాంటి ఇబ్బందుల్లోనే ఇరుక్కోవల్సి వస్తుంది...నేను ఇబ్బంది పడటమేగాకుండా...మిమ్మల్ని గూడా ఇబ్బంది పెడుతున్నాను!" అన్నది నొచ్చుకుంటున్నట్లుగా.

"అబ్బే..."

"హైద్రాబాద్ నాకు బాగా తెలుసు... ఆ ధైర్యంతోటే మధ్యాహ్నం బయల్దేరాను... పొద్దున్నేవస్తే ఈ ఇబ్బందులు వుండేవే గాదు..."

ఆమె అటూ యిటూ చూస్తుంటే "మంచినీళ్లు కావాలా?" అని అడిగాను ఆమె వైపుకే చూస్తూ.

ఆమె చిన్నగా నవ్వింది. "మీరు, మీ సామాన్లు నాకు కొత్త అవ్వవచ్చుగాని...నేను ఈ యింటికి పాతదాన్నే!... నాక్కావాల్సినవేవో నేను చూసుకుంటానులెండి!" అన్నది. "నేను స్నానం చేయందే బ్రతికేలా లేను... నీళ్లేమైనా స్టోర్ చేసివున్నయ్యా?"

"ఆఁ...బాత్ రూంలో వున్నాయండీ!"

"థాంక్యూ... మీరు చదువుకుంటూ కూర్చోండి .. పావుగంటలో స్నానంచేసి వస్తాను!"

"మీరేమైనా తినటానికి...?"

"ఆకలవుతున్నమాట వాస్తవమే గానీ—ఇప్పటికే మీకుశ్రమ...దీనికి తోడు మరొకటా కాదంటే ఓ పనిచేయండి—యీ వీధిచివరిలో ఓ ఇరానీహోటల్ వుంది...ఫ్రూట్ బ్రెడ్ పట్టండి... ఫ్లాస్క్ వుంటే రెండు కప్పుల చాయ్ పోయించుకు రండి—డబ్బులిస్తాను!"

"దట్సాల్ రైట్...నేను తెస్తానులెండి!"

"అదేం లాభం లేదు...ఆ టాక్స్ గూడా దేనికి మీకు... ముందు పైసలు తీసుకు వెళ్లండి...లేకపోతే నేను వాటిని ముట్టుకోను గూడా!"

"మీరు ఇప్పుడు నాకు గెస్ట్... నాకు తెలిసినా తెలియకపోయినా మీరు నా కొలీగ్ భాస్కరంగారి చెల్లెలుగారు!" అన్నాను.

"మీరు ఎన్నైనాచెప్పండి...నా దగ్గర డబ్బులతోటే అయితేనే వాటిని పట్టుకురండి... లేకపోతే వద్దు!"

ఇక తప్పలేదు.

* * *

శశిరేఖా! నీ అందానికి హాట్సాఫ్...



"ప్రశ్నాపత్రం చదవడానికే టైం చాల్లేదు నాన్నా! లేకపోతే ఏపీ రాయకుండా ఎందుకొస్తాను?"

ఆమె స్నానం చేసి బయటకు రావటానికి మరో పావుగంట పడుతుంది. అంతకుమించి ఒక్కక్షణంగూడా రోడ్డుమీద వృథా చేయ గూడదనిపించింది. త్వరత్వరగా ఆ రెండు ఫర్లాంగులూ నడిచివెళ్ళి ఆ వస్తువులు తీసుకొని యింటికి వచ్చేశాను.

అప్పటికే ఆ శశిరేఖ అనబడే ఆ బంగారు బొమ్మ ఉతుకువచ్చినపూల నాయిల్‌లో మెరిసిపోతూ వాకిట్లో నిల్చొని నాకోసం ఎదురు చూస్తున్నట్లుగా అనిపించింది.

"థాంక్యూ..."

"మెన్షన్ నాట్ ప్లీజ్!"

"హైద్రాబాద్‌కు మీరు కొత్తగా వచ్చారా?"

"అవునండీ!"

"అయితే మీరు జాగ్రత్తగా వుండాల్సిందే... గెస్ట్సు రాకపోకలు ఎక్కువగానే వుంటుంది... ఒక పగలూ వుండదు, రాత్రి వుండదు... ఇలాగే!" అన్నది నవ్వి.

"నాకు ఫ్రెండ్సుతప్ప చుట్టాలు చాలా తక్కువ!" అన్నాను టేబుల్‌మీద బ్రెడ్, ఫ్లాస్కు పెడుతూ.

"నేను [illegible] కనిపెట్టిందేమిటంటే ఇంకా పెళ్ళికాలేదని... ఇంకేం చూచి కొత్త [illegible]వున్నవాళ్ళమ్మాయిని పెళ్ళిచేసుకోండి... ఆ కోరికా తీరిపోతుంది ఏమంటారు నాలుగు రోజుల్లో 'నెడవ సంగి' అని!" అన్నది నవ్వుతూ ముసిముసిగా.

నిద్ర

మొగవాణ్ణయినా సిగ్గుపడటం నావంతు అయింది.

"కానీయండి... టిఫిన్ తినేసేయండి... చాలా పొద్దుపోయింది!"

"మీరుగూడా!"

"నో ప్లీజ్!"

"అదేంకుదరదు మాష్టారు... రెండు ప్లేట్లు తెస్తాను... మాటలు చెప్పుకుంటూ తినేద్దాం!" అంటూ లోపలకు వెళ్ళింది.

ఆ అమ్మాయి అలా ఆ గదుల్లో తిరుగుతుంటే నా యింటికే వెలుగు వచ్చిందనిపిస్తోంది... వాకిటికి నాలుగు మామిడాకులు కట్టి బాజా భజంత్రీలను 'కానీయండోయ్' అనాలనిపించేలా వున్నది.

"దేనికి మీరు ఇంటర్వ్యూకి?" అడిగాను ప్లేట్లుతెచ్చిన ఆమెను.

ప్యాక్ విప్పితీసి స్వీటు సెవ్ రెండు ప్లేట్లలో సర్దింది.

"అవ్వి నేను తినలేనండి... కంపెనీ కోసరం రెండు... ప్లీజ్... నన్ను ఇబ్బంది పెట్టవద్దు!"

"ఓ.కే... మీరు తినగలిగినవ్వే తినండి...!" అంటూ ప్యాకెట్టు కవర్ విడదీసి పక్కన పడేసి, కుర్చీ అవతలకులాక్కొని కూర్చున్నది.

"చెప్పండి!" అడిగాను.

"అదేదో ప్రైవేటు కాలెజి...అసిస్టెంట్ లెక్చరర్‌గా...వాడు పంపేశాడు నన్ను అప్లయి చేసిందాకా ... వాడి పోడిమలనే విని నేను ఇబ్బందుల్లో పడాల్సివచ్చింది!"

'థాంక్యూ భాస్కరం!' అనుకున్నాను మనస్సులోనే. పైకి, "మీరు?" అడిగాను.

"ఎమ్. ఏ...సైకాలజీ!

"ఫైన్...ఎక్కడ?"

"వైజాగ్!"

"నాది ఎమ్.టెక్...మద్రాసు!"

"—అయితే ఉద్యోగంలో చాలాదూరం వచ్చారన్నమాట!"

"అబ్బే అదేంలేదండీ.. మాది అసలు గుంటూరే...మా నాన్న కాంపోజిట్ స్టేట్‌లో మద్రాసులో పనిచేసేవాడు.. అక్కడే సెటిల్ అయ్యాం!" అన్నాను నవ్వి.

ఆమె రెండు కప్పుల్లో చాయ్ పోసింది.

నేను ఆమెలోని ప్రతి కదలికనూ కుతూహలంతో వీక్షిస్తున్నాను. అసలు అక్కడ అలా

కూర్చుంటే శశిరేఖ మొఖాన్ని ఓరగా చూడవచ్చు — ఆ యాంగిల్‌లో మరీ అందంగా వున్నది !

"మీకు భాస్కరం స్వంత అన్నయ్యేనా?"

"కాదు...కజిన్ ... అయితేనేం ... చాలా క్లోజ్‌గా వుంటాం...నాకు నాకంటే రెండేళ్ళే పెద్ద !" అన్నది.

వేడివేడి టీ శరీరానికి చాలా హాయిగా వున్నట్లనిపించింది. అందునా దాన్ని ఆ బంగారు తీగెలు ఫ్లాస్కునుంచి కప్పుల్లో పోసినయ్యేమో ... షుగర్ మరింకాస్త కలిపినట్లే అనిపించింది.

"చాలా పొద్దుబోయింది ... మీరు రెస్టు తీసుకోండి !" అన్నాను చివరి గుక్క ను త్రాగేసి టేబుల్‌మీద కప్పును పెడుతూ. "నేను మేడెక్కేస్తాను...మీరు ముందుగదిలో ఫ్యాను పెట్టుకు పడుకోండి !"

"నేనూ మేడ మీదకు వచ్చేస్తున్నాను ... పైన కావలసినంత చోటు. ఈ ఎండాకాలంలో ఫ్యాను క్రింద పడుకోమని నా ప్రాణం ఎందుకు తీస్తారు ... పక్కనున్న వేపచెట్టు గాలిని హాయిగా పైన పడుకొని అనుభవించక" అన్నది లేస్తూ.

స్వతంత్రంగా రెండు కప్పులూ బాత్ రూంలో వేసేందుకు తీసుకు వెళ్తుంటే, ఆమె మొఖంలోకి ఆర్తిగా చూస్తూ,

"థాంక్స్ !" అన్నాను ఇంకేమనాలో తెలియక

గడప దాటుతున్న దల్లా ఒక్కక్షణమాగి నా వైపుకు చూస్తూ, "మన మిద్దరం ఒకళ్ళ కొకళ్ళం థాంక్స్ చెప్పుకుంటూ కూర్చుంటే ఇక్కడే తెల్లవారి పోతుందికాని... ఏమనుకోకుండా నా బెడ్డింగ్‌గూడా కాస్త పైనపారేస్తే నాకు మేలు చేసిన వాళ్ళవుతారు... ఆటోలో నుంచి ఈగదిలోకి మోసేటప్పటికే నాచేతులు రెండంగుళాలు పొడుగు పెరిగి పోయినయి !" అన్నది.

నీ అందమేగాదు, నీమాటలూ అమృతమే, శశిరేఖా !

బలం చేకూరేలా ఇచ్చిన ఇంజక్షన్‌లా వున్న ఆమె మాటలకు నేను లేచి నిలబడుతూ, ఆమె బెడ్డింగునూ, నాబెడ్డింగునూ గూడా రెండు చేతులతో ఒకేసారి లాగించేసాను పైకి— ఆడదాన్ని చూస్తేనే మగవాడు హనుమంతుడవుతాడే — అందమైన శశిరేఖ ముందు నేనే పాటి ?

వెనకాలే శశిరేఖ జగ్‌నిండా నీళ్ళు పట్టుకొని ఒక గ్లాసు తీసుకొని పైకివచ్చేసింది.

అప్పుడు రాత్రి పదకొండు గంటలు దాటింది.

"మీరు క్రిందకువెళ్ళి తాళం వేసిరండి !" అన్నది పైకి వస్తూనే.

ఆమె కంఠం ఎంతో పరిచయస్తురాలిదిలా వున్నది—అంతేగాదు, నాకు తెలియని అధికారమేదో మిళితమై నామీద స్వారి చేస్తున్నట్లే వున్నది.

నేను బుద్ధిమంతుడిలా క్రిందకు వచ్చి ఇంటికి బయటతలుపు తాళంవేసి, మరో ఐదు నిముషాల్లోనే పైకి జేరాను.

"మద్రాసులో మీ ఇల్లెక్కడ ?"

"టీ నగర్ !"

"నాలుగేళ్ళ క్రితం ఒకసారి చూచాను... బాగుంటుంది మద్రాసు !" నా మొఖాన ఒక

> "నేనెప్పుడూ పాత బాకీలని తీర్చను !" అన్నాడు గిరీశం.
> "కొత్తబాకీల సంగతి ?" అని అడిగాడు ఆదుర్దాగా రామారావు.
> "పాతబడనిస్తాను..."

కాంప్లిమెంట్ పారేసినట్లువ్వది ఆమెమాట !

ఆమెనే ఆ పండువెన్నెలలో కన్నార్పకుండా చూస్తున్నాను — దూరంగా ఓ పక్కగా బెడ్డింగ్‌మీద పరిచిన తెల్లదుప్పటిమీద రంగు రంగుల పూలకుప్పలా కూర్చొని నా వైపే చూస్తున్నది శశిరేఖ.

"నా స్పెషల్ సబ్జక్టు సైకాలజీ... గుర్తున్నదా మాష్టారూ!" అన్నది రెండు నిముషాల నిశ్శబ్దాన్ని చీలుస్తున్నట్లుగా నవ్వి.

"చెప్పారు !"

"మీరు నా గురించే ఆలోచిస్తున్నారు, అవునా ?"

తడబడక తప్పలేదు.

"అబ్బెబ్బే !"

"ఇంకేం... కన్ఫరమ్‌కూడా చేసేశారు... అది నిజంకాకపోతే ఆ తడబాటు దేనికి ?"

ఇంకేం మాట్లాడేది... నోరు మూసుకోవటం అన్నివిధాలా ఉత్తమం అనిపించగా, నోరు నొక్కుకొని మెదలకుండా పడుకొన్నాను.

"నా మాటలకు మీ మనస్సు కష్టపెట్టుకుంటే నేను బాధ్యురాలిని కాదండోయ్... వున్నదేదో మొఖంమీద అనేయటమే శశిరేఖ పాలసీ !" అన్నది నవ్వి రెండు మబ్బు తునకలు చంద్రుడిని కప్పివేయ వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి.

"మీ యిల్లుకాబట్టి మీరంత స్వేచ్ఛగా పడుకున్నారు... భాస్కరం ఇక్కడలేడు అనే షాక్ నాకు నిద్ర పట్టనీయటంలేదు !..." అన్నది కంఠం తగ్గించి విచారిస్తున్నట్లుగా శశిరేఖ.

మోచేతుల మీదుగా లేస్తూ, "పడుకోండి... అతగాడు లేకపోవటం ఒక షాకే అవ్వవచ్చుగాని... ఇది మీకు బాగా పరిచయమున్న ఇల్లు... కొత్త ఫీలవ్వనద్దు !" ఆమె మాటలు ఆమెకే అప్పచెబుతున్నట్లుగా అన్నాను.

ఆమె నవ్వేసి, "ఇల్లు పరిచయమైనదే అవ్వవచ్చుగాని... మనుష్యులు కొత్త అవ్వటంతో నాకు నిద్రపట్టటంలేదు... నేను ఆడదాన్ని కదండీ... నా భయాలు నావి !" అన్నది వేపచెట్టుకొమ్మల నడుమ గూడు కట్టుకుంటున్న చీకట్లోకి చూస్తూ.

నాకు ఆమె మాటలు కష్టం కలిగించిన మాట వాస్తవమే! ఇలాంటి భయాలూ ఆందోళనలూ లేకుండా వుండాలనే ఆఫీసుకు వెళ్ళి ఈ రాత్రికి ముక్కుమూసుకుందామనుకున్నాను 'వద్దని' ఆవిడే అన్నది ... ఇప్పుడు భయం అంటున్నదీ ఆవిడే !

కాస్త నిష్ఠూరంగానే అన్నాను, "మీకు ముందే చెప్పాను ఇప్పుడయినా నాకు ఫరవాలేదు...ఆఫీసుకు వెళ్ళిపడుకోమంటారా ?"

"నా ఉద్దేశ్యం అదిగాదు ... నేను వంటరిగా వున్న ఆడదాన్ని ... మీరా పరాయి మొగవారు...అలాంటి భయముంటే మీయింట్లో కాలుపెట్టేదాన్నేగాదు...కాని, నిద్ర మాత్రం పట్టటంలేదు అంటున్నాను ! " అన్నది చిన్నగా.

ఇక మాటలు పెంచడం ఇష్టంలేదన్నట్లుగా కళ్ళుమూసుకు పడుకున్నాను.

"ఆల్‌రైట్...గుడ్‌నైట్...నా మాటలు మీకు కష్టం కలిగిస్తే నన్ను మన్నించండి !" ఆమె పడుకున్న శబ్దమయింది.

నేను కావాలనే జవాబు ఇవ్వలేదు.

కోపమనేది సామాన్యంగా మనిషిని ఎక్కువసేపు ఆవహించలేదు. అందునా అందమైన ఆడపిల్లమీద, మల్లెపూలమీద ... లేదంటే సంపెంగలూ, సన్నజాజులయినాసరే—

అది మొగవాడి బలహీనత అంటే నేను చెప్ప గలిగిందేమీ లేదు !

కళ్లమీద చేతులు పెట్టుకొని ఆమె మీద కోపంతో పడుకున్న నాకు అది అరనిమషం లోనే మంచులా విడిపోవడమే గాకుండా ... అది ఓ బొమ్మలా తయారయి నా ముందు బెడ్డింగ్ మీద నన్ను లాకుతూ ఓ స్త్రీ ఆకారంలో కూర్చున్నది !

ఇంకెవరిది ఆ బొమ్మ – శశిరేఖ !

నా రెండు చేతులూ ఆమె బుజంమీద వేసి ఆమెను గుండెలకు హత్తుకుందామా అన్నట్లుగా దగ్గరకు తీసుకోబోయాను.

ఆమె తన రెండు గులాబీ రంగు పెదాలను సున్నాలా చుట్టేసి 'తప్పు' అని మందలిస్తున్నట్లుగా నా కళ్లలోకి చూడసాగింది.

'చూడండి చంద్రుడెలా తొంగి చూస్తున్నాడో ... నక్షత్రాలు ఫక్కుమని నవ్వటం లేదా ? ... చల్లగాలి మన గుసగుసలను అందరి చెవులలో వూదేస్తే మన పరువేంకాను... ఉహూం...' ఆ మల్లె దండ తన తలను అటూ యిటూ ఊపుతూ, 'మన పెద్దవాళ్ళు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేంతవరకు ఎవరి బెడ్డింగ్‌లు వాళ్ళవే !' అని ఆమె నవ్వుతూంటే ముత్యాలు ఆ పండు వెన్నెల్లో పక్కమీదగా దొర్లి నేల మీదకు జారిపోతుంటే, "అయ్యొయ్యో" అనిగాభరా పడుతూ లేచి కూర్చున్నాను.

"ఇంకా మీకు నిద్రపట్టలేదా ?" ఎదురుగా శశిరేఖ తన బెడ్డింగుమీద లేచి కూర్చుంటూ అన్నది.

ఉలిక్కిపడి కళ్ళు నులుముకున్నాను. దూరంగాఉన్న శశిరేఖ తలమీద పక్కపాపిటిలో చంద్రుడు ఫక్కుమన్నాడు– నాలోని బలహీనతను చూచి నవ్వుతున్నట్లుగా.

"ప డు తు న్న ది ... పడుతున్నదండీ !" అంటూ చటుక్కున దుప్పటి తీసుకొని కప్పేసుకున్నాను–ఆ క్షణాన నా మొఖంలోని రక్తాన్నంతా ఎవ్వరో పీల్చేసినట్లే అనిపించింది !

"మీకు ఈ రాత్రి నిద్ర పట్టదు లేండి !" శశిరేఖ నవ్వుల్ని వెదజల్లుతూంది.

నాలో కోపం కస్సు మన్నది. ఆమె నాలోని బలహీనతనే ట్రంప్ కార్డు చేసుకొని నా మొఖాన కొడుతున్నందుకు !

"ఎందుకని ?"

"నేను ఎమ్. ఎ. సైకాలజీనండీ, సత్యం గారూ !"

మొఖం ముడుచుకు పడుకోవటంతప్ప నేను చేయగలిగిందేమీ లేదు...

ఆమె తన అన్నగారికి రాసిన ఉత్తరంలో భాష మరో సారి కళ్లముందు గిరగిరా తిరగగా ఈ అగ్గి బరాటాతో మాటలు పెంచటం నాకు ప్రమాదమే అనిపించింది...

లేనిపోనిది...ఆడవాళ్లతో మాట...నిప్పుతో చెలగాటం లాంటిది !

శశిరేఖ నవ్వుతునే వున్నది. ఆ నవ్వు గిరికీలు తిరుగుతూ...దుప్పట్లో ముడుచుకు

పడుకున్న నా చెవుల్లోకిగూడా దూరిపోతోంది. ఆమె అలా నవ్వుతుంటే ఆమె బుగ్గల్లో సొట్టలు పడుతున్నాయి. ఆ వేపచెట్టు గాలిలో ముందుకుపడుతున్న ఆమె ముంగురులుగూడా కిలకిలలాడుతున్నట్లే వున్నాయి .. కాని, ఒత్తయిన ఆ మెత్తని జుట్టును చివరలు మడతేసి రబ్బరు బ్యాండ్ వేయకుండా వుంటే చాలా బాగుంటుందనిపించింది— ఈ అందమైన ఆడపిల్లకు జడచివరలు ఎలా వదిలి వేయాలోగూడా తెలయదు... ఆ బొట్టు మాత్రం అమ్మమ్మలా అంతనా... చక్కగా, చిన్నగా ఆమె కట్టుకున్న చీరెరంగు బొట్టు కనబడీ కనబడకుండా పెట్టుకుంటే... శశిరేఖా! ఈ ప్రపంచంలో నీ అందానికి పోటీ లేదోయ్, అమ్మాయీ...

అబ్బ... ఏమిటబ్బా... ఏదో పూలబాణం గుండెల్లో తాకుతున్నదే... నొప్పి... నొప్పి.. నొప్పి... శశిరేఖతల్లీ! కాస్త... ఇంకాస్త దగ్గరిగా జరగరాదూ... గుండెలమీద నీ బంగారు తీగెలతో మంత్రం వెయరాదూ.. నేను భరించలేనోయ్ మేడం... మీ అన్న గారు కలకర్తా పోతూపోతూ, నా గుండెలమీద నిన్ను తెచ్చిపెట్టాడు... కాస్త నన్ను బ్రతికిద్దూ, ప్లీజ్...

నాకీ బ్రాంచ్‌మేనేజర్ పుద్యోగం ఎందుకు? ఈ కొంప ఎందుకు? ఈ ఓం పెప కారు ఎందుకు. . వచ్చిన ఎగా నాన్నయిచ్చిన ఇంత ఆస్తి ఎందుకు?. . ఊహూఁ... ఇప్పుడున్నా నీవులేందే నేను బ్రతకలేను, శశిరేఖా..

ఇక నా బ్రతుకులో ఇంత నూనెపోసి దీపం వెలిగించవలసినదానివి నీవే... నీవే శశిరేఖా ... రేఖా... శశిరేఖా!...

పైపైకి, మేఘాలలోనికి ఎగిరిపోతున్న శశిరేఖను ఒళ్ళోకి లాక్కుందామా అన్నంత ఆవేశంగా లేచికూర్చున్నాను

"అదేమిటి మాష్టారూ! రెండుగంట లవుతుంది. మీరింకా నిద్రపోనేలేదా?" అన్నది ఎదురుగ్గా బెడ్డింగ్‌మీద శశిరేఖ కలవరపడుతున్నట్లుగా తనూ లేచి కూర్చుంటూ.

ఒక్కసారి నా ఊహలన్నీ బెదరిపోగా, ఎవ్వరో పాతాళంలోకి తొక్కివేస్తున్నట్లని పించింది.

'ఛీ! ఛీ!... వెధవబ్రతుకు... చస్తే ఇంకా ఆ అమ్మాయిని తలవకూడదు!' దుప్పటిని రెండు మడతలేసి బిగించాను...

జోరున ఈదురుగాలి కొడుతుంటే ఇక దుప్పటి తీయక తప్పలేదు. తీసిన మరుక్షణం లోనే తీక్షణంగా పైకొచ్చేసిన సూర్యుడు నా కళ్ళల్లో కళ్ళు పెట్టి నన్ను కలవరపెట్టేశాడు.

ఎంతయిందా అని చేతి గడియారం చూసు కుంటే ఎనిమిదిన్నర!

కలవరపాటుతో శశిరేఖ కోసరం పక్కకు చూస్తే—ఖాళీ!

ఛ! ఇంత ఆలశ్యంగానా లేవటం...శశిరేఖ క్రిందకు వెళ్ళి వుంటుందనుకుంటూ నేనూ నా బెడ్డింగ్‌ను తీసుకొని వడివడిగా క్రిందకు వెళ్ళాను.

తలుపు దగ్గరిగా వేసివున్నది. తలుపు తీసు కొని లోపలికి వెళ్ళి బెడ్డింగ్‌ను మంచం మీద పడేశాను. ఆశగా నలువైపులా ఆ బంగారు తీగకోసరం చూస్తే నిరాశే మిగిలింది.

బాత్ రూంలో వున్నదేమో...నీళ్ళచప్పుడు గూడా అవుతుంది.

టేబిల్‌మీద ఇంటితాళం చూచేటప్పటికి— 'అవును' తన తల క్రింద దిండు క్రింద తాళం వెవిన శశిరేఖ తీసుకున్నదన్నమాట!'అనే ఆలో చన నా మీద సంపెంగల మత్తునే వెద జల్లింది.

కాని ఇంతలోనే బాత్‌రూంలో నుండి పని అవ్వ బయటకు వచ్చి నాకేదో చెప్పబోయేటంత లోనే నా దృష్టి ఆ తాళం క్రింద వున్నకాగితం మడతమీద పడింది.

వింతగా దాన్ని చేతిలోకి తీసుకొని మడత విప్పాను—

మాష్టారూ!

ఎందుకు నిద్రలేని రాత్రులతో కృంగి, కృశించి పోతారు? శుభ్రంగా మీకు నచ్చిన ఓ అమ్మాయికి మూడు ముళ్ళూ వేయండి!

రాత్రి మీ రిచ్చిన ఆతిధ్యానికి కృతజ్ఞురాలిని. మీరు నిద్ర లేచిందాకావుంటే నా ఇంటర్వ్యూ గంగలో కలిసి పోతుంది.

—శశిరేఖ."

పి. ఎస్ : ఈ క్రిందదే నా చిరునామా...

ఆ ఉత్తరం చదివినతరవాత శశిరేఖ తన చిరునామాను నాకెందుకిచ్చిందో అర్ధంగాక ఆ రాత్రంతా నిద్రపోలేదు. తరువాత తెల్లవారు ఝామునకు ఎప్పటికో ఆ కారణం అర్ధమవ్వగా మరునాడు రాత్రంతాగూడా నిద్ర పట్ట లేదు!



ఎప్పుడొచ్చాడో కానీ కళ్లు తెరిచేసరికీ ఎదురుగా కుర్చీలో కూర్చుని ఏదో పత్రిక తిరగేస్తున్నాడు వాసు.

'ఎంత సేపయింది వచ్చి ?' లేచి కూర్చుంటూ అడిగాను.

'ఇప్పుడే ! అయినా నాలుగున్నరయింది. ఇంకా నిద్రేమిటి ?'

లాస్టవర్ క్లాస్‌లేదు. మూడు గంటలకే రూంకొచ్చా. అలసటగా వుంటే అలా పడుకుని కళ్లు మూసుకున్నా. నాకు తెలియకుండానే నిద్ర పట్టేసింది. స్నానంచేసి వస్తా. అంత వరకూ రేడియో వింటూండు.' టవల్ తీసుకుని లేచాను.

'వస్తూనే రేడియో ట్యూన్ చేసిచూసా. కరెంట్ లేదు కానీ త్వరగా తెములు.'

'ఏమిటి సంగతి ? ఏదైనా ప్రోగ్రామా?'

'సినిమా కెళ్దాం పద. మధ్యాహ్నం నుండీ తోచక ఛస్తున్నా' చూస్తున్న పత్రిక మూసి టేబిల్‌మీద పడేస్తూ అన్నాడు వాసు.

'ఇంకా నాలుగున్నరేగా అయింది. అంత తొందరెందుకు ?' స్నానానికని లేచావే కానీ బద్ధకం యింకా వదల్లేదు. కాసేపు కూర్చో వాలనుంది.

'బాగా ఆకలేస్తూంది. దార్లో టిఫిన్‌చేసి వెళ్లేసరికీ ఎలాగూ టైమవుతుంది కానీ నువ్వు త్వరగా తయారవు.'

స్నానానికి వెంటనే వెళ్లక తప్పలేదు.

రూమ్ తాళంవేసి బయలుదేరేసరికి ఐదు గంటలయింది.

సర్వర్ చదివే దండకం వినే ఓపిక, అంతకుమించి టైము లేకపోవడంతో కావలసిన వేవో మేమే ఆర్డరిచ్చాము.

బిల్లు చెల్లించి చిల్లరకోసం చేయిచాస్తే క్యాషియర్ వక్క పొట్లం యిచ్చి 'రెండు పైసలు చిల్లర లేదుసార్, అందుకని...' అంటూ నసిగాడు.

'వ్యాపార లక్షణమే !' అని నవ్వుకుంటూ వచ్చేసాము

* * *

థియేటర్ చేరేసరికి ఐదూ పదినిమిషా లయింది. అప్పటికే 'క్యూలో' పదిమంది దాకా వున్నారు. చూస్తుండగానే మా వెనుక'క్యూ' పెరిగిపోయింది. బుకింగ్ తెరవడానికింకా చాల టైముంది. థియేటర్‌దగ్గర రద్దీ నిదానంగా పెరుగుతూంది.

సినిమా వచ్చి రెండు వారాలయిందేమో. ఆరు గంటలు కాకుండానే చాలరష్‌గా వుంది. ఇంకా మ్యాటనీ వదలినట్లు లేదు. సైకిల్ స్టాండ్‌లో చాల సైకిళ్లు వరుసగా పెరేడ్‌లో సైనికుల్లానుంచునున్నాయి. వాటికిఎదురుగా పది, పన్నెండు స్కూటర్లు, మూడు నాలుగు మోటార్ సైకిళ్లు సైనికాధికారుల్లా దర్పంగా నుంచునున్నాయి. ఒకే ఒక్క కారు వీటన్నింటికీ కాస్త దూరంగా, పోర్టికోలో వందనాలందుకోడానికి వేంచేసిన మంత్రి గారిలా గర్వంగా, ఠీవిగా నుంచునుంది.

గేట్ ప్రక్కనున్న వేరుసెనగకాయల బండిలో కుంపటి ఎర్రగా మండి పోతూంది. అయినా సరే ఆ కుర్రవాడు అలవాటుగా కుంపటిని విసనక్రతో శక్తికొద్దీ విసురుతూ ఉత్సాహంగా కేకలు వేస్తూ, మధ్య మధ్యన వేరుసెనగ కాయలగురించి రాగయుక్తంగా పాడుతూ అమ్ముతున్నాడు. ఆ సందడికి ఎవరైనా సరే తమకు తెలియకుండానే ఆ వైపోసారి చూస్తారు.

ఆ కుర్రవాడి అంతసందడీ కూడ క్యాంటిన్‌గోల ముందు సూర్యుడు ముందు దివిటీలా వెలవెల బోతూంది. క్యాంటిన్ మహా రద్దీగా, గందరగోళంగా వుంది. వేరుసెనగ కాయలబండీ మీదుగా చూస్తే, కుంపటి లోంచి వచ్చే అతిపలచని పొగమూలంగా క్యాంటీన్ గోడమీది పటంలోని లక్ష్మిదేవి నృత్యం చేస్తున్నట్లుగా వింతగా కదులు తూంది. కౌంటర్‌ముందు పకపక డబ్బులు తీసుకుని అంతకంటే వేగంగా 'కూపన్స్' చించియిస్తున్న ఆ వ్యక్తి అదేదో డబ్బులు తీసుకుని పేపర్లు కత్తిరించి యిస్తున్న యంత్రంలా వున్నాడు.

క్యాంటీన్ పక్కనె వున్న 'అద్దాల కూల్ డ్రింక్‌షాప్' అందంగా, సుచ్ఛటగా థర్డ్ క్లాస్ భోగి పక్కనే తగిలించిన 'ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్'లా వుంది

బుకింగ్ ఆఫీసుకు ఆనుకునివున్న గోడకు ట్యూబ్‌లైట్ వెలుగులో వెలిగిపోతున్న 'స్టిల్ ఫొటోగ్రాఫ్స్'ను విరగబడి చూస్తున్నారు కొందరు.

అక్కడ, ఆ'క్యూ'లోపదినిమిషాలునుంచునే

సరికీ విసుగేసింది. సిగరెట్ తాగాలనిపించింది. వాసును 'క్యూ'లోనే నుంచోమనిచెప్పి నేను పక్కకొచ్చేను. సిగరెట్ కాల్చి నింపాదిగా తిరిగొచ్చేసరికి ఉమ వాసుతో మాట్లాడుతూ కనిపించింది చూస్తూనే "విష్" చేసింది.

ఉమ వాసు చెల్లెలు సరోజ క్లాస్‌మేట్! నేను తరచూ వాసు యింటికి వెళ్తుంటాను. కాబట్టి అక్కడ పరిచయమయింది. వాసు దేన్ని గురించో చాల సీరియస్‌గా చెప్తున్నాడు. ఆమె కూడ ఆసక్తిగా వింటూంది. వాడంతే! దేన్నయినాసరే నగిషీలు చెక్కి, ఆసక్తికరంగా చెప్తాడు. ఎదుటి వాళ్లను బాగా ఇంప్రెస్ చేయగలడు.

టైమ్ ఐదున్నరయింది. బుకింగ్ తెరవడానికింకా అరగంట వుంది.

అప్పుడు వేరుసెనగ కాయలబండి పక్కగా నడుస్తూ కనిపించాడు ఓ ముసలివాడు. ఆ పూర్తిగా వంగిపోయిన నడుమును చూస్తే అతన్ని కష్టాలు బలవంతంగా వంచి బ్రతుకు పొడవునా నడుం మీద స్వారీ చేసాయనీ, వయసులో వున్నపుడుకూడ వాడు నిటారుగా నడవలేదనీ తెలుస్తుంది. వాడు రోగంచేత, ఆకలిచేత, నీరసంచేత విపరీతంగా వణకిపోతున్నాడు. వానినల్లని చర్మం కండలన్నీ కరగిపోగా ఎముకలను మాత్రం కప్పుతూండటం చేత ఎండుచెట్టు కొమ్మలమీద ఆరేసిన చింకి పాతలావుంది. వాని జుట్టుకు 'మాసె' అనే పదార్థం ఒకటుందని తెలుసుకోడానికైనా ఎప్పుడూ అవకాశం, ఆస్కారం లేకపోవడంతో అట్టలు కట్టుకుపోయింది. వానిముఖం వచ్చీరాని శిల్పి ఉలి ప్రతిదెబ్బకూ చీలిపోయే అతి తక్కువ రకం చెక్కతో చేసినట్లు అస్తవ్యస్తంగా, వంకరటింకరగా వుంది.

వానికళ్లు ఆ గుంటల్లో మునిగిపోవడానికి సిద్ధంగా వున్నట్లున్నాయి. ఆ ముఖం అసహ్యంగా వుంది. నోట్లోంచి కారిన చొంగ బాగా పెరిగిన వాని గడ్డంమీద తీగలు సాగి మరింత అసహ్యంగా వుంది. వాని కడుపు పీక్కుపోయి ఎండిపోయిన చెట్టు తొర్రలా వుంది. వంకరలు తిరిగిపోయిన వూతకర్ర, ఆ కర్రను పట్టుకున్న ఆ చేయీ, రెండు ఎండు కర్రల్ని ఒక దాని చివర్న ఒకటి కట్టినట్లుగా వున్నాయి. వాడికాళ్లు ఆగి ఆగి నడుస్తున్న కాలిపోయిన కట్టెల్లా వున్నాయి.

వాడు తొడుక్కున్న నిక్కరు చివర్లు చినిగి దారాలు వేలాడుతున్నాయి. మరో చేతిలోని లెక్కలేనన్ని నొక్కులూ, చిల్లులూ పడిన ఆ అల్యూమినియం గిన్నె వాడు అడుక్కోడానికీ, అడుక్కున్నదాంతో అంతో యింతో టీ నీళ్లు పోయించుకుని, చిల్లుల్లో సగం పైగా కారిపోగా మిగిలింది తాగడానికీ మినహాయిస్తే చెత్తకుండీలో పారేయ్యడానికి మాత్రమే పనికొస్తుంది.

వాడు 'క్యూ' వైపు నిదానంగా నడుస్తున్నాడు.

వాడు 'క్యూ' చివర్న నిల్చున్న నల్లసూటాయనవద్ద ఆగి అల్యూమినియం గిన్నె ముందుకు చాచాడు. వాడికళ్లు ఆశగా చూస్తున్నాయి. నల్లసూటాయన విసుగ్గా ఓ మారుచూసి తల తిప్పుకున్నాడు. వాడు రెండు క్షణాలాగి ముందుకు కదిలాడు.

"మీ అమ్మ నన్ను అవమానపరిచారు. తెలుసా!" అని కన్నీరుపెట్టింది రామారావు భార్య.

"ఆవిడ ఇక్కడ లేదుగా?" అని అడిగాడు రా. రా. అయోమయంగా.

"అదే — మీకు ఉత్తరం రాశారు. చివరి వాక్యంలో, 'ఈ ఉత్తరాన్ని అబ్బాయికివ్వటం మరిచిపోకె.' అని రాశారావిడ!" రామారావు భార్య కన్నీరు మున్నీరయింది...

'రాడాన్' కళ్లజోడు వెనకాలి కళ్లు చీత్కారంగా చూసి ముందుకు కదలమన్నాయి.

నోట్ల కట్టతో, చిల్లరతో భారంగావున్న జేబుకల శిల్కులాల్చీ ముసలివాణ్ణి తప్పుకుని అటు కదిలింది.

'రోలెక్స్' వాచీ కట్టుకున్న చేయి వాణ్ణి ముందుకు కదలమని సైగచేసినపుడు సాయంకాలపు నీరెండలో తళుక్కుమంది.

ముసలివాడు ముందుకు కదిలాడు!

నిగనిగలాడుతున్న కొత్తబూట్ల పక్కనే దుమ్ముకొట్టుకున్న ముసలివానికాళ్లు ఆగాయి. వెంటనే కొత్తబూట్లు శబ్దం చేసుకుంటూ కోపంగా వెళ్లిపోయాయి.

ముసలివాడు నీరసంగా కదిలాడు.

నా వెనక నుంచున్నాయన పక్కనాగింది వంకరకర్ర. వెనకాలివ్యక్తి జేబులోకి చేయి పోనిచ్చాడు. ముసలివాడు ఆశగా చూస్తున్నాడు. ఐదురూపాయల కాగితం, మరో రూపాయనోటూ తీసి 'చిల్లర లేద'న్నాడు.

ముసలివాడు నిరాశగా నావైపు కదిలాడు.

అల్యూమినియం గిన్నె నావైపు మళ్లింది. మౌనంగా అటువైపు తిరిగి నుంచున్నా.

ముసలివాడు నెమ్మదిగా ముందుకు కదిలాడు.

వాసు, ఉమలవద్ద ఓ క్షణంఆగి లాభం లేదని తెలుసుకుని అక్కడేవున్న దంపతుల వైపు వెళ్లాడు. తల్లి చంకలోని కుర్రవాడు ఏదో తింటున్నాడు. ముసలివాడు సమీపిస్తూనే తల్లి అటువైపు తిరిగింది. కుర్రవాడు తింటున్నది కాస్త తుంచి దూరంగా విసిరేసింది దిష్టి దోషం తగలకూడదని.

ముసలివాడు కదలలేక కదిలాడు.

'త్రిబుల్ ఫైవ్' సిగరెట్ ముందు ఆగాడు! సిగరెట్ కన్నెర్రజేసి ముందుకు కదిలింది...!!

ముసలివాడు ముందుకు కదిలాడు. ఆగాడు. వాడు నిరాశగా ముందుకు కదిలాడు. ఆగాడు. కదలలేక ముందుకు కదిలాడు. ఆగాడు. నీరసంగా ముందుకు కదిలాడు.

ముసలివాడు వెనక్కుతిరిగి అడుగులు వేస్తున్నాడు. కాళ్లు భూమిలోకి కూరుకుపోయినట్లు అతినెమ్మదిగా, నడవలేక నడుస్తున్నాడు. ఊతకర్ర రాతికి తగిలి ముందుకు తూలాడు అల్యూమినియం గిన్నె జారిపడింది. అతి ప్రయత్నంమీద కూర్చుని గిన్నెను వణకుతున్న చేతులతో తీసుకున్నాడు కాని లేవలేకపోయాడు. కూర్చునే నిదానంగా జరుక్కుంటూ తన స్థలం చేరి చతికిలబడ్డాడు.

బిక్షగాళ్లు దేశ పురోగమనానికి ఎలా సంకెళ్లు వేస్తున్నారన్నది వాసు చాల చక్కగా వివరిస్తున్నట్లుంది. ఉమ చాల సిన్సియర్‌గా వింటూంది. నాకవన్నీ వినాలనిలేదు. అరవడానికింకా పదినిమిషాలుంది.

అప్పుడు...

రాగాలాపన వినిపించింది సన్నగా. థియేటర్‌లోంచే ననుకున్నాను. కానీ కాదు. ఆలాపన పూర్తయి పాట మొదలయింది. చాలసార్లు విన్నకంఠం వెనక్కుతిరిగి చూసాను.

అతను...అతనే!

అతణ్ణి మునుపు చాలసార్లు థియేటర్ల వద్ద, బస్ స్టాపుల వద్ద చూసాను. రెండు మూడుసార్లు మా కాలేజీలోకూడ చూసాను.

అతను సన్నగా కనిపిస్తున్నా ఆరోగ్యంగా వున్నాడు. కాస్త నలిగిన తెల్లప్యాంట్, చారల చొక్కా వేసుకున్నాడు. చెదరిన జుట్టు, క్రా... మాసినగడ్డం తెల్లని ముఖానికి చక్కగా

అమరి మరింత అందంగా కనిపిస్తున్నాడు. ఆ కళ్ళు వింతగా మెరుస్తున్నాయి. పట్టు దలగా చూస్తున్నాయి. పాటకు అనుగుణంగా కదుల్తున్నాయి. హవాయ్ చెప్పులు వేసుకు న్నాడు. అతనికిషేవ్ చేయించి, తలదువ్వించి, సూట్ వేయిస్తే అచ్చంగా సినిమాలో ఆడుతూ, పాడుతూ బాధ్యత తెలియకుండా, అల్లరిగా తిరిగే కథానాయకుడిలా వుంటాడు. అప్పుడు మాత్రం కష్టాల్లో వున్న కథానాయ కుడు ఉద్యోగం కోసం వెదుక్కుంటూ పాట పాడుకుంటున్నట్లుగా వున్నాడు. అతనికంఠం అతిమధురంగా లేదు. చాల సామాన్యంగా వుంది అతడు తన్మయుడై పోవటం లేదు. అదేదోతన విధిలా, దినచర్యలా పాడుతున్నాడు.

ఉమ అతణ్ణి చూస్తూనే–

'అరె! వీళ్ళమ్మకు కడుపు నొప్పెలా వుందో? ఈయనిక్కడ పాటలు పాడు తున్నాడే!' అంది ఆశ్చర్యంగా.

బలవంతంగా నవ్వాపుకుని 'సంగతేమిట'ని అడిగాను.

'ఉదయం క్లాస్ జరుగుతూంటే అతను మధ్యలో వచ్చి లెక్చరర్ పర్మిషన్ తీసుకుని తనతల్లికి కడుపునొప్పి చాలరోజులుగావుందనీ, ఈ మధ్య బాగా ఎక్కువయిందనీ, హాస్పిటల్లో చేర్పిస్తే ఆపరేషన్ చెయ్యా లన్నారనీ, అందుకు వంద రూపాయలవు తుందనీ, తను పి. యు. సి. పాసయి ఉద్యోగం కోసం చూస్తున్నాడనీ బంధువులూ, మిత్రులూ ఎవ్వరూ తమ నాదుకునే స్థితిలో లేరనీ దీనాతిదీనంగా తనగోడు వెళ్ళబుచ్చు

కున్నాడు. మేమంతా క్లాసులో సుమారు ఇరవై రూపాయలు వసూలుచేసి యిచ్చాము'

ఉమ చెప్పింది విని విరగబడి నవ్వాడు వాసు. నేను అతి కష్టంమీద నవ్వాపుకున్నాను.

ఉమ చిన్నబుచ్చుకోవడంతో వాసు నవ్వడం ఆపి చెప్పాడు.

'బహుశ యింతకుముందు మీరితన్నిచూసి వుండరు. అందుకే అంత సులభంగా చెప్పిందంతా నమ్మేసారు ఇతను చక్కగా పాడటమే కాక, అంతకంటె చక్కగా నటించ గలడు. ఇదే ఇతని జీవనోపాధి. తల్లికి జ్వరమనో, తండ్రికి పక్షవాతమనో, తమ్మునికి యాక్సిడెంటయిందనో, భార్యప్రసవించిందనో, ఒకోసారి తనే పరీక్ష ఫీజు కట్టాలనీ, ఆ రోజే ఆఖరిరోజనీ, తను చాల బీదవాడనీ, వూరి నుండి డబ్బులు తీసుకొస్తుంటే ఎవరో డబ్బు కొట్టేసారనీ, బంధువులూ, తెలిసిన వాళ్ళెవరూ ఆ వూర్లో లేరనీ, ఫ్రెండ్స్ కొంతవరకూ సహాయం చేసారనీ ఇలా అప్పటి కప్పుడు కట్టుకథలల్లి వాటిని చక్కగా నటించి వీలైనంతవరకూ డబ్బు చేసుకుంటాడు. అప్పుడప్పుడు ఇలా థియేటర్లవద్ద, బస్స్టాపుల వద్ద పాటలుపాడి, డ్యాన్సులుచేసి కొంతవరకూ సంపాదిస్తాడు.

నేనుకూడ మొదటిసారి ఇతణ్ణి చూసి నపుడు మీలాగే మోసపోయా.

ఆ రోజు సినిమా థియేటర్ వద్ద కనిపించాడు. ఫస్ట్ షోకనివెళ్ళా. జేబులో మూడు రూపాయలు మాత్రం వుంది. అప్పటికే బయటెవరూ జనంలేరు టికెట్ తీసుకోబోతూండగా ఇతనొచ్చాడు. చాల వినయంగా పిలిచి, అంతకంటె దీనంగా 'సార్! నా భార్య ప్రసవించి రెండు రోజు లయింది. రెండు రోజుల్నుండీ బిడ్డ తల్లి పస్తుంది. నేను బియ్యే పాసయ్యాను. బియ్యే చదువుతూండగా యిద్దరం ప్రేమించి పెళ్లి చేసుకున్నాము. మా పెద్దలు, ఆ అమ్మాయి పెద్దలూ కూడ మా పెళ్లికి ఒప్పుకోలేదు. కానీ మేమే స్వతంత్రించి పెళ్లి చేసుకున్నాము. డిగ్రీ చేతికొస్తూనే ఏదో ఒకవుద్యోగం దొరక్క పోదా, నా భార్యను నేను పోషించుకోలేనా అని ఆరోజు ధైర్యంగా ముందడుగేసా! సంవత్సరం నుండి కాళ్లరిగేలా తిరుగుతున్నా కనీసం ప్యూన్ పనయినా దొరకలేదు. అప్పుడప్పుడు దొరికే చిన్నచిన్న కూలిపనులతోనే కాలం గడుపుకొస్తున్నాను. చివరకిలా అడుక్కో వాల్సి వస్తుందని కలలో కూడ అనుకోలేదు' అంటూ తన కథను హృదయవిదారకంగా వివరించి కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. నాకా క్షణం వాళ్ల పెద్దల్ని నరికెయ్యాలన్నంత కోపం వచ్చింది. మనసారా అభినందించాను. ధైర్యం చెప్పాను. సినిమాకు వెళ్ళడం మాను కుని ఆ మూడ్రూపాయలూ ఇతనికిచ్చేసి మంచి పనిచేసానన్న తృప్తితో యింటికెళ్ళాను.

తర్వాత సెకండ్‌షోకు వెళ్లినపుడు ఇతను ఫస్ట్‌షో చూసి రిజర్వుడ్ 'క్లాస్' లోంచి బయ టకు రావడంచూసి బిత్తరపోయాను. ఆ తర్వాత ఇతని గురించి నా ఫ్రెండ్స్ చాల చెప్పారు. ఇతనిగురించి తెలియనివారెవ రైనా సరే ఇతనుచెప్పే విషయాలు తప్పని సరిగా నమ్మాల్సిందే!

ఉమ ఆశ్చర్యంతో అతణ్నే చూస్తూ వుండిపోయింది.


పాట సాగిపోతూంది. అందరూ ఆసక్తిగా కాకపోయినా మొత్తానికి వింటున్నారు. పాట పూర్తయింది.

అతను నల్లసూటాయన వద్ద ఆగి చేయి చాపాడు. అతని కళ్ళు ఆశగా చూడటంలేదు. ఆ చూపుల్లో అభ్యర్థనకంటె 'ఇవ్వకేం చేస్తార'న్న ధీమానే ఎక్కువవుంది.

నల్లసూటాయన కళ్లెత్తి పావలా నాణెం చేతిలోవేసి ఒక్క క్షణం ఆగి మళ్లీ పది పైసలు వేసాడు

అతను వెంటనే ముందుకు కదిలాడు.





దీక్షాత్రయం

బులుసు వెంకటరమణయ్య

నియమాన్ని అతిక్రమించకుండా ఒక కార్యాన్ని ముగించే వరకూ పట్టుదలతో పని చెయ్యడం సందర్భంలో 'దీక్ష' అనే మాటను ఉపయోగిస్తారు 'ఈ పనిని పూర్తి చేస్తాను' అనే పట్టుదలను 'కంకణం కట్టుకోవడం'అని కూడా అంటారు. వివాహం, ఉపనయనం మొదలైనవి జరిగేటప్పుడు ఆ కార్యాలలో ప్రధానపాత్రవారు కంకణ ధారణ చెయ్యడం అందరూ ఎరిగినదే! ఈ విధంగా ఏకాగ్రంగా నియమపాలన దీక్ష అనిపించుకుంటున్నది.

కంకణ బంధనం స్వతంత్రించి ఎవరి మట్టుకువారు చేసుకునేది కాదు. గురువు మంత్రపూర్వకంగా దానిని చేయించవలసి ఉంటుంది. గురుని ఆదేశం లేకుండా దీక్ష స్వీకరించడం సాధ్యంకాదు. మంత్రాలు గురుముఖతః ఉపదేశం పొందితేనే గాని ఫలించని విషయం అందరికీ తెలుసు పాము మంత్రం, తేలు మంత్రం మొదలైనవి దీనికి ఉదాహరణములు.

గురువు దీక్ష ఇవ్వడమంటే ఉపదేశం చెయ్యడం అన్నమాట. ఈ దీక్ష మూడు విధాలు— (1) దృగ్దీక్ష, (2) వాగ్దీక్ష, (3) స్పర్శాదీక్ష.

దృగ్దీక్ష కేవలం చూపునకు సంబంధించి ఉంటుంది గురువు శిష్యుడికి ఉపదేశం చేసి, 'ఈ శిష్యుడు బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందుగాక!' అని మనస్సులోనే దీవిస్తూ ఆ శిష్యుని ఎక్కువ ఆప్యాయంతో చూడడమే దృగ్దీక్ష. చేప గుడ్లు పెడుతుందిగాని, వాటిని పొదగదు. గుడ్లు పెట్టాక వాటిని ఆప్యాయంగా చూస్తుంది. చూచినమాత్రాన కొంతకాలానికి ఆ గుడ్లు పిల్లలవుతాయి. గురుని దృగ్దీక్ష కూడా ఇటువంటిదే!

రెండవదైన వాగ్దీక్ష భ్రమరకీట న్యాయ రీతిని అనుసరించినది తుమ్మెద ఒక పురుగును తీసుకుని వచ్చి, తన గూటిలో ఉంచుతూ, దాని చెవిలో ఎడతెగకుండా ఝంకారధ్వనులు చేస్తూ, దాన్ని తన వలె మార్చివేస్తుంది ఈ విధంగా పురుగు భ్రమరమై పోతుంది. అట్లే గురువు శిష్యునికి బోధ చేసిచేసి అతనిని తన మాదిరిగా తయారు చేస్తాడు. ఈ ఉపదేశం దీక్షతో కూడింది వాక్కునకు సంబంధించినది కావడంవల్ల ఇది వాగ్దీక్ష అయింది.

మూడవది స్పర్శాదీక్ష ఇది స్పర్శకు సంబంధించినది. పక్షులు గుడ్లు పెట్టిన తర్వాత వాటిని రెక్కలతో కప్పి, కూర్చుంటాయి. ఇదే గుడ్లు పొదగడం అంటారు. కొన్నాళ్ళకు ఆ గుడ్లు పిల్లలవుతాయి. స్పర్శ వల్లనే ఈ పని జరుగుతున్నది. ఆ మాదిరిగానే శిష్యుణ్ణి అనుగ్రహించడానికి గురువు అతనిని తాకుతాడు. గురుని హస్తస్పర్శవల్ల విజ్ఞానం పొంది శిష్యుడు గురువంతటివాడు కాగలడు.

ఈ దీక్షలు బ్రహ్మసాక్షాత్కారానికి ఎంతో అవసరమైనవి.

కళ్ళజోడు వెనకాలి కళ్ళు చిత్రంగా చూసి చిల్లర యిచ్చింతర్వాతే ముందుకు కదలమన్నాయి.

అతను శిల్కు లాల్చీని దాటిం తర్వాత లాల్చీ జేబు చిల్లర భారం కొంత తగ్గినందుకు సంతోషించింది.

'రోలెక్స్' వాచీ పట్టుకున్నచేయి అర్ధరూపాయ నాణెం అందించినపుడు వాచీ తళుక్కు మనలేదు కానీ నాణెం తళుక్కుమంది.

అతను ముందుకు కదిలాడు.

నిగనిగలాడుతున్న కొత్త బూట్ల పక్కన హవాయి స్లిప్పర్స్ ఒక్కక్షణమాగి మరింత చిల్లర బరువుతో టకటక కదిలాయి.

అతను ఉత్సాహంగా కదిలాడు.

నా వెనుకనున్నాయన ఐదు రూపాయల కాగితం, రూపాయ కాగితం తీసి ఒక్కక్షణం తటపటాయించి రూపాయ నోటు అందించాడు.

అతను ఆనందంగా నా వైపు కదిలాడు.

అతనిచేయి నా వైపు తిరిగింది. అర్ధ

మనిషి

రూపాయ అందించాను

అతను నింపాదిగా ముందుకు కదిలాడు.

నాకు రూపాయ నోటిచ్చాడు. ఆమె కొంత చిల్లర యిచ్చింది. అతను దంపతుల వైపు చూచాడు. తండ్రి కొంత చిల్లర యిచ్చాడు. కుర్రవాడు తనూ యిస్తానని మారాం చేశాడు. తల్లి ముచ్చటపడి పిల్లవాడి చేత మరో పావలా యిప్పించింది.

అతను సంతోషంగా కదిలాడు.

'త్రిబుల్ ఫైవ్' సిగరెట్ ముందు ఆగాడు. సిగరెట్ కన్నెర్రచేయలేదు. నవ్వి కొంతచిల్లర యిచ్చింది.

అతను ముందుకు కదిలాడు. ఆగాడు. ఆనందంగా ముందుకు కదిలాడు. ఆగాడు. సంతోషంగా ముందుకు కదిలాడు. ఆగాడు. ఉత్సాహంగా ముందుకు కదిలాడు. అతని పిడికిలి నిండింది.

వెనక్కు తిరిగి క్యాంటీన్ వైపు నడుస్తున్న వాడల్లా ముసలివాణ్ణి చూసి ఆగాడు. ఆగి 'ఏం తాతా! ఏమాత్రం ఈ రోజు సంపాదిస' అని అడిగాడు.

ముసలివాడు ఏమీ మాట్లాడకపోయినా ఖాళీ గిన్నె సమాధానం చెప్పింది.

'ఏపాటి సంపాదించావులే, ఈ రోజు ప్రత్యేకంగా అడగడానికి' అనటంలో హేళనతో కూడిన సానుభూతి ప్రతిధ్వనించింది.

ముసలివాడు ఏమో గొణుక్కుంటున్నాడు!

అతను గుప్పిలితెరిచి అర్ధరూపాయ నాణెం ముసలివాని అల్యూమినియం గిన్నెలోకి విసిరేసి చకచక క్యాంటీన్లోకి వెళ్ళిపోయాడు. నాణెం గిన్నెలోపడి వింత శబ్దం చేసింది. ముసలివాడి కళ్ళు కృతజ్ఞతతో మెరిసాయి.

ఆ క్షణం అక్కడున్న అందరిలో కలిగిన సంచలనాన్ని చూడాలని అనిపించినా, 'గిల్టీ'గా ఫీలయి తల ఎత్తలేక ఓరకంట ముసలివాణ్ణి చూశాను. వాడు నా వైపే చూస్తున్నాడు. ఆ చూపులోని హేళన నేను జన్మ జన్మలకు మరచిపోలేను. అది నన్నింకా వెంటాడుతూనే వుంది!

డాక్టర్ సలహాలు!

డా|| కె. వెంకటేశ్వరరావు

బి. వెంకటరెడ్డి—పుప్పాంపల్లి

మా తండ్రిగారి వయస్సు 45 సం. లు మూడు సం|| క్రితం తొడలో ఎక్కువగా వాపు, నెప్పి వచ్చి ఆపరేషన్ చేసి చీము తీసివేసినారు. గాయము మానింది అయినా ఇంకనూ కొంచెం నెప్పి కూడా వున్నది.

★ తొడలోని ఎముకకు చీము పట్టడం వల్ల ఇలా జరిగింది. దీనిని 'ఆస్టియో మైలైటిస్' అంటారు. చీము మాత్రం తీసివేస్తే ప్రయోజనం లేదు. ఎముకలో చెడిపోయిన భాగం కూడా తీసివెయ్యాల్సి వుంటుంది. దీనిని "సెక్వెస్ట్రెక్టమీ" అంటారు. నిపుణులైన ఆర్థోపెడిక్ వైద్యులకు చూపించి తగిన వైద్యం చేయించండి. తప్పక నయమవుతుంది.

ఆర్. రామమోహనరావు—విశాఖపట్నం

నా కుమార్తెకు విరేచనాలు అవుతూవుంటే ఆస్పత్రిలో చేర్పాము. కుడి కాలులోని నరముద్వారా గ్లూకోసు నీళ్ళు ఇచ్చారు. తర్వాత కాళ్ళలో కురుపులు వస్తే 'గాంగ్రీన్' అని చెప్పి కాలు— కండవరకు తీసివేశారు. ఈ గాంగ్రీన్ ఎలా వచ్చింది?

★ విరేచనాలు అయినప్పుడు రక్తనాళములలోని నెత్తురులో నీరు తగ్గుటచే ముకులించుకొని వుంటాయి. నెత్తురు మామూలుకన్నా చాలా చిక్కగా వుంటుంది. ఈ చిక్కబడటం ఎక్కువ అయినప్పుడు రక్తనాళములలో అడ్డుపడి గట్టిపడటానికి అవకాశం ఎక్కువ. ఇలా జరిగినప్పుడు ఆ రక్తనాళము సరఫరా చేసే భాగమునకు రక్తము చేరక కుళ్ళటమే— గాంగ్రీన్ అంటే!

సి. హెచ్. కృష్ణారెడ్డి—గిలాపాని

మా బాబు వయస్సు 10 నెలలు. 5వ నెల నుంచి అప్పుడప్పుడూ చర్మం మీద ఎర్రని దద్దుర్లు వచ్చి రెండు మూడు రోజులు వుంటున్నాయి. 'అవిల్, సిరప్' వాడాము. ఫలితం లేదు.

★ పడుకోపెట్టేటప్పుడు దోమతెర వేయటం అలవాటు చేసుకోండి. మల పరీక్ష చేయించండి. వీటివల్ల ఏమీ ఫలితం లేకపోతే పాలు మార్చిచూడండి ప్రతిరోజూ రెండు పూటల్లా 2 అవున్సులు బత్తాయి రసం పట్టండి. ఆహారంలో ఎక్కువగా నీరు ఇవ్వటం అవసరం. 'ఆల్కలైన్ సిట్రేట్' రోజుకి మూడు పూటలా అరచెంచాడు ఇవ్వండి.

బి. సుశీల—అవనిగడ్డ

3 సం. ల క్రితం పెదవి మీద నీటి పొక్కులు లాగా లేచి దురదగా వుండేవి. అవి పగిలి నల్లని మచ్చలు ఏర్పడ్డాయి. ఇప్పటికీ దురద వున్నది.

★ పెదవి మీద "సిల్వర్నైట్రేట్— వయాఫాం" ఆయింట్‌మెంట్ రాయండి. లేదా ఎల్ఫా— సాలిసిలిక్ ఆసిడ్‌లతో తయారు చేసిన (చేయించిన) ఆయింట్‌మెంట్ వాడండి.

రాత్రికి 'గ్రైసోఫల్— ఎఫ్. పి' మాత్రలు రోజుకి ఒక ఎంతున 10 రోజులు వాడితే గుణం కనిపిస్తుంది.

పి. అన్నపూర్ణ—గూడూరు


నా వయస్సు 18 సం. లు 1 సం. క్రిందట నాకు కాళ్ళకు చేతులకు కురుపులు వచ్చిన 40 ఇంజక్షన్లు, మాత్రలు నాటు మందులు వాడాము ఇప్పటికీ కళ్ళని గుళ్ళలు దురదలు వున్నవి.

★ సాలిసిలిక్ ఏసిడ్ 5%, సల్ఫర్ 5%, [illegible] % కలిపి ఆయింట్‌మెంట్ [illegible] తయారు చేయించి [illegible] రెండు పూటలా రాయండి. అప్పుడు నెమ్మదిస్తాయి.

వి. శివాపూర్ణరావు [illegible]

[illegible] ఉత్సాహికజీవితా నికి [illegible] కాదవా?

★ వ్యాయామానికి, [illegible] జీవితానికి [illegible] [illegible] ఫలితాలు [illegible] [illegible]





మనోవేదన భరించలేక...!

ఆర్కాటుకు చెందిన 45 ఏళ్ల దేవన్ భార్య 34 ఏళ్ల రాణిఅమ్మకు కొన్నాళ్లుగా కుష్ఠువ్యాధి సోకి, రానురానూ అది ఎక్కువవుతూ వచ్చిందట. ఆమెతన అయిదేళ్లకూతురు శాంతితోను, మూడేళ్ల కొడుకు కుమారుతోనూ కలిసి వుంటూ వారికి వండిపెట్టడం వంటి పనులు చేయనీల్లేదని ఆ వ్యాధి పిల్లలకు కూడా సోకుతుందని ఆమె భర్త కేకలు వేస్తుండేవాడట. ఈ మనోవ్యథను భరించలేక, రాణి అమ్మ ఇద్దరు పిల్లలను తీసుకుని "చిన్నతక్కవె," అనే వూరువెళ్లి వూరుచివరున్న బావిలో పిల్లలను పడేసి, ఆనక తానూ దూకేసిందట. ఆ మర్నాడు మూడు శవాలూ నూతిలో తేలాయట.

అచ్చిరాని కార్డు !

పోస్టుకార్డు వ్యాపారం (ఒట్టోడా కూడానా) మూలకంగా కేంద్ర ప్రభుత్వానికి ఒకానొక (ఏటికి) రోజుల్లో ఆరుకోట్ల రూపాయలు నష్టం వచ్చిందట. ఆ నష్టాన్ని భర్తీ చేయడానికి కార్డువెల పదిపైసలకు పెంచారట. అయినా యిప్పుడు ఏటికి ఎనిమిదికోట్ల రూపాయలు నష్టం పెరిగిందట. ఈ కార్డు వ్యాపారం అచ్చిరాలేదని, కనుక కార్డును విరిపి వేయాలని అనుకుంటున్నట్లు తంతితపాలాశాఖ మంత్రి బ్రహ్మానందరెడ్డిగారన్నారట. ఈ విషయం ఫిబ్రవరిలో తేలిపోతుందట ఒహోమ్మండంగా వుంది.

పగ !

ఢిల్లీ పార్లమెంటు జరుగు తుండగా ఆభవనం మీద బాంబులువేసి, పార్టీలలోని అతిరథులను, మహారథులను నేలమట్టం చేయాలని బొంబాయికి చెందిన 27 ఏళ్ళ కన్యాలాల్ అనే యువకుడు మరికొంతమంది యువకులను పోగుచేశాడట. అతను సైన్యంలో కొన్నాళ్ళు పనిచేసి, ఏదోకారణం వల్ల ఉద్యోగం పోగొట్టుకొన్నవాడట. కన్యాలాల్ ఢిల్లీ వెళ్లి పార్లమెంటుభవనాన్ని, లోపల విషయాలను వివరంగా బొమ్మలు గీసుకుని సిద్ధపరచు కున్నాడట. బాంబులు, తుపాకులు అన్నీ సిద్ధంచేసుకునే లోగా పోలీసులు అతన్ని పట్టేశారట. ఈ దేశ ద్రోహచింతనకు కారణమేమిటని అడిగితే "పగ" అన్నాడట. అదేమంటే పోయినేడు బొంబాయికి చెందిన మాలట్ అనేచోట వో బిచ్చగత్తె ఆకలితో అలమటించి, విలవిలా తన్నుకుని చావటం తాను కళ్ళారాచూశానని చెప్పాడట. అంతేగాక జీవితంలో తానూ, తనతో తనలాగే చాలా మంది చావలేక బ్రతుకుతున్నారని, యీ స్థితికి కారణమైన దేశనాయకుల నందర్నీ నాశనంచేసి తీరాలని అనాడే తాను నిశ్చయించుకున్నానని అన్నాడట. సిద్ధార్థుడు వో శవాన్ని, మరో ముసలాడిని, యింకో దేన్నోచూసి జీవితంమీద రోసి, బుద్ధుడయ్యాడు — అవునా"

స్థానబలిమి....

జనవరి 11వ తేదీన న్యూఢిల్లీలో పట్టపగలు నడిబజారులో వో యిద్దరు పోలీసు కానిస్టేబుల్స్(!) ఒక రిక్షాలాగే వ్యక్తిని పట్టుకుని, చితకతన్ని, ఆరిక్షా టైరులు పీకేసి, అతన్ని మళ్ళీచావబాది పోలీసు జీపులో పడేసుకుపోయారట. ఈ సంఘటనంతా బోలెడుమంది ప్రేక్షకులు చూశారట. వో స్థానిక పత్రికల వార్తా విలేఖరి మాత్రం యిది చూడలేక స్కూటరులో ఆ జీపును వెంబడించి, పోలీసు స్టేషనుకు వెళ్ళి, ఆ వ్యక్తిని అలా చావబాదడం చట్టవిరుద్ధమని చట్టబద్ధమైన శిక్ష అతనికి విధించటమేగాని, ఆ విధంగా చితకగొట్టడం అన్యాయమని, అక్కడి ఇన్‌స్పెక్టరుకు నచ్చజెప్పబోయే సరికాయనకు కోపంవచ్చి "నీ పని నువ్వుచూసుకో" అన్నారట. వో హెడ్‌కానిస్టేబుల్‌కు మరింత కోపం వచ్చి "నీ దారిన నువ్వు పోకపోతే ఏం జరుగుతుందో కాసుకో.... అసలు నువ్వు నీ స్కూటరును ఆ ప్రదేశంలో ఆపడమే రూల్సుకు వ్యతిరేకం... కమాన్...నీ మీద కేసు..." అంటూ పరదా పడ్డాడట. అందుకనే స్థానబలిమికాని తన బలిమి కాదయా అన్నాడో మహానుభావుడేనాడో!

రైల్లో బందిపోట్లు

జనవరి 21వ తేదీన అలహాబాద్—కాన్పూరు ప్యాసింజరు రైలులో బందిపోట్లు జొరబడి, ఒకామెపద్ద నగలూ అవీ వూడలాక్కుని అడ్డొచ్చిన ఆమె 16 ఏళ్ళ కుర్రాణ్ణి రైల్లోంచి త్రోసేశారట. రైల్లోంచెవరో క్రిందపడి నట్లుతెలియడంతో కార్డురైలును ఆపి, రెండుఫర్లాంగులు వెనక్కు నడిపించిచూస్తే, చావు బ్రతుకుల మధ్య స్పృహతప్పి ఆ కుర్రాడు పడివున్నాడట. ఈ సంఘటన మగర్వారా—గంగా బ్రిడ్జిలకు మధ్య ప్రాంతంలో జరిగిందట.


హంతకుడు ఆకాశరామన్న !


జనవరి 10వ తేదీన బెంగుళూరు నుంచి మద్రాసు వచ్చిన వో ప్యాసింజరు బండి మూడవ తరగతి పెట్టెలో దొరికిన వో స్త్రీశవం గురించిన కేసు విషయంలో వో ఆకాశరామన్న వుత్తరం పోలీసులకు సహాయం చేసిందట. ఆ ఆకాశరామన్న తానే ఆమెను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడట. ఎద్దరూ రైలెక్కినట్లు బెంగుళూరు వదలి జాలారుపేట రైలుచేరక తాను నగలకోసం ఆమెను

ఆ రైల్లోనే హత్యచేసినట్లు అనక ఆమె శవాని కున్న ఒట్టలన్నీ విప్పి, గోనెలోను, దుప్పటిలోనూ ఆమెను చుట్టినట్లు అతను ఒప్పుకున్నాడట. రైల్లోహత్య ఎంత ఒడుపుగా చేశాడో ఆ మహానుభావుడు !

మనుషులపై కోతుల దాడి !

నేపాలుకు చెందిన భోజ్పూరుజిల్లాలోని మూడు గ్రామాల మీద కోతులు దాడి జరిపి ఆ వూరి ప్రజల నందర్నీ పారిపోయేలా చేశాయట. ఈ కోతులబాధపడలేక ఆ మూడు గ్రామాల ప్రజలూ తమ తమ ఇళ్ళూవాకిళ్ళూ వదిలిపెట్టి వచ్చేసినట్లు గ్రామస్థులు ఒప్పుకున్నారట. ఆ వానరులు తమ వనరులను సర్వనాశనం చేస్తున్నాయని, తమకు వాటిని ప్రతిఘటించే శక్తి లేనందువల్ల వూళ్ళువదలి వచ్చేయవలసొచ్చిందని వారన్నారట. ●





చిన్నారి చిలిపిచేష్టలు

దొంగ నిద్ర

ఒకసారి మా ఆరేళ్ళ పాప వాళ్ళ నాన్న గారొచ్చేసరికి నిద్ర పోయింది. శ్రీవారు స్నానం, భోజనం పూర్తి అయిన తరువాత పడక దగ్గరకు వచ్చారు. పాప వాళ్ళ నాన్న గారి పక్కమీద పడుకుని వుంది. "పాపా, పాపా!" అంటూ శ్రీవారు అటూ ఇటూ దొర్లించారు. పాప ఎటు దొర్లించినా తిరిగి యథాస్థానానికి వచ్చి చేరుతూంది. శ్రీవారికి అనుమానమొచ్చి ఎంగి మొఖాన్ని పరీక్షగా చూశారు. పాప కళ్ళు రెపరెప లాడుతున్నాయి. నాకు నవ్వాగలేదు. అయినా శ్రీవారు సైగ చేయడంవల్ల నేను నవ్వలేదు. అంటే పాప కళ్ళనిబట్టి దానిది దొంగ నిద్ర అని తెలి పోయింది. వాళ్ళ నాన్నగారు ఎంత లేపినా పాపది దొంగ నిద్ర కావడంవల్ల లేవడంలేదు. శ్రీవారొక తమాషా చేస్తాను చూడమంటూ పాప రెండు చేతులూ పైకి ఎత్తి పెట్టారు. "చూడు శాంతా! పాప నిజంగా నిద్ర పోతుంటే నేను కలిపిన ఈ చేతులు ఇలాగే నిలబడి వుండాలి. దొంగ నిద్ర అయితే చేతులు పడిపోవాలి. ఏ సంగతీ ఇప్పుడు తెలి పోతుంది చూడు" అంటూ పాప రెండు చేతులూ పైకెత్తి అరచేతులు రెండూ ఒక్కటిగా కలిపారు. ఆశ్చర్యం! పాప చేతులు పడిపోకుండా ఎలా కలిపినవి అలాగే నిటా రుగా వున్నాయి. దాదాపు ఒక మూడు నిమి షాలదాకా పాప చేతులు అలానే వున్నాయి. నాకు నవ్వాగక ఫకాలు మన్నాను. శ్రీవారికీ నవ్వాగిందికాదు. "అబ్బ! పాపా, చాలా మంచి నిద్ర తల్లీ నీది, ఇక లేమ్మా!" అని చిన్నగా లేపారు. చేతులు క్రిందికి దింప బోతున్నా స్ప్రింగులా వెంటనే పైకి లేచి పోతున్నాయి. శ్రీవారు కితకితలు పెట్టేసరికి ఒక్కసారిగా ఫక్కుమంది. "నాన్నా నేను నిద్రపోతుంటే లేపుతావేం?" అంటూ వాళ్ళ నాన్నను నిలదీసింది. "చూడమ్మా నిద్రలో మన శరీరం మన స్వాధీనంలో వుండ" దంటూ దానికి వివరించి చెప్పేసరికి విస్తుపోయి కళ్ళు చక్రాల్లా తిప్పింది పాప.

— జి. రాజేశ్వరి (నరసరావుపేట)

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor. S. Radhakrishna



“జీవితరంగము” లో ప్రమీల

ఈవారం ముఖచిత్రం
తార విజయనిర్మల అని
గమనించ గోరుతాము


ఆమె రాచరిక
సౌందర్య రహస్యం
ఐటెక్స
సౌందర్య సాధనములు
ముప్పై
సంవత్సరములకు
పైగా ప్రసిద్ధి
చెందిన సౌందర్య
పరికరాలు
EYETEX
EYETEX BINDI
EYETEX BINDI
EYETEX
Aravind Laboratories
MADRAS-33